



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 15 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 5 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-




నాటి ఆర్జేడీ ఆటవిక పాలన వల్లే

## నేటికీ బీహారీల వలసలు

- గత రెండేళ్లలో బిహార్‌లో 50 లక్షల మందికి ఉపాధి
- ప్రధాని నరేంద్ర మోదీ
- ఆర్జేడీ హయాంలో విద్యావ్యవస్థ నిరాధరణకు గురైంది
- పిల్లలకు సరైన విద్యావశాలు దొరకలేదు
- అభివృద్ధి లేకపోవడంతో పేదరికంలో ఉన్న పేరెంట్స్ పిల్లలను బడులకు బదులుగా పనులకు పంపారు
- దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉంది
- బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుంది

6

## దేశ పౌరుల రక్షణ కోసం హద్దులన్నీ మీరుతాం



- దేశ పౌరుల భద్రతకు, దేశ సమగ్రతకు ముప్పు పొంచి ఉంటే ఎలాంటి నిర్ణయాత్మక చర్యలకు దిగుతామో ఇప్పటికే నిరూపించాం
- పాకిస్థాన్ భూభాగంలో భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసినప్పుడు తాము మతం చూడలేదు
- కానీ పహల్గాంలో పౌరులను మతం అడిగి చంపారు
- భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

- ఇక ఆటోస్టాండ్ల వద్ద పడిగాపులు పడక్కర్లేదు
- సంక్షేమం కోసం వారే సభ్యులుగా ప్రత్యేక బోర్డు
- ప్రభుత్వ పథకాలకు ప్రచారకర్తలుగా మారండి
- పర్యాటకపరంగానూ సహకరించండి
- ఆటో ఎక్కినవారికి ప్రభుత్వ మంచిని తెలపండి
- గత ప్రభుత్వంలో ఎన్నో కష్టాలు పడ్డారు..
- దుష్టులను రానీయొద్దు.. వైకుంఠపాళీ ఆడొద్దు
- కొత్తవారు వస్తే ఏదో ఇస్తారని చూడొద్దు
- ఆటోడ్రైవర్ల సేవలో.. పథకం ప్రారంభించిన సీఎం

# సర్కారీ క్యాబ్ యాప్



## ఉబర్, ఓలాలకు దీటుగా తెస్తాం.. ఆటో డ్రైవర్లకు బిజినెస్ ఇస్తాం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలో ఆటోడ్రైవర్లకు బిజినెస్ ఇచ్చి, వారిని ఆదుకునే బాధ్యత జఓతీసుకుంటానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. "ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి ఆన్‌లైన్ యాప్స్‌ను తీసివేయలేం. కానీ ఆటోవాలాలు, క్యాబ్‌వాలాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా 'సర్కారీ క్యాబ్' బుకింగ్ యాప్‌ను రూపొందిస్తాం. ఈ యాప్ ఆర్థికంగా ఊరట కలిగిస్తుంది. ఆటోస్టాండ్ల వద్ద రోజంతా పడిగాపులు పడాల్సిన అవసరం ఇకపై ఉండదు. ఈ యాప్ నిర్వహణ కోసం కంట్రోల్‌రూమ్ ఏర్పాటుచేస్తాం. అందు లో ఆటో, క్యాబ్ డ్రైవర్లే సభ్యులుగా ఉంటారు" అని సీఎం తెలిపారు. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం వారినే సభ్యులుగా చేసి త్వరలో ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. శనివారం విజయవాడలోని సింగ్‌నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో 'ఆటో డ్రైవర్ల సేవలో...' పథకాన్ని ఆయన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది లబ్ధిదారులకు రూ.436కోట్ల చెక్‌ను ఈ పథకం కింద అందించారు. సమావేశంలో చంద్రబాబు ప్రసంగించే సమయానికి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15వేలు జమ అయినట్టు మెసేజ్‌లు వచ్చాయి. 'డబ్బులు పడ్డాయా...' అని అడిగినపుడు ఈ మెసేజ్‌లను ఆటోడ్రైవర్లు సంతోషంగా చంద్రబాబుకు చూపించారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ఆటో డ్రైవర్లకు వేధింపులు ఉండవని, జరిమానాలు రద్దుచేసే అంశాన్ని కూడా పరిశీలిస్తానని సీఎం తెలిపారు. అలాగని రోడ్ల మీద ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించవద్దని, ఎక్కడిపడితే అక్కడ సీసీ కెమెరాలు ఉంటాయని, అనవసరంగా ఇబ్బందులు తెచ్చుకోవద్దని హితవు పలికారు. విజయవాడలో పూర్తిగా సీఎన్‌జీ ఆటోలు నడుస్తున్నాయని, ఇది చాలా మంచి విషయమని, ఇక ఈవీలను ఎక్కువగా ప్రోత్సహిస్తామని సీఎం తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. "గత ఎన్నికలలో మాకు 94 శాతం స్ట్రైక్ రేట్‌తో పట్టం - మిగతా2లో




## లద్దాఖ్‌కు చైనా ముప్పు!?

- పూర్తిస్థాయి రాష్ట్ర హోదాతో సమస్యలు
- ఆరో షెడ్యూల్‌లో చేరిస్తే మణిపూర్ వంటి ప్రాంతాల నుంచీ డిమాండ్లు

6

# భారమైనా.. భరిస్తాం!

- సమర్థ నాయకత్వం, ప్రణాళికా బద్ధమైన పాలనతో రాష్ట్రాభివృద్ధి
- 'స్త్రీశక్తి'తో వారికి జరిగే నష్టం గురించి క్యాబినెట్‌లో మాట్లాడా
- రోడ్లపై గుంతలు, గ్రీన్‌ట్యాక్స్ సమస్యలూ పరిష్కరించాం
- 'ఆటోడ్రైవర్ల సేవ'లో ప్రారంభ సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'ఆటో డ్రైవర్ల సేవ'లో పథకం అమలుతో రాష్ట్ర ప్రభుత్వంపై రూ.436 కోట్ల భారం పడుతుందని, అయినా ఆ భారాన్ని ఆనందంగా భరిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సమర్థవంతమైన నాయకత్వం, ప్రణాళికా బద్ధమైన పాలన ఉంటే ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు. మహిళల కోసం 'స్త్రీశక్తి' పథకాన్ని ప్రవేశపెడుతున్న సందర్భంగా క్యాబినెట్‌లో చర్చ జరిగిందని, ఈ పథకం కారణంగా ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుందన్న అంశాన్ని తాను ప్రస్తావించానని తెలిపారు. ఆటోడ్రైవర్లను నిర్లక్ష్యం చేయబోమని, ఎట్టి పరిస్థితుల్లో వారికి నష్టం జరగకుండా చూస్తామని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. అయితే దీనికి సమయం కావాలని అడిగారని, ఆ రోజు చెప్పిన - మిగతా2లో

## తుప్పుపట్టిన ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు

- అందుకే 250 కోట్లు కేటాయించాం... శ్రీశైలానికీ 350 కోట్లు
- గోదావరి ఏటిగట్ల పటిష్ఠతకు 43 కోట్లతో పనులు
- ఇరిగేషన్‌లో రూ.18 వేల కోట్ల బిల్లులు పెండింగ్
- సవాళ్లను అధిగమించి పని చేస్తాం: మంత్రి నిమ్మల

2





జనసేన బలోపేతానికి

## త్రిశూల వ్యూహం

- పార్టీ శ్రేణులతో ప్రజాప్రతినిధులు మమేకమవ్వాలి
- కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుని ఒకే గళం వినిపించాలి
- యువత, మహిళల సంక్షేమం, రక్షణకు ప్రాధాన్యమివ్వాలి
- జనసేన ఎమ్మెల్యేల సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

2

# 9న వైఎస్ జగన్ అనకాపల్లి పర్యటన

భీమబోయినపాలెంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని పరిశీలించనున్న మాజీ సీఎం

7న పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో సమావేశం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 7, 8, 9 తేదీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఈ మేరకు వివరాలను శనివారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. ఈ నెల 7వ తేదీన వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. 8వ తేదీన భీమవరం(పెద అమిరం)లో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదురాజు కుమారుడి వివాహ వేడుకకు హాజురవుతారు. ఈ నెల 9వ తేదీన అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలంలోని భీముబోయినపాలెంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీని సందర్శించనున్నారు. - మిగతా2లో



నక్సల్స్‌తో చర్చల్లేవ్..

## లొంగిపోండి

- కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హెచ్చరిక
- మావోయిస్టులతో చర్చల ప్రసక్తే లేదు
- మావోయిస్టులను మార్చి 31, 2026 నాటికి నిర్మూలిస్తాం
- ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తాం
- నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలి

6

# సర్కారీ క్యాబ్ యాప్

-మొదటిపేజీ తరువాయి

కట్టారు. రాబోయే రోజుల్లో ఈ సీట్లు పెరగాలా ? వద్దా ?పదహారు నెలల ముందు రాష్ట్రం పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వ్యవస్థలన్నీ నిర్వీర్యమై, అభివృద్ధి పూర్తిగా ఆగిపోయింది. నాల్గవసారి ముఖ్యమంత్రిని అయినా.. నాకే చాలా రోజులు పరిస్థితులు అర్థం కాలేదు. ఏం చేయాలని రాత్రుళ్లు ఆలోచించేవాడిని. నిద్ర కూడా పట్టేది కాదు. నా మీద ఉంచిన విశ్వాసం కారణంగా ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకూడదన్న ఉద్దేశంతో పని ప్రారంభించాను. కూటమి పాలన మొదలై 15 నెలలు గడిచింది. చరిత్రలోనే ఇన్ని సంక్షేమ కార్యక్రమాలను అందించటం ఎప్పుడైనా చూశారా? సూపర్‌సిక్స్ హామీలను చేసి చూపిస్తున్నాం. దేశంలోనే ఎక్కడా జరగని సంక్షేమం ఏపీలో జరుగుతోంది. పెన్షన్లను రూ. 4 వేలు, రూ 6 వేలు, రూ 10 వేలు, రూ 15 వేలకు పెంచాం. తల్లికి వందనం కింద ఒక కుటుంబంలో ఎంతమంది ఉంటే అంత మందికీ సహాయం అందిస్తున్నాం. ఆడబిడ్డల కోసం మూడు ఉచిత సిలిండర్లను ప్రభుత్వం అందిస్తోంది. అన్ని వర్గాల సంక్షేమాన్ని చూస్తున్నాం. పేదవాడి ఆకలి తీర్చటానికి అన్న క్యాంటీన్లను నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో ప్రజలందరి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని యూనివర్సల్ హెల్త్ పాలసీని తీసుకువస్తున్నాం. ఈ పథకంలో భాగంగా రూ. 25 లక్షలు ఖర్చుపెట్టి మీ ఆరోగ్యాన్ని కాపాడే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది. ?జీఎస్టీ తగ్గింపుల కారణంగా ధరలు అదుపులోకి వస్తున్నాయి. ఎలక్ట్రానిక్స్, ఆటో మొబైల్స్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గుతున్నాయి. మహిళల కోసం స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించాం. దీనికింద పెట్టిన ఉచిత బస్సులు ఎక్కి శ్రీకాకుళం, విజయనగరం వంటి ప్రాంతాల నుంచీ దసరా ఉత్సవాల కోసం మహిళలు భారీ సంఖ్యలో విజయవాడకు తరలివచ్చారు.”

**వైకుంఠపాళీ ఆడొద్దు**

“ప్రజాకంఠకుడు మహిషాసురుడిని కనకదుర్గమ్మ సంహరించిన రోజును దసరాగా జరుపుకొంటాం. మరో ప్రజా కంఠకుడు నరకాసురుడిని సత్యభామతో కలిసి శ్రీ కృష్ణుడు సంహరించిన రోజున దీపావళి చేసుకుంటాం.



రాష్ట్రంలో గత ఐదేళ్లలో ప్రజా కంఠక పాలన ఏవిధంగా జరిగిందో మీరంతా చూశారు. నాసిరకం మద్యం ఇచ్చి ఎన్నో కుటుంబాల ఉసురుతీసుకున్నారు. పేదవాళ్లకు ఇవ్వాల్సిన ఇసుక ను బొక్కేశారు. పేదల ఇంటి జాగాలను లాగేశారు. ఇలాంటి దుర్మార్గులు రాజకీయాలకు పనికిరారు. ప్రజలు కూడా వైకుంఠపాళీ ఆడొద్దు. అన్నీ ఇస్తున్నా ఇంకొకరు ఏదో ఇస్తారని చూడవద్దు. ఏమీ ఇవ్వరు. గుజరాత్‌లో మూడు దఫాలుగా బీజేపీ ప్రభుత్వం ఉంది. అందువల్ల అక్కడ అభివృద్ధి సాధ్యమైంది. ఏపీలో కష్టకాలంలో నేను, పవన్ కల్యాణ్, బీజేపీ...ఎన్డీఏగా కలిశాం. మీ కష్టాలు తీరుస్తామని ఆనాడు ఇచ్చిన మాటను మేం నిలుపుకొన్నాం.” అని చంద్రబాబు తెలిపారు.

**స్ఫూర్తిని నింపిన ఆటోడ్రైవర్**

“ఆటోలో ఎక్కించుకుని నన్ను సభావేదిక దగ్గరకు తెచ్చిన అఫ్సర్‌ఖాన్ తండ్రి డ్రైవర్. అందువల్ల అఫ్సర్‌ఖాన్ కూడా ఆటో వృత్తినే నమ్ముకుని జీవిస్తున్నారు. కానీ, తన కుమారులు మాత్రం తనలా కాకూడదని ఆయన గట్టి నిర్ణయం తీసుకున్నారు. అందులోభాగంగా పెద్దబ్బాయిని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిస్తున్నారు. చిన్నబ్బాయి ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఆ అబ్బాయి పదో తరగతిలో రాష్ట్రంలో నాల్గో ర్యాంక్ సాధించాడు. అందరూ అఫ్సర్‌ఖాన్ కుటుంబం నుంచి స్ఫూర్తిని పొందాలి.”

**ఇప్పుడు మిమ్మల్ని తీసుకెళ్తున్నా.. లోకేశ్‌కు మహిళా డ్రైవర్**

‘ఆటో నడపడం వల్ల ఏ ఇబ్బందులు ఉన్నాయమ్మా’ అంటూ మహిళా ఆటో డ్రైవర్ స్వర్ణలతను మంత్రి లోకేశ్ అడిగారు. పెద్దగా ఇబ్బందులు లేవన్నా... అని ఆమె బదులిచ్చారు. ‘2014–15 మ??ధ్య ఆటో నడపడం నేర్చుకున్నాను. నాకు అప్పట్లో ఆటో తాళం చంద్రబాబు ఇచ్చారు. ఇప్పుడు మీరు నా ఆటో ఎక్కారు. నాకు చాలా సంతోషంగా ఉంది’ అని ఆమె తెలిపారు. కూటమి నేతలకు మద్దతుగా తరలివచ్చిన వేలాది మంది నాయకులు ప్రజలతో ప్రకాశం బ్యారేజీ పరిసరాలు కిక్కిరిశాయి. బాణాసంచా కాలుస్తూ తీన్మార్ డప్పులతో నేతలకు వారంతా ఘనస్వాగతం పలికారు.

# రిలే దీక్షలకు దిగిన పీహెచ్‌సీ వైద్యులు

లబ్బీపేట

తమ దీర్ఘకాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) వైద్యులు నిరవధిక సమ్మెకు దిగారు. గత ఏడాది ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నేటివరకూ అమలుచేయకపోగా, వాటికి విరుద్ధంగా చర్యలు తీసుకోవడాన్ని నిరసిస్తూ విధులు బహిష్కరించిన వైద్యులు.. తాజాగా విజయవాడ ధర్నా చౌక్‌లో రిలే దీక్షలు చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం ప్రారంభించిన ఈ రిలే దీక్షలు తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ కొనసాగుతాయని అసోసియేషన్ నేతలు ప్రకటించారు.

**ప్రధాన డిమాండ్లు ఇవే..**

అన్ని విభాగాల్లో 20 శాతం ఇన్‌సర్వీస్ పీజీ సీట్లు కొనసాగించాలి. టైమ్‘చిండ్ ఉద్యోగోన్నతులు ప్రకటించాలి. డీసీఎస్, సీఎస్ ఉద్యోగోన్నతులకు కాలపరిమితి నిర్ణయించాలి. ఆ మేరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలి.

గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న వైద్యులకు వెంటనే ట్రైబల్ అలవెన్స్ మంజూరుచేయాలి.

సంచార వైద్యసేవలకు తక్షణమే సదుపాయాలు కల్పించాలి. వాయిదా పడిన వేతన పెంపును తక్షణమే అమలుచేయాలి.

**రోగులను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంలేదు..**

రోగులను ఇబ్బంది పెట్టాలనేది తమ ఉద్దేశంకాదని, తమ సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తోనే



సమ్మెకు వెళ్లినట్లు తెలిపారు. తాము సమ్మెకు వెళ్తామని అధికారులకు ముందుగానే నోటీసులు ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వం స్పష్టమైన లిఖితపూర్వక హామీ ఇచ్చేవరకూ తమ నిరసన కొనసాగుతుందని స్పష్టంచేశారు.

**ఆమోదయోగ్యమైన డిమాండ్లు సీఎం దృష్టికి**

సాక్షి, అమరావతి: పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లలో ఆమోదయోగ్యమైన వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకుంటామని వైద్య, ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ తెలిపారు. వెంటనే వైద్యులు విధుల్లో చేరాలని కోరారు. శనివారం సత్యకుమార్ మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. వారి డిమాండ్లను పరిశీలిస్తామన్నారు. ఇన్ సర్వీస్ కోటా, ఉద్యోగ సర్వీస్ డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెలిపారు.

# చీరతో పట్టేసే చేప పిల్లలకు భలే డిమాండ్!

కాకినాడ

గోదావరి జిల్లాలో పులసకు ఉన్న క్రేజ్ ఎంటో అందరికీ తెలిసిన విషయమే.. కానీ ఇంచుమించు ఈ సీజన్‌లో అంతే క్రేజ్ ఉన్న గోదావరి వంటకం చీరమేను..చీరతో వేటాడే ఈ చేపపిల్లల టేస్ట్ గురించి మాంస ప్రియులు చాలా గొప్పగా చెబుతారు.. గోదావరిలో లభ్యమయ్యే ఈ చీరమేను రేటు కూడా అంతే స్థాయిలో కూడా ఉంటుంది.. ఎందుకంటే ఇది అరుదుగా దొరికే సీజనల్ చీరమేను కావడం దీనికి ప్రధాన కారణం కూడా.. పూర్వ కాలంలో శేరు, తవ్వ, సోల కింద కొలిచి అమ్మే ఈ చీరమేను ఇప్పుడు కిలోల లెక్కన అమ్మకాలు సాగిస్తున్నారు.. ఒక కిలో చీరమేను రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయాలు జరుగుతుండగా పావుకిలో చొప్పున కూడా అమ్మకాలు చేస్తుంటారు స్థానికంగా ఉన్న మత్స్యకారులు.. తాజాగా చీరమేను సీజన్ కావడంతో పుదుచ్చేరీ యానం మార్కెట్‌లో చీరమేను ను కొనేందుకు ఎగబడుతున్నారు నాన్ విజిటేరియన్స్...గోదావరిలో సెప్టెంబరు, అక్టోబర్, నవంబర్ మాసాల్లో చీరమేను అరుదుగా దొరుకుతుంది కాబట్టే దీనికి ఇంత ధర పలుకుతుందంటుంటారు చీరమేను గురించి తెలిసిన వారు.. గోదావరి ప్రవాహం ఓ వైపు, గోదావరిపై వీచే శీతల చల్లగాలులు మరోవైపు ఈ ప్రభావానికి దొందు జాతికి చెందిన చేపపిల్లలు సమూహంగా నీటి ఉపరితలంపై నురగలా తేలుతూ కదులుతుంటాయి.. నీటి అలల తాకిడికి నురగ కూడా తోడవ్వడంతో ఈసమూహాన్ని గుర్తించడం మత్స్యకారులకు చాలా తేలిక అవుతుంది.ఈ సమూహం కదలికను ముగ్గురు కలిసి చీరతో అడ్డుకుని పట్టుకుంటారు.. ఇది గట్టుపైకి తీసుకువచ్చి నీళ్లల్లో కడిగి బకెట్లలో ఉంచుతారు.. వలకు చిక్కని చిన్న చేపపిల్లలు కావడం, సమూహంగా కదలడంతో వలకు చిక్కవు గనుక ఈ చేపపిల్లలను చీరతో మాత్రమే పట్టుకునేందుకు వీలవుతుంది.. అందుకే వీటికి చీరమేను అనే పేరు వచ్చిందంటారు.. అయితే ఇప్పుడు సీడ్ నెట్ అందుబాటులో ఉండడంతో వీటితోనే చీరమేనును పట్టుకుంటున్నారు.గోదావరిలో అరుదుగా దొరికే ఈ సీజనల్ చీరమేను కోసం మాంస ప్రియులు ఎందుకు అంతగా ఎగబడతారు అంటే వీటితో చేసిన వంటకాలు అంత రుచిగా ఉంటాయని చెబుతుంటారు.. చీరమేను చింతకాయ పులుసు, చీరమేను మసాలా కూర, చీరమేనుతో కలిపి వేసిన గారెలు అబ్బో ఆ టేస్టే వేరే లెవెల్ అంటుంటారు గోదావరి ప్రజలు.. ప్రస్తుతం చీరమేను యానాం చేపలమార్కెట్‌లో దొరుకుతోంది.. ధవళేశ్వరం, అంతర్వేది, ఓడలరేవు ఇలా చాలా ప్రాంతాల్లో ఈ చీరమేను లభ్యం అవుతోంది.. కొంతమంది కిలోల లెక్కన విక్రయాలు చేస్తుండగా కొంత మంది కొలతల ప్రకారం అంటే శేరు, తవ్వ, సోల ప్రకారం కొలిచి అమ్ముతున్నారు. ఇక రోజూ జరిగే యానాం చేపల మార్కెట్‌లో నిర్వహించే వేలంపాటలో ఓ బకెట్ చీరమేను రూ.26 వేలు నుంచి రూ.28 వేలు వరకు ధర పలుకుతుండడం విశేషం.. ఇక్కడి నుంచి విదేశాలకు సైతం ప్యాక్‌చేయించుకుని తీసుకెళ్తున్నారు మాంస ప్రియులు..

## 9న వైఎస్ జగన్ అనకాపల్లి పర్యటన

-మొదటిపేజీ తరువాయి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ పేరుతో ప్రైవేటుకు ఇవ్వడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకోవడంలో భాగంగా భీమబోయినపాలెంలో నిర్మాణం నిలిపివేసిన ప్రభుత్వ వైద్య కళాశాలను మాజీ సీఎం వైఎస్ జగన్ సందర్శిస్తారు.

## భారమైనా.. భరిస్తాం!

-మొదటిపేజీ తరువాయి

ప్రకారమే ఆటోడ్రైవర్లకు రూ.15వేల ఆర్థిక సహాయాన్ని అందించే పథకానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఇబ్బందికరమైన విషయమే అయినప్పటికీ కచ్చితమైన ప్రణాళికతో దీన్ని అమలు చేస్తున్నారని కొనియాడారు. ఈ పథకంలో మొత్తం 2.90 లక్షల మంది ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్ల లబ్ధి కలుగుతుందన్నారు. ఎన్నికల ముందు పిఠాపురంలో ఆటోలో ప్రయాణించినప్పుడు ఆటోడ్రైవర్లు తమ ఇబ్బందులను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. గ్రీన్ ట్యాక్స్ సమస్యను ఏడాదిన్నరలోపే పరిష్కరించామని తెలిపారు. అలాగే రోడ్లపై గోతుల కారణంగా గత వైసీపీ ప్రభుత్వంలో వాహనమిత్ర కింద ఇచ్చిన రూ.10వేలు మరమ్మతులకే ఖర్చయి పోయేవని పవన్ వివరించారు. దెబ్బతిన్న రోడ్లను కూటమి ప్రభుత్వం పూడ్చటంతో పాటు వాటిని అభివృద్ధి చేసిందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆటోవాలాలకు ఎలాంటి మరమ్మతులు చేసుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. గత ప్రభుత్వం ఇచ్చిన దానికంటే అదనంగా రూ.5వేలు పెంచి ఆర్థిక సహాయం కింద రూ.15వేలు అందించడం మంచి విషయమన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్నందుకు సీఎం చంద్రబాబుకు పవన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## తుప్పుపట్టిన ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు

రాజమహేంద్రవరం

పోలవరం ప్రాజెక్టును 2027 డిసెంబరు నాటికి పూర్తిచేసేలా చర్యలు చేపడుతున్నామని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ‘గత వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడంతో వాటి భద్రత, పటిష్ఠత ప్రశ్నార్థకంగా మారాయి. ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు తుప్పు పట్టిపోయాయి. గేట్లు కొట్టుకుపోతే మళ్లీ ఏడాదిపాటు తూర్పు, పశ్చిమలో ఒక్క పంట కూడా ఉండదు. అందుకే రూ.250 కోట్లు ఈ బ్యారేజీకి కేటాయించాం. వచ్చే వర్షాకాలం సీజన్ లోపు ఆ గేట్లన్నీ మార్చాలి. శ్రీశైలం ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉంటే దానికి రూ.350 కోట్లు ఖర్చు పెడుతున్నాం. గత ప్రభుత్వం నిర్వాకంతో బ్యారేజీలకు లాకులు, డోర్లు, షట్లర్లు, ఇతర మరమ్మతులు చేయలేదు. కనీసం గ్రీజ్ పెట్టలేదు. అందుకే గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయిన పరిస్థితి ఏర్పడింది. అన్నమయ్య ప్రాజెక్టు విషయంలోనూ ఇలాగే జరిగి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఏటిగట్లు పటిష్ఠత విషయంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శించారు. వైసీపీ పాలనలో ఒక్క రూపాయి కూడా ఏటిగట్టుకు ఖర్చుపెట్టలేదు. 1986లో 36 లక్షల క్యూసెక్కుల భారీ వరద వచ్చింది. అం దుకు అనుగుణంగా ఏటిగట్లు పటిష్ఠతకు చర్యలు తీసుకుంటున్నాం. పశ్చిమగోదావరిలో రూ.18 కోట్లు, రాజోలులో రూ.25 కోట్లతో బండ్ కోత నివారణ పనులు చేస్తున్నా ్నం. గత ప్రభుత్వం రూ.14 లక్షల కోట్ల అప్పు మా నెత్తిమీద పెట్టింది. ఒక్క ఇరిగేషన్ శాఖలోనే రూ.18 వేల కోట్ల బిల్లులు బకాయిలున్నాయి. ఆ అప్పులు, వడ్డీలు కట్టాలి. బకాయిలు చెల్లించాలి. ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది. సవాళ్లను అధిగమించి పనిచేస్తాం’ అని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు.

## జనసేన బలోపేతానికి త్రిశూల వ్యూహం

అమరావతి

‘కూటమిని బలపరుస్తూనే జనసేన పార్టీ బలోపేతానికి ప్రణాళికాబద్ధంగా అడుగులు వేయాలి. దీనికోసం త్రిశూల వ్యూహాన్ని అమలు చేయాలి. ఇందుకు సంబంధించిన విధివిధానాలు త్వరలోనే తెలియజేస్తాం. వాటిని ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో అమలు చేయాలి’ అని జనసేన ప్రజాప్రతినిధులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. శనివారం రాత్రి మంగళగిరిలోని జనసేన ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ శాసన సభ పక్ష సమావేశం నిర్వహించారు. 3గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో జనసేన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. పాలన, రాజకీయపరమైన అంశాలపై పవన్ వారికి దిశా నిర్దేశం చేశారు. ‘ప్రజా ప్రతినిధులుగా అందరం యువత, మహిళల ఆకాంక్షలను అర్థం చేసుకోవడం చాలా అవసరం. ఈ వర్గాల అభివృద్ధి, సంక్షేమం, రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి’ అని పవన్ స్పష్టం చేశారు. ‘ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ 5 నియోజకవర్గాల చొప్పున బాధ్యత తీసుకొని పార్టీ శ్రేణులతో మమేకం కావాలి. జనసైనికులు, వీర మహిళలకు భరోసా కల్పించాలి. వారితో పాటు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించండి. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారులకు సంక్షేమం ఏ విధంగా చేరుతోంది, యువతకు నైపుణ్య శిక్షణ, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం తదితర విషయాలపై దృష్టి సారించండి. రహదారుల కల్పన, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించాలి. ప్రభుత్వంద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలి. ఇందుకోసం ఒక్కోఅంశంపై ఒక్కో కమిటీ వేసుకుందాం. ఆరు వారాల్లోగా ఆయా కమిటీలు నివేదికలు అందించాలి.” అని పవన్ తెలిపారు.

**నవ తరంతో మాట్లాడండి**

‘జనసేన పార్టీకి మిలీనియల్స్ బలంగా నిలిచారు. వారిఆకాంక్షలు గ్రహించాలి. జెన్ జీ తరంతోనూ ఎప్పటికప్పుడు మాట్లాడుతూ, చర్చిస్తూ ఉండండి. వాళ్లు ప్రతి విషయాన్ని గమనిస్తూనే ఉంటారు. గత ప్రభుత్వం రుషికొండ ప్యాలెసను నిర్మించి, ఎన్ని రూ.వందల కోట్లు వృథాచేసిందో వారికి తెలుసు. మనం కచ్చితంగా రుషికొండ ప్యాలెసను సద్వినియోగపరచడంపై దృష్టిపెట్టాలి. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ తదితరులు ఈసమావేశంలో పాల్గొన్నారు.

**ప్రధాని మోదీకి ధన్యవాదాలు**

జీఎస్టీ 2.0 సంస్కరణలు అమలు చేస్తున్న ప్రధాన మోదీకి ధన్యవాదాలు తెలియజేసే తీర్మానాన్ని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రవేశపెట్టగా, సుందరపు విజయ్‌కుమార్ బలపరిచారు. సమావేశంలో తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు.

## అరణి శ్రీనివాస్‌కు తప్పని పాత వాసనలు

తిరుపతి

తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహంగా ఉన్నట్లు కనిపిస్తుంది. వైసీపీ నుంచి వచ్చి పార్టీలో చేరినా ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు. పొత్తులో భాగంగా రాయలసీమలోని తిరుపతితో పాటు రైల్వే కోడూరు నియోజకవర్గాలను ఎంచుకున్నారు. చంద్రబాబు నాయుడు కూడా నాడు పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారు. దీంతో కూటమి గాలిలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి జనసేనలోకి గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా వైసీపీలో ఉన్న ఆయన పార్టీ మారి తిరుపతి జనసేన ఎమ్మెల్యే అయ్యారు. కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరణి శ్రీనివాసులు పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, జనసేన క్యాడర్ ను పక్కన పెట్టి కొందరు వైసీపీ నేతలకు టచ్ లో ఉన్నారంటూ ఆరో?పణలు పలు దఫాలు ఎదుర్కొన్నారు. జనసేన నాయకులే ఆరణి శ్రీనివాసులుపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు.

### భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై

## దృష్టి పెట్టి న్యాయం చెయ్యాలి

**100 మందికి కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం ఏర్పాటు - మెప్మా ద్వారా కార్మికులకు లోన్స్ ఇవ్వాలి - బొజ్జా రామకృష్ణ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం స్థానిక విక్రమ హాలు నందు ఎలక్ట్రికల్ వర్కర్స్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రెసిడెంట్ బొజ్జ రామకృష్ణ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వర్కర్స్కు దసరా ధమాకా అనే కార్యక్రమంలో భాగంగా 150 మందికి గిఫ్టులు అందచేశారు. అలాగే ఎలక్ట్రికల్ వర్కర్స్ కు దీపావళి శుభాకాంక్షలు తెలియజేస్తూ నవంబర్ రెండున ఎలక్ట్రికల్ వర్కర్స్ కుటుంబ సభ్యులకు కార్తీక వన సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేయడమైనదన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రికల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని యొక్క కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని తెలియజేసారు. అనంతరం ఎలక్ట్రికల్ కార్మికులకు అనునిత్యం ప్రమాదంలో ఉన్నటువంటి ఎలక్ట్రికల్ కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం సుమారు వందమందికి ఏర్పాటు చేయడమైనదన్నా రు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు కూడా ఈఎస్ఐ సదుపాయం వినియోగించుకొని యూనియన్‌కి మంచి పేరు తీసుకురావాలని తెలియజేసారు. అలాగే ప్రభుత్వం ఇంతవరకు భవన నిర్మాణ కార్మికులపై దృష్టి పెట్టకపోవడం చాలా దారుణమని ఈ మధ్య కాలంలో ఆటో వార్కి వాహన మిత్ర అనే పేరు చెప్పి వారికి 15 వేల రూపాయలు వేయడం తద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఉండి చెస్ ద్వారా వసూలు చేసే సొమ్ము ఉండి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉన్నదని దీనివలన కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ అన్నీ ఏ విధంగానూ ముందుకు రావట్లేదని అలాగే ఈమధ్య కాలంలో వలసదారులకు మరియు ఉపాధి హామీ కూలీలకు ఏ విధమైన చలనాలు కూడా కట్టుకుంటూ వారిని భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించడం తద్వారా వారికి సంక్షేమ బోర్డు నుండి మేలు చేయాలని నిర్వీర్యం చెయ్యాలి అనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదనీ కానీ అది మంచి పద్ధతి కాదని భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డులో ఉన్న నిధులు అన్నీ ఈ రకంగా బయట వాళ్లకి దారా దత్తం చేయడం దారుణమని ఎప్పటికైనా ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులపై సరైన దృష్టి పెట్టి వారికి న్యాయం చేయాలని అలాగే అసెంబ్లీలో 175 మంది ఉన్న అసెంబ్లీలో కేవలం ఒక్కరు తణుకు ఎమ్మెల్యే మాత్రమే మాట్లాడడం చాలా దురదృష్టం ఇప్పటికైనా ప్రభుత్వం పునరా ఆలోచన చేసి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మికులపై ప్రత్యేకమైన దృష్టి పెట్టాలని తీర్మానం చేయడమైనది. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎంవి జీవీ ప్రసాద్, గౌరవ సలహాదారులు కాకి రవిబాబు, గౌరవ సలహాదారులు బోర వెంకట గోపాలకృష్ణారెడ్డి, ప్రెసిడెంట్ బొజ్జ రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ వీరవల్లి గంగాచార్యులు, సెక్రెటరీ ఆసపు శ్రీనివాస్ బుజ్జి, కోశాధికారి సుదర్శన్ షణ్ముఖం, గోవాడ కొండబాబు, యూనియన్ ఆర్గనైజర్ చల్ల వరప్రసాద్, యూనియన్ కన్వీనర్ సీమల వీరభద్రరావు, కమిటీ మెంబర్ ఎడ్ల శేఖర్, జెనిపీ పూర్ణచంద్రరావు, పాలపర్తి అప్పారావు, చందు, ఊర్ల శ్రీరాములు, ప్రసన్నకుమార్ తదితరులు ఎలక్ట్రికల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దళిత యువకునిపై దాడి చేయడం అమానుషం : అల్లు





**కోరుకొండ, విశ్వంవాయిస్ న్యూస్ :** దళిత యువకునిపై దాడి చేయడం అమానుషం అని దళిత గిరిజన ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షులు అల్లు జయరాజ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శనివారం ఉదయం మధురపూడి ఎస్సిపేలో దళిత నాయకులు, బాధితుడు పాముల శ్రీనును పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాముల శ్రీను మాట్లాడుతూ తనపై చాలాగట్టిగా దాడి చేసి, కులం పేరుతో దూషించారని ఆవేదన వ్యక్తం చేశాడన్నారు. దళిత గిరిజన ప్రజావేదిక అధ్యక్షులు అల్లు జయరాజు మాట్లాడుతూ ఈ దాడిలో ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు రాజ్యాంగ, చట్టాలపై సామాన్య ప్రజల్లో కూడా పూర్తి అవగాహన కల్పించాలన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల డానియల్, యువజన విభాగం అధ్యక్షులు మడికి ప్రసన్న కుమార్, సీనియర్ పాత్రికేయులు దిబ్బిడి సుబ్రమణ్యం, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సేవతోనే డ్రైవర్లకు సంక్షేమం..



**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని "ఆటో డ్రైవర్ల సేవలో"అనే కొత్త పథకానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో, క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించడమే లక్ష్యంగా అర్హత కలిగిన ప్రతి డ్రైవర్‌కు ఏడాదికి రూ 15వేల చొప్పున నేరుగా ఖాతాలో జమ చేయనుంది. ఈ కార్యక్రమాన్ని కాకినాడ రూరల్‌కి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే పంతం నానాజీతో పాటు ఏపీ శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్, కాకినాడ రూరల్ అబ్జర్వర్ కుడుపూడి సత్తిబాబు స్థానిక ఆటో డ్రైవర్ల తో కలిపి ప్రారంభించి పంతం నానాజీ ఇంటివద్దనుండి బయలుదేరి కాపు కళ్యాణ మండపం వరకు ర్యాలీ గా రావటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంకా కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), మాజీ మంత్రిచిక్కాల రామచంద్రరావు, కర్రి వెంకటరాజు, పెంకే శ్రీనివాస్ రావు,ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రకాష్ గౌడ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత మరియు అభిమానులు పాల్గొన్నారు.

### పలు కుటుంబాలను పరామర్శించిన

## టీడీపీ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పెందుర్తి అభిరామ్ శనివారం సీతానగరం మండలం వంగలపూడి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, అలాగే మృతిచెందిన పలు కుటుంబాలను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. గ్రామంలో కిడ్నీ సమస్యతో బాధపడుతూ ఇంటి వద్ద చికిత్సపొందుతున్న ఈదురువమిల్లి మురళీకృష్ణను అభిరామ్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు. అదేవిధంగా, ఇటీవల మృతి చెందిన సూరెడ్డి సత్యవేణి కుటుంబ సభ్యులను, అబ్బులు కుమారుడు గద్దె శ్రీనివాస్ కుటుంబ సభ్యులను, గద్దె గాంధీ కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారిని ఓదార్చి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో అభిరామ్‌తో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి

**అక్టోబర్ 13వ తేదీన ఐటీడీఏ తరలిరండి..**





**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** 2 025 మెగా డీఎస్సీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంతో ఆదివాసి నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరిగింది. కావున ఏపీ సీ.ఎం ఎన్నికల ముందు అరకులో ఆదివాసీ నిరుద్యోగులకు జీవో నెంబర్ 3 పునరుద్ధరించి ప్రత్యామ్నాయ జీవో ప్రకటించి స్థానిక ఆదివాసీ నిరుద్యోగులతోనే 100శాతం ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ అమలు చేసి తక్షణమే ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని ఏ.పీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్,ఆదివాసీ హక్కులు ఉద్యోగాల సాధన కమిటీ సలహాదారు తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం,దేవీపట్నం మండలం,దేవారం గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామంలోని రామాలయం నందు ఏర్పాటు చేసిన సమావేశానికి ఆదివాసి హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ డివిజన్ ప్రెసిడెంట్ మడి మురళి దొర అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి టీఏసి ఏర్పాటు చేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించి తక్షణమే ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని లేకుంటే ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించే వరకు శాంతియుత ఉద్యమం తీవ్రతరం చేస్తామన్నారు. తక్షణమే ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించి స్థానిక ఆదివాసీ నిరుద్యోగులుతోనే భర్తీ చేయాలని, అలాగే 1/59,1/70 చట్టాలను, అటవీ హక్కుల చట్టం,పెసా చట్టం,2013 పోలవరం భూసేకరణ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని,ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఈ నెల 13వ తేదీన రంపచోడవరం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ఆదివాసీ ప్రజలందరూ కూడా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ హక్కుల ఉద్యోగాల సాధన కమిటీ మండల ప్రధాన కార్యదర్శి మిర్తివాడ సాయికిరణ్ రెడ్డి,మిర్తివాడ సూరారెడ్డి,మండల ప్రెసిడెంట్ చవలం విద్యా సాగర్,మండల కోశాధికారి సారపు నవీన్ కుమార్, కారం రంగారావు దొర, కుంజం శ్రీనివాసు దొర,కొమరం గణేష్ దొర, తుర్రం రమేష్ దొర, తుర్రం రామకృష్ణ దొర,సంధ్య మొదలైన వారు పాల్గొన్నారు.

## పలువురికి ఎమ్మెల్యే వేగుళ్ళ పరామర్శలు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణంలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబ సభ్యులను శనివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరామర్శించారు. ఇటీవల మండపేట పట్టణం 12వ వార్డులో మృతి చెందిన మెర్ల చంద్రరావు, 21వ వార్డులో మృతి చెందిన గోకరకొండ భీమరాజుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ పరామర్శలలో ఎమ్మెల్యే వెంట పాలచర్ల శిరీష్, కొవ్వాడ అప్పన్నబాబు, చింతలపూడి సత్తిబాబు, తదితరులు ఉన్నారు.

### కమ్మ సామాజిక వర్గం పేద విద్యార్థులకు

## నగదు ప్రోత్సాహకం...

**రెడ్డి రాజబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం..**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట కలువపువ్వు సెంటర్‌లో గల శ్రీ రెడ్డి వెంకయ్య కమ్మ మహాజన సంఘం ప్రెసిడెంట్ రెడ్డి రాధాకృష్ణ అధ్యక్షత శనివారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఆర్థిక స్తోమత లేని పేద కుటుంబీకులలో చదువుపై ఆసక్తి కలిగిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రోత్సాహకం (స్కాలర్ షిప్) దరఖాస్తులను పరిశీలించి ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగింది. ఈ స్కాలర్ షిప్ లను ఈనెలలో జరగబోయే కమ్మ వన సమారాధనలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ప్రారంభంలో ఈ నెల 1న మండపేట కమ్మ సామాజికవర్గ ప్రముఖులు మెర్ల రామచంద్రరావు (82) మృతి చెందిన నేపథ్యంలో కమ్మ మహాజన సంఘం సభ్యులు సంస్థ కార్యాలయంలో సంతాపం తెలిపి ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా రెడ్డి రాధాకృష్ణ మాట్లాడుతూ మెర్ల రామచంద్రరావు గతంలో మున్సిపల్ కౌన్సిలర్, కమ్మ మహాజన సంఘం అధ్యక్షులుగా పని చేసి విశేష సేవలు అందించారన్నారు. కమ్మ సామాజిక వర్గం తో పాటు వివిధ సామాజికవర్గాలకు చెందిన ప్రజలకు విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించేవారని కొనియాడారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుణ్ణి కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కమ్మ మహాజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### డిజిటల్ బుక్ ఆవిష్కరించిన

## వైసీపీ నాయకులు



**అల్లవరం. విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవలే జగన్మోహనరెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో నష్ట పోతున్న కార్యకర్తలు నాయకుల కోసం ఒక బరోసా ను ఇస్తూ ఆవిష్కరించిన డిజిటల్ బుక్ లోగో ని అల్లవరం మండలం వైఎస్ఆర్సిపి నాయకులు శనివారం అల్లవరం మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ స్వగృహం వద్ద ఎంపీపీ ఇళ్ల శేషారావు తో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అల్లవరం మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, ఎంపీపీ ఇళ్ల శేషారావు, జడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డీ గంగ, కో ఆప్షన్ సభ్యులు పల్లి జేమ్స్, తిక్కా ప్రసాద్, యల్లమెల్లి బోస్, బొంతు ఏడుకొండలు, పాటి శ్రీరామ్, గోసంగి వెంకటేశ్వరరావు, పి.గంగాధర్, కొనుకు మహేష్, సింహాద్రి, కంపానీ రాజేష్, మధుర శేఖర్ వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా శ్రీ వాసవి మాత

## నిమర్జన మహోత్సవం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో శ్రీ వాసవి మాత అమ్మవారిని నెలకొల్పి పది రోజులపాటు విశేష పూజలు నిర్వహించారు. శనివారం ముగింపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రథంలో గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తీన్మార్ వ్యాధియాలతో పాటు వివిధ సాంస్కృతి కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### అంగరంగ వైభోగంగా

## కనకదుర్గమ్మ మహోత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణం కొత్తూరు రోడ్డు కనకదుర్గమ్మ అమ్మవారు ఎంతో చరిత్ర గల అమ్మవారు గత 46 సంవత్సరాల నుంచి దసరా మహొత్సవం భక్తులు, దాతల సహకారంతో ఎంతో గొప్పగా ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ ఏటి కాయేడు ఆలయ అభివృద్ధి జరుగుతూ వచ్చింది. ప్రతి ఏటా విద్యుత్ దీపాలంకరణ భక్తులును, చుట్టుపక్కల ప్రజలును ఆకట్టుకుంది. అమ్మవారి మహోత్సవం సందర్భంగా భారీ అన్నదాన చేసారు. అలానే నిత్య పూజాది కార్యక్రమాలు ఇక్కడ జరుగుతున్నాయి. ఈ ఆలయం దగ్గర నూతన వాహనాలకు వాహన పూజలు చేయడం ప్రత్యేకత. ఇక్కడ భక్తుల నమ్మకానికి నిదర్శనంగా అమ్మవారు నిలుస్తుంది. ఎంతో గొప్పగా ఏనుగుల సంబరం భక్తులును అక్కర్శించింది.

## ఎడిటర్ వాయిస్

# విద్య పరిరక్షణ అందరి బాధ్యత

ఏటా అక్టోబర్ 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకొనే సంప్రదాయం 1994లో ప్రారంభమైంది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం 5 అక్టోబర్, 1966 నాటిది. ఉపాధ్యాయులను మరియు వారి వృత్తిని ప్రభావితం చేసే సమస్యలను విశ్లేషించడానికి ఫ్రాన్స్‌లోని పారిస్ లోని ఉపాధ్యాయుల స్థితిగతులపై ప్రత్యేక ఇంటర్ గవర్నమెంటల్ సమావేశం ఏర్పాటు చేయబడింది. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని అంతర్జాతీయంగా గుర్తించి ప్రపంచ వ్యాప్తంగా జరుపు కోవాలని ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ (ఇఐ) (ప్రపంచవ్యాప్తంగా విద్యా నిపుణులను సూచించే గ్లోబల్ యూనియన్ ఫెడరేషన్) సూచించింది. 100 కి పైగా దేశాలు ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాయి. ఎడ్యుకేషన్ ఇంటర్నేషనల్ మరియు దాని 401 సభ్య సంస్థల ప్రయత్నాలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా వ్యాప్తి చేయడానికి మరియు దాని గుర్తింపుకు దోహద పడ్డాయి. అక్టోబర్ 5 ప్రపంచ పిల్లలకు విద్యను అందించడంలో బోధనా వృత్తి చేసిన కృషిని గుర్తు చేస్తుంది. ఉపాధ్యాయ దినోత్సవం వాస్తవానికి మన జీవితంలో ఉపాధ్యాయులు పోషిస్తున్న కష్టాలను, సవాళ్లను మరియు అసమానమైన పాత్రను గుర్తించే వేడుక భావి తరాలకు విద్యా ప్రణాళికలు ఎలా ఉండాలనే అంశంపై ఉపాధ్యాయుల మద్దతు కూడగట్టేందుకు విద్యాలయాలలో వేడుకగా దీన్ని నిర్వహిస్తున్నారు. విద్యను పొందడం మాత్రమే హక్కు కాదు, సరైన ఉపాధ్యాయుడి వద్ద విద్యను అభ్యసించడం కూడా హక్కే. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం ప్రధాన లక్ష్యం 'విశ్వ వ్యాప్తంగా ఉన్న విద్యా వేత్తలను ప్రశంసించడం వారి నైపుణ్యాలను అంచనావేయడం, వాటిని మెరుగు పరచడం'. బోధనకు సంబంధించిన సమస్యలను చర్చించు కోవడానికి దీన్ని ఒక అవకాశంగా పరిగణి స్తున్నారు. కాలం ఎంతగా మారినా మన సమాజం ఉత్తమ ఉపాధ్యా యులను అధికంగా తయారు చేయలేక పోతుందనేది సత్యం. సాధారణ ఉపాధ్యాయుడు పాఠాల్ని బోధిస్తాడు. మంచి ఉపాధ్యాయుడు వాటిని వివరిస్తాడు. ఉత్తమ ఉపాధ్యా యుడు విశదీకరిస్తాడు. గొప్ప ఉపాధ్యాయుడు స్ఫూర్తిని అందిస్తాడు. గురువుల బోధనతోనే విద్యార్థులు ప్రపంచాన్ని తెలుసు కుంటారు, ఉన్నత వ్యక్తులుగా ఎదుగుతారు. ప్రపంచంలో సుమారు 80కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా అందులో 23.8 కోట్ల మంది మనదేశం లోనే ఉన్నట్లు వెల్లడైంది. 'ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థ యునెస్కో అక్టోబర్ 5వ తేదీని 'వరల్డ్ టీచర్స్ డే'గా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది ప్రసిద్ధ గురువులు ఉన్నారు. న్యూటన్, పైథాగరస్, సర్వేపల్లి రాధాకృష్ణన్ మొదలైన వారు ఆదర్శంగా నిలిచారు. విశ్వా మిత్రుడు, సాందీపుడు, పరశు రాముడు, ఆదిశంకరాచార్యులు, ద్రోణా చార్యులు, పరమహంస మొదలైన వారంతా పేరొందిన గురువులు. విద్య అనే ఆస్తిని సమానంగా పంచగల శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉంది. ప్రజాదరణ, అపారమైన గౌరవం ఉన్న కారణంగానే ఎంతోమంది ఉపాధ్యాయులు నాయకులయ్యారు. వీరిలో ముఖ్యంగా చెప్పుకోవాల్సిన వారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఒక అధ్యాపకుడు భారత దేశానికి రాష్ట్రపతిగా పనిచేసిన ఘనత ఆయనకే చెల్లింది. ఆయన పుట్టిన రోజును మన దేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపు కుంటాము. ప్రఖ్యాత శాస్త్రవేత్త అబ్దుల్ కలాం రాష్టపతిగా పదవీకాలం ముగియ గానే చెన్నైలోని అన్నా విశ్వ విద్యాలయంలో అధ్యాపకుడిగా చేరారు. బోధన చేస్తూనే ఆయన తుదిశ్వాస విడిచారు. యావత్ ప్రపంచానికి ఆయన గొప్ప సందేశాన్ని అందించారు. జ్ఞాన సముపార్జన గురువు బోధన వలనే సంపూర్ణంగా సిద్ధిస్తుంది. 'గు'శబ్దంధకారే స్సాత్/ 'రు'శబ్దంతి నిరోధతః, అంధకార నిరోధితం/ గురురీత్య బిదీయతే... అనే ఆర్యుల మాటలను పరికించి చూస్తే 'అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి జ్ఞానమనే కాంతులను వెలిగించే వారినే నిజమైన గురువులుగా భావించవచ్చు. నీతివంతమైన జీవనానికి అలవాటుపడే విద్యార్థులను ఉపాధ్యాయులు తీర్చిదిద్ద గలగాలి. సమాజాలు మారొచ్చు, సిద్ధాంతాలు మారొచ్చు. కానీ విద్యార్థి, ఉపాధ్యాయుల మధ్య సంబంధం శాశ్వతమైనది. ఈ విషయాన్ని యువ ఉపాధ్యా యులు గుర్తుంచు కోవాలి. విద్యార్థుల భవిష్యత్‌పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సమాచారం అందివ్వడంతోనే ఉపాధ్యాయుడి పాత్ర ముగియదని నిజానికి ఉపాధ్యాయుడు రకరకాల నైపుణ్యాల్ని విద్యార్థులకు అందించ వలసి ఉంటుందని కొఠారి కమిషన్ పేర్కొంది. జాతి నిర్మాణంలో తల్లిదండ్రుల తర్వాత కీలకపాత్ర పోషించేది గురువే అవుతాడు. అనేక మంది గురువులు విద్యార్థుల మదిలో ప్రముఖ స్థానాన్ని ఏర్పరుచు కున్నారు. ఇందుకు ఉదాహరణ లుగా శ్రీరాముడు- విశ్వామిత్రుడు, శ్రీకృష్ణుడు- సాందీపుడు, శివాజీ- సమర్థ రామదాసు, వివేకానంద- రామకృష్ణ పరమ హంసలను పేర్కొనవచ్చు. మాతృదేవోభవ- పితృదేవోభవ- ఆచార్య దేవోభవ అన్నారు పెద్దలు. తల్లిదండ్రుల తరువాతి స్థానం గురువుదే అని స్పష్టం చేశారు. ఉపాధ్యాయ వృత్తిలో అడుగు పెట్టేవారు తమ వృత్తిని ప్రేమించే లక్షణం కలిగి ఉండాలి. తాము భావి పౌరులను తీర్చిదిద్దు తున్నామనే భావన ఉండాలి. విద్యార్థి ఎగిరే గాలిపటం అయితే దానికి ఆధారమైన దారం గురువు. ఉపాధ్యాయులు తమ మేధో సంపత్తిని పెంపొందించు కోవాలి. తమ జీవిత కాలంలో కనీసం నాలుగు తరాల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందనే విషయాన్ని గమనించాలి. వృత్తి నైపుణ్యాల పెంపు, కంప్యూటర్ వినియోగం, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలను నిర్వహిం చాలి. బాలబాలికల్లో విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు కృషిచేయాలి.



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# అలుపెరుగని కమ్యూనిస్టు యోధుడు

యజుర్వేద శాఖీయులు అయినపేరేప వంశజులు శ్రీకాకుళా నికి ఇరవై కిలోమీటర్ల దూరంలోని పేరేప గ్రామ పరిసరాలలో పురోహితులుగా కాక, దేవాలయ ప్రతిష్ఠలు, కళ్యాణాలు చేయించే వేద పండితులుగా పేరెన్నిక గన్నారు. అలాంటి సనాతన వైదిక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి, పక్కా కమ్యూనిస్టుగా పేరొందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు పేరేప మృత్యుంజయుడు. నమ్మిన సిద్ధాంతాల కోసం జీవితాన్ని అంకితం చేసిన ఆ త్యాగమూర్తి జయంతి సందర్భంగా, లభ్యం అవుతున్న సమాచారం ఆధారంగా గుర్తు చేసుకునే చిరు ప్రయత్నం. పేరేప మృత్యుంజయుడు (అక్టోబర్ 5, 1914 – మే 16, 1950) భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడు, స్వాతంత్ర్య సమర యోధుడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో పేరేప వెంకట సుబ్బయ్య, మహా లక్ష్మిలకు 1914, అక్టోబర్ 5 న జన్మించారు. ఆచంటలో మాధ్యమిక పాఠశాల చదువయ్యాక ధవళేశ్వరం వెళ్లి మేనమామ మొక్కపాటి శేషయ్య ఇంట్లో ఉంటూ రాజమండ్రి ప్రభుత్వ మోడల్ సెకండరీ స్కూలులో చదివి, చదువయ్యాక (1933–34లో) పి.డబ్ల్యు.డిలో రోజు కూలికి మేస్త్రీగా పని చేశారు. 1925 ప్రాంతంలో భానుమతి (1917)ని వివాహ మాడారు. 1936 లో నెక్కంటి నరసింహారావు, మీరా లతో పాటు కమ్యూనిస్టు పార్టీ సభ్యులయ్యారు. బస్సు డ్రైవరుగా పనిచేస్తున్న మీరాతో పాటు బస్సు కార్మికులను సంఘటిత పరచే కార్యక్రమం చేపట్టారు. 1941–42 ప్రాంతంలో యంవియన్ కపర్దీని కూడా మోటారు కార్మిక సంఘ నిర్మాణంలో పాల్గొనేందుకు ప్రోత్సహించారు. 1937–39 కాలంలో కాళీపట్నం రైతుల పోరాటానికి నాయకత్వం వహించిన అల్లూరి సత్య నారాయణ రాజు, ఉద్దరాజు రామం లతో కలిశారు. 1940–42 కాలంలో చినమల్లం గ్రామం వద్ద 60– 70 మంది పార్టీ కార్యకర్తలకు మృత్యుం జయుడు ప్రిన్సిపాలుగా నిర్వహించిన శిక్షణా శిబిరంలో సైద్ధాంతిక శిక్షణతో బాటు, ఇందుకూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో కొంత మిలటరీ శిక్షణ కూడా యిచ్చారు. మృత్యుం జయుడు... వ్యవసాయ కూలీలతో ఆచంట నుంచి నరసాపురం తహశీల్దారు కార్యాలయానికి 1940లో ఆకలి యాత్ర నిర్వహించారు. 1940–42 మధ్య కొంత కాలం ఆయన జిల్లా పార్టీ కార్యదర్శిగా ఉన్నారు. ఏలూరులో జిల్లా పోలీసు స్పెషల్ బ్రాంచి వారు ఆయనను అరెస్టు చేసి, స్థానిక జిల్లా సబ్ జైలులో 15 రోజులు రిమాండులో వుంచారు. 1944 – 45లో జైలు నుంచి విడుదల అయినాక పాలకొల్లులో కాపురం పెట్టారు. నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా వుంటూ, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా ఉన్నారు. అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామ మూర్తి, చలం మొదలగు కళాకారులను ప్రజానాట్య మండలిలోకి తెచ్చింది మృత్యుంజయుడే. నెక్కల పూడి సుబ్బాయమ్మ గారితో కలిసి అన్నా చెల్లెలు పాట (బెంగాలులో కరువు) వేదికల మీద పాడే వారు. చావుకు వెరవకురా అన్న పాట తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ తదితరులు చెపుతుండే వారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య లతో పాటు, ప్రత్యేకంగా తెలంగాణ పోరాటానికి సహాయం కూడ గట్టడానికి పి.సి.జోషి, పుచ్చలపల్లి సుందరయ్యలు వచ్చి ఆయనతో చర్చలు జరిపారు. మృత్యుంజయుడు నరసాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, జిల్లా ప్రజానాట్య మండలి ఆర్గనైజరుగా వున్నారు. రెండవ ప్రపంచ యుద్ధపు చివరి రోజుల్లో బెంగాల్ లో భీకరమైన కరువు, తెలంగాణ రైతాంగ పోరాటం నేపథ్యంలో నిత్యావసర వస్తువుల కటకట, దొంగ నిల్వలు, దొంగ రవాణా నివారణకు కృషి చేస్తూ, ఆకలి యాత్రలు నిర్వహించారు. బెంగాలు కరువు, తెలంగాణ పోరాటం గురించి అల్లు రామలింగయ్య, పినిశెట్టి శ్రీరామమూర్తి, చలం మొదలగు కళాకారులతో కలిసి, ప్రజానాట్య మండలి ప్రదర్శనలు ఇచ్చేవారు. నెక్కల పూడి సుబ్బాయమ్మతో కలిసి "అన్నా చెల్లెలు" పాట (బెంగాలులో కరువుకు సం బంధించి) వేదికల మీద పాడే వారు. "చావుకు వెరవ కురా" అన్న పాట వేదికల నుంచి గంభీర స్వరంతో పాడడమే కాక, తరచు ఒంటరిగా కూడా పాడుకొంటుండే వారని చంద్ర సావిత్రమ్మ, కొండేపూడి రాధ చెప్పేవారు. నిజంగా జీవితంలో కూడా ఆయన "చావుకి వెరవని" వ్యక్తి. 1945–46లో పాల కొల్లులో మునిసిపల్ కార్మికుల సమ్మె జయప్రదంగా జరగతంలో ఆయన పాత్ర ఉంది. 1946లోనే సాధారణ ఎన్నికలు జరిగిన క్రమంలో, పార్టీ అభ్యర్థి తరపున పోలింగు ఏజెంటుగా మోటారు సైకిలు మీద నరసాపురం అసెంబ్లీ నియో జకవర్గం అంతా తిరిగారు. భీమిరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, వావిలాల గోపాల కృష్ణయ్య తెలంగాణ పోరాటానికి సహాయం కూడగట్టడానికి వెళ్ళిన సందరంగంలో పెద్ద బహిరంగ సభ జరిగింది. ఆ తర్వాత, పి.సి.జోషి, పి.సుందరయ్యలు ప్రత్యేకంగా ఆయనతో చర్చలు జరిపారు. అంతకుముందు "ప్రజాశక్తి" వార పత్రిక, ద్వైవార పత్రికానున్న సందర్భంగా విరాళాలకి ప్రకటన వచ్చింది. ఆయన తనకి పెళ్లికి అత్తవారిచ్చిన వెండి మరచెంబు, కంచం అమ్మి పంపించారు. 1946లోనే మళ్లీ రహస్య జీవితం మొదలయింది. 1948లో గాంధీజీ హత్య తర్వాత మళ్లీ కమ్యూనిస్టు పార్టీ మీద నిషేధం జరిగింది. విజయవాడలో కమ్యూనిస్టు, ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తల మధ్య ఘర్షణలు జరగగా, అరెస్టు అయి కైకలూరు సబ్ జైలులో దాదాపు 3 నెలలున్నాక తప్పించుకొని మళ్ళీ రహస్య జీవితంలోకి వెళ్ళారు. 1948లో పోలీసు చర్య తర్వాత తెలంగాణ లోనే కాక వెన్నుదన్నుగా వున్న కోస్తా ఆంధ్ర జిల్లాలలోనూ కమ్యూనిస్టు శ్రేణులు ఆత్మరక్షణ చేసుకొనే స్థితిలో పడ్డాయి. పార్టీ ఆదేశం ప్రకారం కామ్రేడ్స్ ఇతర ప్రాంతాలకి తరలి వెళ్ళారు. మృత్యుంజయుడు, సంకు అప్పారావు, మరి కొందరు, ఒరిస్సా వెళ్లేందుకు రాజమండ్రిలో ఒక రహస్య స్థావరానికి చేరారు. ఇంతలో స్థావరం యిచ్చిన వ్యక్తి ప్రభుత్వం యిచ్చే పారితోషికానికి ఆశపడి పోలీసులకి ఆచూకీ యిచ్చాడు. సుందరయ్య 'వీర తెలంగాణ విప్లవ పోరాటం– గుణపాఠాలు" ప్రకారం మిగతా వారిని పంపించి ఆయన ఖమ్మం ప్రాంతంలో పోరాట శ్రేణుల్లో చేరవలసి వచ్చింది. పట్టుబడిన వారందరూ చిత్ర హింసలకి గురయ్యారు. మృత్యుం జయుడు పట్టుబడిన కబురు తెలిసి అందరూ స్థావరం మార్చుకున్నారు."మా స్థావరం ఆయనకు తెలుసు, వచ్చి మమల్ని కలుసుకోవలసి వుంది. ఆయన ఆ బాధలు భరించినందువల్ల మే బతికిపోయాం" అని రాజేశ్వరరావు, సుందరయ్య చెప్పేవారు. 1950 మే 16 బొమ్మూ రు మొట్ట దగ్గర చనిపోయినట్లు పత్రికల సమాచారం ఇచ్చాయి. కాల్చిన యస్.ఐ తనికెల సుబ్బారావు రిటైరైన తర్వాత... ఫొటోగ్రాఫర్ భూషణ్‌ను కలిసి, కానిస్టేబుళ్ళు మృత్యుంజయుని కాల్చడానికి నిరాకరించగా తాను కాల్చవలసి వచ్చిందని, ఆఖరి గుండు పేల్చే వరకూ ఆయన జయజయ నినాదాలు చేస్తూ నిలబడి వున్నారని చెప్పినట్లు సమాచారం. అప్పటి సహచరులు, కొరియరులు ఎందరో తమ పిల్లలకు మృత్యుంజయుడు అని పేరు పెట్టు కున్నారు. రాజమండ్రి సెంట్రల్ జైలు దగ్గర రిక్షా కార్మికులు తమ కాలనీకి మృత్యుంజయ నగర్ అని పేరు పెట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపు రంలో "మృత్యుంజయ నగర్ కాలనీ", గ్రంథాలయం ఏర్పడ్డాయి.

# గురు: సాక్షాత్ పరబ్రహ్మ

సామాన్య మానవుడు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చగల ధీర మేధావి గురువు. తొలి అక్షరం దిద్దించడం, వ్యక్తిత్వ వక్రగుణాలను సవరిస్తూ, సన్మార్గాలను చూపుతూ, అత్యున్నత స్థాయికి ఎదిగే వరకు మన వెంట నిడిచి, వెన్నెముకలా నిలిచి, నిరాశలో ఆశల విత్తులు నాటుతూ, కొవ్వత్తిలా తను కరిగిపో తూ రేపటి తరానికి దారి దీపంగా నిలుస్తూ, తడబడినపుడు ఊత కర్రగా మారగల మహోన్నత దైవ రూపం, నడిచే ఆదర్శాల నిధి గురువు మాత్రమే. పాఠ్యాంశాలను బోధిస్తూ, వెన్నుతట్టి నడక, నడతల్ని నేర్పుతూ, జ్ఞానోదయాన్ని కలిగించగల నిస్వార్థ జీవి ఉపాధ్యాయుడు. ఢిల్లీకి రాజైన సద్గురువుకు పాదాభివందనం చేసేది భాధ్యతగల శిష్యుడే. పెరిగే మొక్కకు ఊత కర్ర ఉపాధ్యాయుడు. భగవంతుడితో భక్తుడి సంబంధం లాంటిదే గురు శిష్యుల పరమ పవిత్ర సంబంధం. గురువులు సృష్టి కర్త వంటి వారు. విద్యార్థికి జ్ఞానాన్ని అందించి, కొత్త విషయాలను నేర్పించే పాత్రను పోషిస్తారు. గురువు మార్గ నిర్దేశనం చేస్తూ, మోక్షం వైపు నడిపిస్తారు. గురువు పరంధాముడు, అజ్ఞాన చీకట్లను చిదిమేసి జ్ఞానోదయం కలిగించే వారు. గురువు పరివర్తకుడు, భవిష్యత్తు తీర్చిదిద్దే మేధావి. ప్రపంచవ్యాప్తంగా 94 మిలియన్లకు పైగా ఉపాధ్యాయుడు భావితరాలకా నిర్మించడంలో నిమగ్నం అవుతున్నారు. ఉపాధ్యాయుడు రేపటి తరం నిర్మాతలు. తరగతి గదుల్లోనే జాతి నిర్మాణం జరుగుతుంది. గురువుకను నమ్మిన శిష్యుడికి ఎదురుండదు. గురువు ప్రాధాన్యాన్ని గుర్తించిన యునెస్కో సంస్థ ప్రతి ఏట 05 అక్టోబర్ రోజు "ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం (వరల్డ్ టీచర్స్ డే)"గా 1966 నుంచి పాటించడం ఆనవాయితీగా మారింది. 2025 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ ఇతివృత్తంగా "ఉపాధ్యాయుల అభిప్రాయాలకు విలువ ఇద్దాం : సరికొత్త విద్యా ఒప్పందం దిశ వైపు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. విజ్ఞానం, లోక జ్ఞానం, వ్యక్తిత్వ వికాసం, వివేకం, విద్యాబుద్ధులు, శాస్త్రీయ దృక్పథం, మంచి అలవాట్లు, ప్రేరణ కల్పించడం, పొరపాట్లను నిర్దయగా సవరించడం, కెరీర్ నిర్మించడం లాంటి బహుముఖీల లక్ష్యాలను మదిలో నింపుకొని తమ విధులను సక్రమంగా, పవిత్రంగా నిర్వహించే గురువులు శిష్యుల దృష్టిలో బ్రహ్మ సమానులే. పుస్తకాల్లో పాఠాలను మాత్రమే బోధించే వారు సాధారణ ఉపాధ్యాయులు. పాఠ్యాంశాలతో పాటు హృదయపూర్వకంగా విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే మహాముభావులు మాత్రమే సద్గురువులు. పిల్లల్లో దయ, కరుణ, ఉత్సుకత, ధైర్యం, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ అనబడే విత్తులు నాటి నీడనిచ్చే మహా వృక్షాలుగా మార్చగల మహోన్నతులు సద్గురువులు. ఓపిక, బేషరతు త్యాగాల ప్రతిరూపం ఉపాధ్యాయులు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం వేదికగా మన గురువులకు కృతజ్ఞతలు తెలపడం, వారి దీవెనలు పొందడం, వారిని మనస్ఫూర్తిగా సన్మానించడం, సుదూర ప్రాంతాల్లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రేమపూర్వకంగా ఉత్తరాలు రాయడం, విద్యాలయాల్లో సెల్ఫ్ గవర్నమెంటు డే పాటించడం, వారి సేవలను కొనియాడడం, విద్యాలయాల్లో పలు పోటీలను నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది. నిస్వార్థ ప్రేమ, గౌరవం, కృతజ్ఞతలను తెలుపడానికి ఈ వేదిక ఎంతగానో ఉపకరిస్తుందని గమనించాలి. కంచే చేనును మెసినట్లు, నేటి ఉపాధ్యాయుల్లో కొందరు విధులను నిర్లక్ష్యం చేయడం, విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడం, విధి నిర్వహణలో ఆల్కహాల్ సేవించడం, కాలక్షేపం కోసం ఉద్యోగం చేయడం, అభ్యంతరకరంగా ప్రవర్తించడం అత్యంత విచారకరం. అన్ని వృత్తుల మేధావులను తయారు చేసే సర్వ సాధారణ వ్యక్తులు గురువులే అని మనకు తెలుసు. గురు బోధనలు మన జీవితాంతం మన వెంట వస్తాయి. విద్య అనే శక్తివంతమైన ఆయుధంతో ప్రపంచాన్ని సర్వాంగ సుందర ప్రదేశంగా మార్చవచ్చు. ఆవిష్కరణలు, సృజన ఆలోచనలు, స్ఫూర్తి రగల్చడం, సానుకూల మార్పులకు ఉత్ప్రేరకంగా పని చేసేది ఉపాధ్యాయుడు మాత్రమే. ప్రతి విజేత వెనుక ఉపాధ్యాయుడి అదృశ్య హస్తం ఉంటుంది. రేపటి తరం నిర్మాతలుగా నేటి ఉపాధ్యాయులు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించి డిజిటల్–ఏఐ తరగతి గదుల్లో సాంప్రదాయం తో బోధనలు చేయడానికి ముందుకు రావాలని, ప్రతి విద్యార్థిని బాధ్యతగల పౌరులుగా మార్చడానికి కృషి చేయాలని కోరుకుందాం. గురుః బ్రహ్మ గురుః విష్ణు గురు దేవో మహేశ్వరః / గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురువే నమః

# దారి తప్పిన బాల్యం...

ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కూకట్‌పల్లి మైనర్ బాలిక సహస్ర హత్య కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల విచారణలో ఈ హత్య కేసుకు సంబంధించిన కొన్ని నివ్వెరపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. 14 ఏళ్ల బాలుడు క్రికెట్ బ్యాట్ కోసం సహస్రను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. పదవ తరగతి కూడా పూర్తికాని 14 ఏళ్ల బాలుడు 11 ఏళ్ళ అమ్మాయిని అతి కిరాతకంగా హత్య చేయడం ఏంటి? ఇంతటి దారుణానికి ఒడిగట్టడానికి గల కారణాలేంటనే ప్రశ్నలు అందరి మదిలో తలెత్తుతున్నాయి. బాలుడు క్రికెట్ బ్యాట్ దొంగతనం కోసం పక్కా ప్రణాళికతో అవసరమైతే హత్య చేయడానికైనా వెనకాడ కూడదన్న ఉద్దేశంతో ముందుగానే తన ప్రణాళికను స్క్రిప్ట్ రూపంలో రాసుకుని దొంగతనానికి పాల్పడిన సంఘటన ప్రతి ఒక్కరికి ఆశ్చర్యం కలిగించేలా చేసింది. 14 ఏళ్ల బాలుడికి స్క్రిప్ట్ రాసుకుని దొంగతనం చేయాలనే ఆలోచన ఎక్కడి నుండి వచ్చింది అంటే ఇది క్రైమ్ సంబంధిత వీడియోల ప్రభావమే అని చెప్పాలి. అంతే తప్ప ఏ తల్లిదండ్రులు ఇలాంటి దారుణాలు చేయమని తమ పిల్లలకు చెప్పరు. మరి క్రైమ్ సంబంధించిన వీడియోలు యూట్యూబ్‌లో లభ్యమవుతున్నాయంటే తప్పు ఎవరిది అనే విషయంపై కూడా చర్చించాల్సిన అవసరం ఉంది. గతంలో క్రైమ్‌కి సంబంధించిన సినిమాలు కట్టడి చేయాలని విమర్శలు వెల్లువెత్తాయి. కానీ అందుకు సెన్సార్ బోర్డు చర్యలను సమర్థించుకుంటూ మానవ సమాజంలో నేరాలపై అవగాహన తీసుకురావడానికి మాత్రమే ఇలాంటి చిత్రాలు తయారు చేస్తున్నామని



సమాధానమిచ్చారు. అంతేకాకుండా మంచి సినిమాలతో పాటు, క్రైమ్ సంబంధిత సినిమాలు కూడా చేస్తుంటే మరి మంచి సినిమాల ద్వారా ఎందుకు ప్రభావితం కావడంలేదన్న విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు. ఏది ఏమైనా క్రైమ్ సంబంధిత వీడియోలు కట్టడి చేయడం ద్వారానే ఇలాంటి దుశ్చర్యల కట్టడి సాధ్యమనేది ముమ్మాటికీ నిజం. మొబైల్ ఫోన్ ఇప్పటి పిల్లల జీవితంలో భాగం అయిపోయింది. పెద్దలకు మాత్రమే కాకుండా పిల్లలు కూడా మొబైల్ ఫోన్‌కి వ్యసనపరులుగా మారుతున్నారు. ప్రస్తుతం భార్యాభర్తలిద్దరూ పని చేయనిదే ఇల్లు గడవని పరిస్థితి. ఈ హడావుడి బతుకుల్లో పిల్లలు ఏం చేస్తున్నారో పట్టించుకునే తీరిక, ఓపిక తల్లిదండ్రులకు ఉండట్లేదు. మరికొందరి తల్లిదండ్రులు తమ పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు మొదలు అడిగిందల్లా కొనిచ్చి అతి గారాబం చేస్తున్నారు. గత సంవత్సరం నంద్యాల జిల్లాలో తొమ్మిదేళ్ల బాలికపై ముగ్గురు అబ్బాయిలు అత్యాచారం చేసి, ఆపై ఆమెను హత్య చేశారు. ఇంటర్నెట్‌లో అశ్లీల వీడియోలు చూసే ఉత్సాహంలో తాము ఈ నేరానికి పాల్పడ్డామని వారు చెప్పారు. ఆడుతూ పాడుతూ చదువుకోవాల్సిన పిల్లల్లో దుష్ట ప్రవృత్తి ప్రబలంగా ఉందనేది అక్షర సత్యం, కానీ ఆ పాపం ఎవరిది తల్లిదండ్రులదే. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం 2016లో దేశవ్యాప్తంగా ఆయా నేరాల్లో పట్టుబడిన మైనర్లు 32.5శాతం మంది ఉండగా 2022 నాటికి పట్టుబడిన మైనర్ల సంఖ్య దాదాపు యాభై శాతానికి పెరిగింది. ఒక్క ఢిల్లీలోనే హత్యలతో ప్రమేయం ఉన్న మైనర్ల సంఖ్య 2014–24 మధ్య 8. 7 శాతం నుంచి 26. 78 శాతానికి పెరిగిందంటే రాబోవు రోజుల్లో దేశ భవిష్యత్తు ఎలా ఉంటుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి. ఈ అంశాలపై విస్తృత చర్చ జరిగితేనే మార్పు కొంతమేరకు సాధ్యం అనే విషయాన్ని పాలకులు, తల్లిదండ్రులు, సభ్య సమాజం గమనించి అందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ఉపక్రమించాలి.



# ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం

## ఆటో నడుపుతూ ఆటో డ్రైవర్ల ర్యాలీలో పాల్గొన్న ఎంపీ హరీష్ కూటమి ప్రభుత్వంలో మాట ఇచ్చాం నిలబెట్టుకున్నాం..



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వయం శక్తితో కష్టపడే శ్రమజీవులకు, ఆటో కార్మికులకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకుంటుందని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్ బాలయోగి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శనివారం చేపట్టిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత రామ చంద్రపురం వెల్ల బ్రిడ్జి వద్ద ప్రారంభమైన ఆటోల ర్యాలీలో ఎంపీ హరీష్ మాధుర్,ఆర్డీవో అఖిల, కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం,జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావులు ఆటో డ్రైవర్లు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఎంపీ హరీష్ కాఖి చొక్కా ధరించి స్వయంగా ఆటో నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 2,లక్షల 90 వేల 243 మంది లబ్ధిదారుల ఖాతాల్లో 15 వేల చొప్పున రూ.435.36 కోట్లు జమ చేసి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7,709 లబ్ధిదారులకు రూ.11.56 కోట్లు,రామచంద్రపురం నియోజవర్గంలో 1151 మంది లబ్ధిదారులకు రూ.2 కోట్ల 10 వేల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 80 శాతానికి పైగా హామీలు అమలు చేసి ప్రజల మన్ననలు పొందామన్నారు. మెగా డీఎస్సీ, పింఛన్లు పెంపు, తల్లికి వందనం,స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత సిలిండర్లు, ఇప్పుడు ఆటో డ్రైవర్ల సేవలో పథకాలు విజయవంతంగా అమలు చేశామన్నారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో రోడ్లు దీనస్థితిలో ఉండగా ఆటో, బస్సు ప్రయాణికులు ఎంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు అన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తి చేసి హామీలు పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు.సత్యం వాసంశెట్టి పౌండేసన్ అధినేత మంత్రి తండ్రి వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు పదివేలు చొప్పున మాత్రమే ఇచ్చిందని, కార్మికుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.ఏటా రూ.15 వేలు చొప్పున ఇస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమం సమపాళ్ళుగా ప్రజలకు అందజేస్తూ అనతి కాలంలోనే కూటమి ప్రభుత్వం ప్రజా మన్ననలు పొందింది అన్నారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కార్మికుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత లిస్తూ కొంతమంది ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్‌లు కట్టడం జరిగిందన్నారు. అలాగే ఆర్థిక స్తోమత లేని ఆటో డ్రైవర్ల పిల్లలను దత్తత తీసుకొని చదివించడం, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అత్యవసరం అయితే కార్పొరేట్ వైద్యం కూడా అందించే కృషి చేస్తున్నామన్నారు. రామచంద్రపురం నియోజవర్గంలో ఎలక్ట్రానిక్ ఆటోలు కూడా సబ్సిడీపై ఇచ్చేందుకు మంత్రి సుభాష్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఏదైనా సాంకేతిక కారణాలవల్ల ఆటో డ్రైవర్లకు 15 వేలు అందకపోతే అధికారులు లోపాలను సరిచేస్తారన్నారు. కార్మికుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శ్రామికులను విస్మరించరని అన్నారు. ఆర్డీవో అఖిల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం, వారి అభివృద్ధి కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమాజంలో ఆటో డ్రైవర్ల పాత్ర గొప్పదని,ప్రతి ఒక్కరి జీవితంలో ఆటో కూడా ఒక భాగమని అన్నారు. రవాణా శాఖ అధికారి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చదువుతో సంబంధం లేకుండా లైసెన్సులో పొందవచ్చని, ఆటో కార్మికులకు తమ శాఖ తరపున అండగా నిలుస్తామన్నారు. ఆటోలకు సంబంధించి బ్రేక్ కార్యకలాపాలు రామచంద్రపురం లోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆటో యూనియన్ల గౌరవ అధ్యక్షుడు కంచుమర్తి బాబురావు ఎంపీ హరీష్ దృష్టికి సమస్యను తీసుకొచ్చారు.బ్రేక్ కోసం అమలాపురం వెళ్లాల్సి వస్తుందని,దానివల్ల ఆటో కార్మికులు శ్రమ, ఖర్చులు అధికమవుతున్నాయన్నారు. సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వం తగ్గించిన సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అధికారులు అవగాహన కల్పించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవిల్లి శివ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కెవివిఆర్ రాజు, ఎంపీడీవో రాంబాబు, తహసిల్దార్ మృత్యుంజయరావు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, నియోజకవర్గ ఇన్చార్జి కాకినాడ రామారావు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు పెంకే సాంబశివరావు,ఆయా మండలాల అధ్యక్షులు కొత్తపల్లి శీను బాబు, మేడిశెట్టి వెంకటరమణ, డాక్టర్ బాబు,కూటమి పార్టీ నాయకులు,వివిధ శాఖల అధికారులు,ఆటో యూనియన్ల సంఘ నాయకులు తదితరులు పాల్గొని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వం నుంచి 15 వేలు ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి, తమ సమస్యల పట్ల స్పందిస్తూ,అండగా నిలుస్తున్న మంత్రి సుభాష్ కు,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అమలోద్భవి మాత స్వరూపం ఆవిష్కరణ



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం ఇరుసుమండ మెయిన్ రోడ్‌లో ఆర్ సిఎం చర్చి పరిధిలో ఉన్న లైన్ పేట గ్రామంలో నేతల సహదేవుడు మాణిక్యమ్మ వారి జ్ఞాపకర్థం వారి కుమారులు నేతల సర్వేశ్వర రావు ఆర్థిక సహాయంతో చర్చ నిర్మించడం జరిగింది. చర్చ వద్ద గెల్ల కరుణ శ్రీ ఆర్థిక సహాయంతో అమలోద్భ విమాత స్వరూపాన్ని రేవ్ ఫాదర్ వినయ సాగర్ గ్రామ ప్రజల సమక్షంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వినయ సాగర్ మాట్లాడుతూ అమలోద్భవి మాత అంటే నిష్కళంక మత (కళంకము లేని) ఈమెను మనం కోరుకునే ప్రతిదీ కూడా తీర్చే మతగా మనం భావించాలి అని అన్నారు. ఈవిధంగా ముందుకు వచ్చిన దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పుల్లేటికర్రు సర్పంచ్ జల్లి బాలరాజు, ఫాదర్ వినయ సాగర్, గ్రామ పెద్ద బొంతు స్వామి,మాజీ సర్పంచ్ నుకపెయ్యి చిన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు కత్తుల బాలరాజు, చర్చి ఉపదేశి తుమ్మల కృష్ణ మూర్తి అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

## పితాని ఏసు కుమార్‌కి ఆర్థిక సహాయం అందించిన దాతలు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం మాచవరం గ్రామ పంచాయితీ సమీపంలో కిడ్నీ వ్యాధి గ్రస్తుడు పితాని ఏసు కుమార్‌కి వ్యాధి నయం చేసుకోవడానికి సహాయార్థంగా ఈరోజు అతని ఇంటివద్ద కు రాజోలు కి చెందిన బోనం రాజు గారు సూరపురెడ్డి సురేష్ గార్లు క్యాష్ 6500 మరియు కిరణా సామాన్లు 3000 విలువ గలిగిన ఇచ్చి నారు, కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి , అన్యం రాంబాబు, అరిగెల రాంబాబు, అరిగెల కృష్ణ ప్రసాద్ కలిసి 25000 ఇరవై అయిదు వేల రూపాయలు బాధితుడు ఏసుకుమార్‌కి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నల్ల పెద్ద కాపు నల్ల మౌళి ఈశ్వరరావు మాట్లాడుతూ దాతలు స్పందించి ఆదుకోవడం మంచి పని, ఇంకా దాతలు స్పందించి ఆదుకోవాలని కోరారు.

## నూతన బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసిన బోస్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామ, వెంకటాయపాలెం గ్రామపంచాయతీ ఏరియా రామనర్సు తోటలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఇచ్చిన నిధులతో బీసీ కమ్యూనిటీ భవనమునకు బోస్ చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్సిపి యువజన విభాగం అధ్యక్షులు రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్య ప్రకాష్ మరియు రామచంద్రపురం మండలం పరిషత్ అధ్యక్షురాలు అంబటి భవాని,వెంకటాయపాలెం గ్రామ సర్పంచ్ మరియు నియోజకవర్గ వైఎస్ఆర్సిపి మహిళా అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్ కుమారి, ఏపీఐడిసి మాజీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, వైయస్సార్సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన వైసీపీ నాయకులు



**అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం మొగల్లమురు గ్రామానికి చెందిన అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన సందర్భంగా ఆమెని కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. వైయస్ఆర్సీపీ నాయకులు కుంచె రమణారావు ఆయనతో పాటుగా సాధనల శ్రీను, దేవరపల్లి నరేష్, సరెళ్ళ రామకృష్ణ, పులుసుగంటి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు అండగా కూటమి ప్రభుత్వం

## అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నాం : ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. శనివారం రావులపాలెంలో జరిగిన ఆటో డ్రైవర్ల సేవలో కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఏపీ బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి, కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, ఆర్డీవో పి.శ్రీకర్, ఆర్టీవో శ్రీనివాస్ కలిసి పాల్గొన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయం నుండి సెయింట్ పాట్రిక్ స్కూల్ వరకు జరిగిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. స్వయంగా ఆటో నడిపి ఆటో డ్రైవర్లను ఉత్సాహపరిచారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ,ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల నేతృత్వంలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు పెడుతుందని వ్యాఖ్యానించారు. ఇప్పటికే సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందన్నారు. భారత దేశంలోనే అధిక మొత్తంలో సామాజిక భరోసా పింఛన్లను మన ప్రభుత్వమే అందిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ వెయ్యి రూపాయలు పెంచడానికి ఐదేళ్లు పడితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదు నిమిషాల్లోనే పింఛన్ మొత్తాన్ని వెయ్యి రూపాయలు పెంచిందన్నారు. అంతకుముందు మూడు నెలలు కలిపి రూ. 7 వేలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పింఛన్లతో పాటు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, స్త్రీ శక్తి, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు సూపర్ సక్సెస్ అయ్యాయని తెలిపారు.నేడు ఆటో డ్రైవర్ల సేవలో అనే పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని, ఈ పథకంలో భాగంగా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకం రూపొందించిందని తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 2.90 లక్షల మంది డ్రైవర్ అన్నలకు రూ.436 కోట్ల లబ్ది చేకూరుతుందని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7709 మంది డ్రైవర్లకు రూ.11,56,35,000(అక్షరాల 11 కోట్ల 56 లక్షల 35 వేల రూపాయలు) లబ్ధి కలుగుతుందన్నారు. ఒక్క మన కొత్తపేట నియోజకవర్గంలోనే 1556 మందికి అక్షరాలా 2 కోట్ల 33 లక్షల 40వేల రూపాయలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసి అప్పుల్ని మూటగట్టి మన నెత్తి మీద పెట్టి పోయినా, ఏమాత్రం చెదరకుండా బెదరకుండా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు హామీ ఇవ్వని పథకాలను సైతం కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఒక విజన్ ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ప్రజలు ఏ విధంగా లబ్ధి పొందుతారనేదానికి ఇది ఉదాహరణ అని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్లకు కేవలం ఏడాదికి రూ.10 వేలు మాత్రమే ఇచ్చిందని,కానీ కూటమి ప్రభుత్వం గత పాలకులకంటే 50 శాతం అదనంగా రూ.15 వేలు ఇస్తోందని తెలిపారు. మేనిఫెస్టోలో పెట్టకపోయినా స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు సాయం అందించాలనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనదారులకు మేలు కలిగించేలా అనేక పనులు చేపట్టామని, గత ప్రభుత్వంలో ఉన్న రోడ్ల దుస్థితి కారణంగా ఆటో డ్రైవర్లు, వాహనదారులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, గుంతల రోడ్ల కారణంగా ఆటోలు, ఇతర వాహనాలు దారుణంగా దెబ్బతినేవని, రిపేర్ల ఖర్చు తడిసిమోపెడు అయ్యేదన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చాక ముందుగా రహదారి గుంతల సమస్య పరిష్కారానికి రూ.1,000కోట్లు ఖర్చు చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టి సాఫీగా ప్రయాణం సాగేలా చేశామన్నారు. అంతేకాకుండా పాతవాహనాలపై గత ప్రభుత్వం భారీగా వేసిన గ్రీన్ ట్యాక్స్‌ను కుదించామని, నాడు రూ.20 వేలు ఉన్న గ్రీన్ ట్యాక్స్‌ను రూ.3 వేలకు తగ్గించి వాహనదారులకు పెద్దమొత్తంలో ఉపశమనం కలిగించామని తెలిపారు. దీంతో ఆటోలు, క్యాబ్‌లపై పెద్ద ఎత్తున భారం తొలగిందని అన్నారు.ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జరుగుతున్న మంచి పనులను ప్రతి ఒక్కరూ గుర్తించాలని,ప్రజా ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, కెవి సత్యనారాయణ రెడ్డి,అయినవిల్లి సత్తిబాబు గౌడ్,గుత్తుల రాంబాబు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యుత్ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె కు వెళ్ళడానికి విద్యుత్ ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చిన విద్యుత్ ఉద్యోగాల సంఘాల జెఏసి నాయకులు.అయితే ఈ మేరకు రామచంద్రపురంలో నిర్వహించిన ఏపి రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా విద్యుత్ ఉద్యోగులకు మెరుగైన మెడికల్,పెన్షన్ సదుపాయాలు కల్పించాలి. కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి, ప్రమోషన్‌లు ఇవ్వాలనే అంశాలుపై పలువురు మాట్లాడారు. గతంలో ప్రభుత్వం విధ్యుత్ సంస్థలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 6వ తేదీన విశాఖపట్నంలో ఐదు జిల్లాల జెఏసి నాయకుల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు మహా ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.అప్పటికి ప్రభుత్వం మరియు విధ్యుత్ సంస్థలు స్పందించని పక్షంలో నిరవధిక సమ్మెకు వెళతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెఏసి చైర్మన్ నాగేశ్వరరావు, విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## బడుగు భాస్కర్ జోగేష్ కవిత్వంలో సౌందర్యదృష్టితో పాటు సామాజిక వాస్తవికత



**అమలాపురం రూరల్ విశ్వంవాయిస్ న్యూస్ :** స్వీయానుభూతితో, సహానుభూతితో బడుగు భాస్కర్ జోగేష్ రాసిన కవిత్వంలో సౌందర్యదృష్టికి ఎంత ప్రాధాన్యం ఇచ్చారో ప్రాపంచిక వాస్తవికత పట్ల ఎరుకతోనే ఉన్నారని కవి, రచయిత నామాడి శ్రీధర్ అన్నారు. కవి తన బాల్య, యౌవనకాలాల జ్ఞాపకాలతో పాటు సామాజిక ఘటనలు, రాజకీయ పరిణామాలను కవిత్వీకరించారని ఆయన ప్రశంసించారు. అమలాపురం బార్ అసోసియేషన్ భవనంలో శనివారం ఉదయం జరిగిన బడుగు భాస్కర్ జోగేష్ కవితాసంపుటి 'లిదియా పూలు సలామీ అఖాతం' ఆవిష్కరణ సభలో ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించి, సభకు అధ్యక్షత వహించారు. అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయవాది సి.హెచ్.అజయ్ కుమార్ సభలో గౌరవ అధ్యక్షులుగా పాల్గొన్నారు. కవి మాతృమూర్తి ఈశ్వరమ్మ తొలి ప్రతి స్వీకరించారు. ప్రధాన వక్త, కవి, సాహిత్య విమర్శకులు సుంకర గోపాల్ మాట్లాడుతూ 'లిదియా పూలు సలామీ అఖాతం' కవిత్వ సంపుటిలో అనుభూతి భావుకత, సామాజిక పరిణామాల చిత్రీకరణ ఉంది. జీవితం పట్ల ఒక తాత్విక తార్కిక దృక్పథం ఉంది. గాడత స్పష్టత ఉన్న అరుదైన కవి జోగేష్ అని కొనిఆడారు. వయూద్వేగాల ప్రకంపనను భాషగా మార్చడంలో కవి విజయవంతం అయ్యారని వివరించారు. మరొక వక్త, కవి, రచయిత అవధానుల మణిబాబు మాట్లాడుతూ జోగేష్ ప్రతి కవితా ఆవరణలుగా విస్తరించి ఉంటుందని అన్నారు. పైకి ప్రస్ఫుటంగా కనిపించే భావం మాత్రమే కాక అంతర్లీనంగా చెప్పిన సంగతులకోసం ఏకాగ్రతతో చదవాల్సిన కవిత్వం ఇదని తెలిపారు. తనదైన శైలి, శిల్పం, శబ్దాలతో ఎంచుకున్న అంశాన్ని అద్భుత కవితగా మలచే ఇంద్రజాలం ఈ కవిలో ఉందని ప్రశంసించారు. చదివిన తర్వాత మననం చేసుకుంటే కవితలలో సన్నివేశం పాఠకులకు దృశ్యమానం అవుతుందని వివరించారు.

## ఫోటోగ్రాఫర్ సత్య ప్రసాద్ కుటుంబానికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం

### అండగా నిలిచిన ఫోటోగ్రాఫర్స్ యూనియన్ - చెక్,ఆర్థిక సహాయం ఇచ్చిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కష్టాల్లో ఉన్న తమ తోటి ఫోటోగ్రాఫర్ కుటుంబానికి అండగా నిలిచి,జిల్లా ఫోటోగ్రాఫర్స్ యూనియన్ గొప్ప మనసు చాటుకుంది. కొత్తపేట మండలం, వాడపాలెం గ్రామానికి చెందిన ఫోటోగ్రాఫర్ సత్య ప్రసాద్ కుటుంబానికి యూనియన్ తరపున ప్రకటించిన రూ.1 లక్ష ఆర్థిక సహాయాన్ని సత్య ప్రసాద్ ఇంటి వద్ద కొత్తపేట శాసన సభ్యులు బండారు సత్యానందరావు, సత్య ప్రసాద్ కుటుంబ సభ్యులకు చెక్కు రూపంలో అందించారు. అంతేకాకుండా, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనవంతు సాయంగా రూ.20 వేలు రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ ఒకరికొకరు సంఘీభావంతో నిలబడటం గొప్ప మానవత్వం.ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు తమ తోటి కుటుంబానికి చేసిన ఈ ఆర్థిక సహాయం ఎంతో ఆదర్శప్రాయం అని కొనియాడారు. జిల్లాలోని ఫోటోగ్రాఫర్స్ అందరూ తమ వంతు సహాయంగా ఇచ్చిన విరాళాలతో ఈ మొత్తం సమకూరింది. ఈ సందర్భంగా సహాయం అందించిన ప్రతి ఒక్కరికీ జిల్లా ప్రెసిడెంట్ సురేష్ కుమార్‌కు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు రామారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మనోజ్, జిల్లా సెక్రటరీ దొరబాబు ,కొత్తపేట సెక్రటరీ శ్రీను, మెంబర్ రాజు, అంబాజీపేట ప్రెసిడెంట్ రమణమూర్తి, ముమ్మిడివరం ప్రెసిడెంట్ రాజేష్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

### జనావళి వృద్ధాశ్రమంలో

# వృద్ధులకు పండ్లు పంపిణీ



**కాకినాడ రూరల్/ కరప: విశ్వం వాయిస్ :** వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జనావళి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమం వ్యవస్థాపకులు మందపల్లి శ్యామ్ ఆధ్వర్యంలో వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కాకినాడ మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో ప్యానల్ న్యాయవాదులు డాక్టర్ వై.(డి.)వసంత రిటైనర్ మరియు శ్రీపాద రాజశేఖర్ న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించినారు.సుమారు 40 మంది వృద్ధులు హాజరైనారు.వృద్ధులు వారి సమస్యలు తెలుపగా పరిష్కార దిశగా కృషి చేస్తానని న్యాయవాది డాక్టర్ వసంత మాటిచ్చారు. ఈ సందర్భంగా వసంత మాట్లాడుతూ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా న్యాయవాది పృథ్వీరాజ్ సహకారంతో వృద్ధులందరికీ పండ్లు పంపిణీ చేశామన్నారు. వృద్ధులందరూ ప్రశాంత వాతావరణంలో జీవితాన్ని సంతోషంగా గడపాలని కోరారు. నీడ లేని వార్కి జనావళి వృద్ధాశ్రమం ఎంతగానో ఆసరా కల్పిస్తుందని అదే విధంగా ప్రభుత్వ న్యాయ వ్యవస్థ కూడా వారికి చేయూత, సహాకారం చేస్తున్నామని మెయింటినెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్ 2007 ప్రకారం వృద్ధులు యొక్క ఆహారం వసతి వైద్య సంరక్షణ సమకూర్చవలసిన బాధ్యత వృద్ధుల యొక్క పిల్లలది ఆ బాధ్యత నెరవేర్చకుండా పిల్లలు నిర్లక్ష్యం చేస్తే న్యాయవ్యవస్థ ద్వారా వారికి లబ్ధి చేకూరుతుందని ఒకవేళ వాళ్ళు ఆ బాధ్యతను చిత్తశుద్ధితో తల్లితండ్రులను సక్రమంగా చూసుకోకపోతే మాయ మాటలు చెప్పి బలవంతంగా వారిచే ఆస్తిని వ్రాయించుకుని ఉంటే ఆ వృద్ధులు విషయాన్ని కాకినాడ మండల న్యాయ సేవాధికార సంస్థకు అర్జీ పెట్టుకుంటే ఉచితంగా న్యాయపరంగా వృద్ధులు యొక్క ఆస్తిని పిల్లలనుంచి బదిలీ చేసి తిరిగి వృద్ధులకు ఆ ఆస్తిని సక్రమించేలాగా చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసంత, రాజశేఖర్, శ్యామ్ మరియు జనావళి వృద్ధాశ్రమం వెలమల తూరంగి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలతో రైతులకు, ప్రజలకూ ఎంతో మేలు

## తృణధాన్యాలతో ఆహారభద్రత కల్పించొచ్చు - సీతయ్యమ్మపేటలో జిల్లా స్థాయి రాగి రైతు మేళా






**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆరోగ్యానికి మేలు చేసే ఫైబర్, మాంసకృత్తులు, కాల్షియం, ఇనుము పోషకాలతో నిండి ఉండే జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, వరిగెలు, సామలు, అరికెలు, ఊదలు, అవిసెలు వంటి చిరుధాన్యాలు (తృణధాన్యాలు - మిల్లెట్స్) సాగు రైతులకు, వినియోగదారులకు ఎంతో ప్రయోజనమని కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చిరు ధాన్యాల సాగు ద్వారా సాగు విస్తీర్ణం పెంచడంతో పాటుగా ఆహార భద్రతను కూడా కల్పించ వచ్చని ఆయన వివరించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం సీతయ్యమ్మపేట పంచాయతీలో స్థానిక ప్రభుత్వ సామాజిక భవనం ప్రాంగణంలో జిల్లా స్థాయి చిరుధాన్యాల మేళాను శనివారం నిర్వహించారు. రైతులు సేకరించిన చిరుధాన్యాల విత్తనాలను, వాటితో మహిళా రైతులు తయారు చేసిన, వండిన రాగి అంబలి, జావ, లడ్డూలు, జంతికలు, బిస్కత్తులు, రాగి మిక్చర్ వంటి ఆహార పదార్ధాలను, కూరగాయలను, ఆకు కూరలను, పకృతి సేద్యంలో వినియోగించేందుకు రైతులే స్వయంగా తయారు చేసిన వివిధ రకాల కషాయాలను ఈ మేళాలో వివిధ విభాగాల్లో ప్రదర్శించారు. వీటి గురించి రైతులకు,



సందర్శకులకు వివరించారు. అనంతరం సామాజిక భవనం లోపల నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో రైతులు, సందర్శకులను ఉద్దేశించి జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయకుమార్ ప్రసంగించారు. జాతీయ ఆహార భద్రత, పోషణ మిషన్ లో భాగంగా రైతులకు రాగి విత్తనాలను రాయితీపై అందజేసి నాణ్యమైన దిగుబడులతో పోషకాహారం పొందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు పండించిన చిరుధాన్యాలను మద్దతు ధరలకే రైతుల నుండి కొనుగోలు చేస్తామని ప్రభుత్వం తరఫున ఎన్.విజయకుమార్ ప్రకటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో చిరుధాన్యాల సాగు విధానాల వివరాలను రైతులకు జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ ఎలియాజర్ వివరించారు. చిరుధాన్యపు పంటలైన రాగి, కొర్ర, జొన్న, సజ్జ, సామలు, అరికలు సాగులో మేలైన యాజమాన్య పద్ధతుల గూర్చి జిల్లా ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా.సీతారామ శర్మ రైతులకు వివరించారు. అనంతరం చిరు ధాన్యాలు సాగు చేస్తూ వివిధ మండలాల నుండి హాజరైన రైతులు తమ అనుభవాలను సభలో వివరించారు. అనంతరం చిరుధాన్యాల సాగుకు మేలైన యాజమాన్య పద్ధతులు అనే పుస్తకాన్ని విడుదల చేసి రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు డి.మాలకొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సంజీవ్ కుమార్, జగ్గంపేట, పిఠాపురం, తుని సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాస్, స్వాతి, మాధవి, చంద్రశేఖర్, వివిధ మండలాల వ్యవసాయ అధికారులు పడాల గాంధీ, అశోక్, ఈశ్వర్, అమృత, సత్యనారాయణ, నరసింహం, రాబిన్, వెంకట లక్ష్మీ, సుధ మాధురి, వ్యవసాయ విస్తరణాధికారులు, ఆత్మ బిటిఎం. ఎన్.బాబురావు, సీతయ్యమ్మపేట షాడో సర్పంచ్ తోట శ్రీకృష్ణ, ది కత్తిపూడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గాబు కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఉగ్గిరాల నాగేశ్వరావు, వివిధ మండలాల రైతులు, మహిళలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్ర 'ఆటో డ్రైవర్ల సేవలో' రూ. 436 కోట్ల పంపిణీ

## ప్రత్తిపాడుకు రూ. రూ. 2.34 కోట్ల పంపిణీ - పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ- ఆటోలు నడిపిన నారాయణ, సతీష్ బాబు






**శంఖవరం, విశ్వం వాయిస్ :** ఈ ఆర్థిక సంవత్సరపు 'ఆటో డ్రైవర్ల సేవలో' పథకం అమలు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన మొత్తం 2,99,669 మంది ట్యాక్సీ, మ్యాక్సీ, క్యాబ్, ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికి రూ. 15,000 చొప్పున రూ. 436 కోట్ల నగదును బ్యాంకు ఖాతాల్లో ఈ రోజున ప్రభుత్వం జమ చేసిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పేదవాడికీ వివిధ పథకాల్లో ప్రభుత్వ లబ్ది చేకూరుస్తూ వారిని సంతోషంగా ఉంచడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఈ ఆటో డ్రైవర్ల సేవలో... పథకం ఆ దిశగా ఒక పెద్ద అడుగని వివరించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం నగర పంచాయతీలో ఆటో డ్రైవర్ల సేవలో పథకాన్ని శనివారం మంత్రి నారాయణ ప్రారంభించారు. నియోజకవర్గంలోని అర్హులైన మొత్తం 1,561 మంది ట్యాక్సీ, మ్యాక్సీ, క్యాబ్, ఆటో డ్రైవర్లకు రూ. 2,34,15,000 విలువ చేసే నమూనా బ్యాంకు చెక్కును మంత్రి, రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, లోక్ సభ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ రాజశేఖర్, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, జిల్లా కలెక్టర్ మన్మోహన్ సగిలి, డీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, జిల్లా టీడీపీ అధ్యక్షులు తోట నవీన్ కుమార్ సంయుక్తంగా పంపిణీ చేశారు. దీనికి ముందు మంత్రి నారాయణ, సానా సతీష్ బాబు స్వయంగా ఆటోలను నడుపుతూండగా మూడు కిలో మీటర్ల దూరం ఆటో డ్రైవర్లు ర్యాలీని నిర్వహించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు ఆనందంతో ఆటో డ్రైవర్లు పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతను, సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా లబ్ది పంపిణీ సభలో మంత్రి నారాయణ ప్రసంగించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో ... పథకం ఎన్.డి.ఏ. ఎన్నికల విధాన ప్రకటనలో లేదనీ, ఐతే స్త్రీ శక్తి పథకంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందువల్ల ఆటో డ్రైవర్లకు కొంత మేరకు నష్టం జరిగి ఉంటుందని భావించి ఈ ఆటో డ్రైవర్ల సేవలో ప్రవేశ పెట్టామన్నారు. అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. నేటి పంపిణీ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు.., మొత్తం ఒక కుటుంబం మొత్తానికీ ఒక ఆర్థిక భరోసా అన్నారు. తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి కూడా కార్మికుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం కూడా ఆటో డ్రైవర్ల సేవలో... తో కార్మికుల పక్షపాతని నిరూపించు కుందన్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమైతే ఆటో కార్మికులకు రూ. 10,000 లో చొప్పున ఇచ్చి ఏవిధంగా కేసులు పెట్టి ఇబ్బందులు పెటైటిందో మనందరకూ తెలుసని ఎమ్మెల్యే గుర్తుచేసారు. పేదవారి భరోసా కోసం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచు కుంటున్నాయని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం కూడా ఆటో కార్మికుల కుటుంబాలకు అండగా నిలుస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, స్థానిక సంస్థల నామినేటెడ్ పదవీ నేతలు, పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నేతలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నేతలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పెట్రోల్-డీజిల్ మాఫియాపై మెరుపు దాడులు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా వ్యాప్తంగా అక్రమంగా వాహనాల నుంచి డీజిల్‌ను సేకరించి, అనుమతులు లేకుండా అధిక ధరలకు విక్రయిస్తున్న డీజిల్ మాఫియా స్థావరాలపై పోలీస్ ప్రత్యేక దళాలు శనివారం మెరుపు దాడులు చేపట్టాయి. కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు గండేపల్లి, తొండంగి, తుని రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నాలుగు చోట్ల నిర్వహించిన దాడుల్లో ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసారు. వీరి నుంచి మొత్తం 5,100 లీటర్ల డీజిల్, 3,380 లీటర్ల తారును స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న చమురు పదార్థాల మొత్తం మార్కెట్ విలువ సుమారు 8.48 లక్షలుగా అంచనా వేసినట్లు



అధికారులు తెలిపారు. జిల్లాలో చట్టవిరుద్ధంగా పెట్రోల్, డీజిల్ నిల్వ, రవాణా, విక్రయం చేసే వారిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుం టామని ఎస్పీ జి.బిందు మాధవ్ సామాజిక మాధ్యమాల ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కాలంలో జిల్లాలోని ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఆయిల్ మాఫియా మార్కెటింగ్ పై ఓ దినపత్రికలో ప్రముఖంగా వార్తా కథనాలు వెలువడిన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం ఆలస్యమైనా తాజాగా మేల్కొంది.

# నూతన రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బుచ్చిబాబు



**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో నూతన సీసీ రోడ్డుకు అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ బాలయోగి,ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు.ఎం జీ ఎన్ ఆర్ ఈ జి ఎస్ పథకంలో 3.56 (మూడు కోట్ల యాభై ఆరు) లక్షల రూపాయలతో గ్రామంలో 32 సిమెంట్ కాంక్రీట్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు.

# సాయిప్రియ సేవా సమితి 166వ వారం అన్నదానం

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాయిప్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కేంద్రం పిఠాపురం పశువుల సంతలో అన్నదాతలైన రైతులకుగా నిరవధికంగా వారానికి ఒక రోజు చొప్పున శనివారం మధ్యాహ్నం పూట ఆంధ్రా అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గుర్తుగా డొక్కా సీతమ్మ అన్నపానీయ సదుపాయ కేంద్రం పేరుతో నిర్వహిస్తున్న అన్నదానం ఈ శనివారంతో 166 వ వారానికి చేరుకుంది. అన్ని దానాల కన్న అన్నదానం మిన్న అన్న లోకోక్తి అనుసారం దేశానికి వెన్నెముకైన అన్నదాతకు పెట్టెడు అన్నం పెట్టి వారిని ఆదుకుంటే అదే మహా భాగ్యమని భావించిన కాకినాడ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తలంచారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్థానికంగా 2010 లో సాయిప్రియ సేవా సమితిని స్థాపించి, దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా కొనసాగుతూ శంఖవరం మండలం కత్తిపూడి



కేంద్రంగా సాయిప్రియ సేవా సమితి ద్వారా వివిధ ప్రజాభివృద్ధి, సంక్షేమ, అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను 15 ఏళ్ళుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం పేరుతో పిఠాపురం పట్టణంలో పశువుల సంత కేంద్రంగా రైతులు, పశువుల బేరగాళ్ళు, మధ్యవర్తులు, స్థానిక వివిధ ఆస్పత్రులకు వచ్చే దూర ప్రాంతాల రోగులకూ ప్రతీ శనివారం మధ్యాహ్నం అన్నదానాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. ఈ అన్నదానం ఈ శనివారంతో 166 వ వారానికి చేరుకుంది. దీనిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో నిర్వహిస్తున్నారు. నేటి మధ్యాహ్నం రైతులకు, పశువుల బేరాల మధ్యవర్తులకు, వివిధ ఆస్పత్రులకు వచ్చిన ఔట్ పేషెంట్లకు కలిపి 640 మందికి అన్నదానం చేశారు. ఆహార పదార్థాలు వడ్డనలో స్వచ్ఛందంగా సేవలను అందించిన కోలా నాని, సఖినాల లచ్చబాబు, జ్యోతుల నాని, విప్పర్తి శ్రీనులను సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు అభినందించారు. తమ ఈ సేవలను పిఠాపురం పశువుల సంతకు వచ్చే రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని శంఖవరం మండలం కత్తిపూడిలోని సాయిప్రియా సేవా సమితి ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.



# ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా..

**“ఆటో డ్రైవర్ల సేవలో”పథకం ప్రారంభం - సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం**

**ఆటో డ్రైవర్ల సేవలో... ఇది వారి ఆర్థికాభివృద్ధికి ఊతం : రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆటో డ్రైవర్లకు దసరా... అలాగే రానున్న దీపావళి పండుగ కానుగా ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ద్వారా వారి ఇళ్లల్లోకి తమ కూటమి ప్రభుత్వం ముందుగానే పండుగను తీసుకువచ్చిందని నీటి పారుదల శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు.ఆటో డ్రైవర్ల సేవ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం కంబాల చెరువు చిరంజీవి పార్కు వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి నీటిపారుదల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులు, ఆటో డ్రైవర్లు పాలాభిషేకం నిర్వహించడం జరిగింది. అనంతరం అక్కడ నుంచి వందలాది ఆటోలతో ర్యాలీగా బయలుదేరి ఆనం కళా కేంద్రంలో నిర్వహించిన ఆటో డ్రైవర్లతో సేవలో పథకం యొక్క ప్రారంభోత్సవ సభకు హాజరు కావడం జరిగింది. కంబాల చెరువు నుంచి ఆనం కళా కేంద్రం వరకు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్... మంత్రి నిమ్మల రామానాయుడుని ఎక్కించుకొని ఆటో నడపడం జరిగింది. ఆనం కళా కేంద్రంలో జరిగిన సభలో మంత్రి రామానాయుడు, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, యర్రా వేణు గోపాలరాయుడు, గన్ని కృష్ణ, వర్రే శ్రీనివాసరావు, మజ్జి రాంబాబు, అత్తి సత్యనారాయణ, వై.శ్రీను అధికారులతో కలిసి ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి సంబంధించిన చెక్కును ఆటో డ్రైవర్లకు అందించడం జరిగింది. అనంతరం మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.10 వేలు మాత్రమే ఇస్తే, కూటమి ప్రభుత్వం 50శాతం పెంచి రూ.15వేలు అందిస్తోందన్నారు. గత ప్రభుత్వంలో 2.61 లక్షల మందికి 261.51 కోట్లు మాత్రమే అందిస్తే, మేము అదనంగా మరో 30 వేల మందికి ప్రయోజనం కలిగించి రూ.175 కోట్ల అదనంగా అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఒక చేత్తో 10వేలు ఇచ్చి, మరో చేత్తో గుంతల రోడ్ల తో రిపేర్లు, ఫైన్స్, టాక్సలు, డీజిల్ ధరలు పెంపుతో ఏడాదికి లక్ష రూపాయలు గుంజుకున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో గుంతల రోడ్ల కారణంగా ఆటోలు, వాహనాలు దారుణంగా దెబ్బతినేవని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పాత వాహనాలపై గత ప్రభుత్వంలో 20 వేలు ఉన్న గ్రీన్ ట్యాక్స్‌ను కుదించి, రూ.3 వేలకు తగ్గించి వాహనదారులకు పెద్దమొత్తంలో ఉపశమనం కలిగించామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.1,000 కోట్లు ఖర్చు చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టి వాహన సాఫీగా ప్రయాణం సాగేలా చేసిందన్నారు. గతంలో జగన్ రూ. 260 కోట్లు ఖర్చు చేస్తే కూటమి ప్రభుత్వం రూ. 435 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అందచేసే రూ. 15000 ఆటో డ్రైవర్లకు ఆర్థిక భరోసా ఉంటుందన్నారు. గత ప్రభుత్వంలో మాదిరిగా కూటమి పాలనలో ఆటో డ్రైవర్లకు వేధింపులు లేవన్నారు. గ్రీన్... రోడ్ టాక్స్‌ల భయం లేదన్నారు. 15 నెలల కూటమి పాలనలో సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి సూపర్ హిట్ చేయడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 11,915 మందికి ఆటో డ్రైవర్లు సేవలో భాగంగా రూ.17,87,25,000, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గంలో 2,131 మందికి 3,86,10,000 ఆర్థిక సహాయం అందించడం జరుగుతోందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లిలో భారీ అన్నదానశాల..

**తిరుమల తర్వాత ఇదే పెద్దది - ఒకేసారి 3,500 మందికి భోజన సదుపాయం..**

**రూ.6.25 కోట్లతో నిర్మాణం..త్వరలోనే ప్రారంభం...**



**వాడపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి పుణ్యక్షేత్రంలో వకులమాత అన్నదానశాల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ఈ అన్నదానశాల నిర్మాణం పూర్తయితే ఈ పుణ్య క్షేత్రానికి మరో మైలురాయిగా పేర్కొవచ్చు. ఎందుకంటే “ఏడు వారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్యఫలం”అనే భక్తుల నమ్మకం అనతి కాలంలోనే బాహ్య ప్రపంచంలో ప్రాచుర్యం పొందింది. అలాగే స్వామి వారి దర్శనంతో పాటు ఈ పుణ్యక్షేత్రం వద్ద పెట్టే అన్నదానానికి కూడా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుంది. అయితే ఇప్పటివరకు ప్రతి శనివారం వచ్చే వేలాది మంది భక్తులు భోజనం చేయడానికి ఇబ్బంది పడాల్సి వస్తుంది. తాత్కాలిక షెడ్డులలో నిలబడే ఈ భోజనాలు చేయడానికి సమస్యగా మారింది. అందుకనే భక్తుల విరాళాలు,దేవదాయ శాఖ నిధులు రూ.6.25 కోట్ల భారీ అంచనా వ్యయంతో భోజనశాలను నిర్మిస్తున్నారు.ఒకేసారి సుమారు 3,500 మంది కూర్చుని తినే సౌకర్యం కలగనుంది. దీంతో భక్తులు ఎవరూ నిలబడి తినాల్సిన పని లేకుండా అందరూ కూర్చుని టేబుల్ మీద స్వామి వారి భోజన ప్రసాదం తీసుకునే అవకాశం కలుగుతుంది.

**ప్రస్తుత భోజనశాల 250 మందికే..**

ప్రస్తుతం ఈ దేవస్థాన కార్యాలయ భవనం కింద ఉన్నటువంటి భోజనశాల లో ఒకేసారి 250 మంది మాత్రమే కూర్చుని భోంజనం చేసే సామర్థ్యం ఉంది. ఇది భక్తులకు ఏమాత్రం సరిపడుటలేదు. మిగిలిన రోజుల్లో కాస్త సరిపడుతున్నప్పటికీ శనివారం మాత్రం తాత్కాలిక షెడ్డుల లోనే నిలబడి భోజనాలు చేస్తున్నారు. వాడపల్లి పుణ్యక్షేత్రంలో అన్నదానం ఎన్నో సంవత్సరాలుగా ప్రసిద్ధి చెందింది. పప్పుతోపాటు ఓ కూర,సెట్నీ, సాంబారు,పెరుగు వంటి వాటితో ఇక్కడ అన్న ప్రసాదం భక్తుల ఆదరణను చూరగొంది. శనివారం సుమారు 75 వేల నుంచి లక్ష మంది వరకు భక్తులు స్వామివారి దర్శనానికి వస్తున్నారు. ఇందులో సగం మంది వరకు ఈ అన్నదానంలో భోజనం చేస్తున్నారు. ఉదయం 10:30 నుంచి భోజన సదుపాయం దేవస్థానం వారు ఏర్పాటు చేస్తున్నారు. స్వామివారి దర్శనం చేసుకున్నవారు ఇక్కడ భోజనం చేయడానికి ప్రాదాన్యతనిస్తారు.

**తిరుమల తర్వాత ఇదే పెద్ద అన్నదానశాల:**

రాష్ట్రంలో అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. దేశంలోనే ప్రసిద్ధి చెందిన కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో భోజనశాలలు దేశంలోనే కాదు ప్రపంచంలోనే అరుదైనవిగా చెప్పవచ్చు.తిరుమల తర్వాత స్థానం రాష్ట్రంలో వాడపల్లికి దక్కబోతుంది. ఎందుకంటే రాష్ట్రంలో ప్రముఖ దేవాలయాల కాణిపాక వినాయకుని ఆలయం, శ్రీశైలం మల్లికార్జున ఆలయం, శ్రీకాళహస్తి శివాలయం, విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయం, ద్వారక తిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయం, అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయం, అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, దాక్షారామం భీమేశ్వర స్వామి ఆలయం, సింహాచలం నరసింహస్వామి ఆలయం,అరసవిల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయం వంటివి ఎన్నో ఉన్నాయి. అయితే ఈ ఆలయాల్లో ఎక్కడా లేనంత అన్నదానశాల ఇక్కడ రూపుదిద్దుకుంటుంది. ఉదయం నుంచే భోజన సౌకర్యం కల్పిస్తున్నందున వచ్చిన భక్తులు వచ్చినట్లే ఎక్కడా వేచి ఉండాల్సిన అవసరం లేకుండా భోజనం చేసే సౌకర్యం కలగనుంది. ఇప్పుడు వరకు చాలామంది భక్తులు నిలబడి ఎక్కువ సమయం వేచి ఉండి భోజనం చేయడం ఇబ్బందికరంగా ఉండడంతో చేయకుండానే వెళ్ళిపోతున్నారు. ఇక ఆ పరిస్థితి ఉండదు. స్వామివారి ప్రసాదం ప్రతి ఒక్కరు తీసుకునే అవకాశం కలుగుతుంది.

**వకులమాత అన్నదానశాలకు భారీ విరాళాలు**

వాడపల్లిలో నిర్మితమవుతున్న వకులమాత అన్నదానశాలకు భారీ ఎత్తున విరాళాలు వస్తున్నాయి. అంత పుణ్యకార్యానికి తమ వంతు భాగస్వామి చేయాలని భక్తులు అధిక మొత్తంలో విరాళాలు అందిస్తున్నారు. ప్రముఖ పారిశ్రామకతలు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, సినీ,టీవీ నటులు, అధికారులు వంటి భక్తులు ఈ భోజనశాల నిర్మాణానికి పెద్ద ఎత్తున విరాళాలు అందిస్తున్నారు. అందుకనే ఇంత వేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని చెప్పవచ్చు. అలాగే నిర్మాణ పనులు పూర్తయిన అనంతరం వంట సామాగ్రి, కుర్చీలు, స్టీల్ టేబుల్స్ వంటి వాటిని సుమారు కోటిన్నర రూపాయలతో సమకూర్చడానికి ఓ దాత ముందుకు వచ్చారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్ రావు లు నిత్య పరిరక్షణలో ఈ నిర్మాణ పనులు చురుకుగా జరుగుతున్నాయి.సుమారు రెండు ఎకరాల విస్తీర్ణంలో భక్తులకు ఎంతో అనువైన ప్రదేశంలో నిర్మాణం జరుగుతుంది. ఆలయానికి దక్షిణ వైపున మోటారు సైకిళ్ళు, ఆటోలు,బస్సుల పార్కింగ్ ప్రాంతంలో ఈ అన్నదాన శాల అధునాతన సౌకర్యాలతో నిర్మిస్తున్నారు.

**దేవిచౌక్ శరన్నవరాత్రి మహోత్సవాల్లో**

# ఆదిత్య సేవలకు సత్కారాలు

**భక్తులకు ఆదిత్య సేవలు మరువలేము**

**డాక్టర్ జి.వి.ఎస్.నాగేశ్వరరావుకు జ్ఞాపికతో సన్మానం**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 92వ శరన్నవరాత్రి దసరా ఉత్సవాలు చివరిరోజైనా విజయ దశమి సందర్భంగా రాజమహేంద్రవరం దేవి చౌక్ వద్ద ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు అందించిన స్వచ్ఛంద సేవలకు అద్భుత మైన ప్రశంసలు లభించినవి. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు బత్తుల రాజరాజేశ్వరరావు, ఇతర సభ్యులు స్వచ్ఛంద సేవకుల సేవలను ప్రశంసిస్తూ,భక్తులకు వారు అందించిన సహాయం ఎంతో మెచ్చదగినదని, వృద్ధులకు భక్తులకు చంటి పిల్లలకు అందించిన సహకారం, తోడ్పాటు అనిర్వచనీయమైనదని పేర్కొన్నారు.గత 16 సంవత్సరాలుగా నిరంతరం ఈ ఉత్సవాల్లో తమ సేవలను అందిస్తూ, భక్తుల భద్రత, సక్రమ ఏర్పాట్లలో ఎన్నదగిన కృషి మరువలేనివని కొందరు భక్తులు మెచ్చుకున్నారు. ఆదిత్య స్వచ్ఛంద సేవకుల ఎనలేని కృషి చేస్తున్నారని, డైరెక్టర్ ఎస్పీ.గంగిరెడ్డి నాయకత్వంలో ఆధ్యాత్మిక ప్రేరణతో, వినయ విధేయతలతో మెలగే వాలంటీర్ల పనితీరు అభినందనీయ మైనదని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం పర్యవేక్షణ లో.ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జి.వి.ఎస్ నాగేశ్వరరావుని కమిటీ సభ్యులు జ్ఞాపిక, శాలువాలతో ఘన సత్కారం చేసి వారి సేవలు, తోడ్పాటు అభినందనీయమైనవని, అమ్మవారి కరుణ వారందరిపై సదా ఉంటుందని ప్రశంసించారు. సహాయకులుగా పోలుకొండ సాయి,ఆకుల శిరీష, బేటి విమల,డాక్టర్ బి.హెచ్. వి. రమాదేవి సహాయ సహకారాల పర్యవేక్షణలో స్వచ్ఛంద సేవకులు ఎంతో క్రమశిక్షణతో శ్రమించారు. భక్తుల కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, పూజలు సజావుగా సాగేందుకు వారు చేసిన సహకారం ప్రశంసనీయ మని, సేవ లలో పాల్గొన్న వారిని సత్కరించారు.. ఎల్లప్పుడూ ఆదిత్య విద్యాసంస్థ తమకు చేదోడు, వాదోడుగా ఉంటుందని ఆలయ ట్రస్ట్ కమిటీ వాళ్లు తమ అభినందనలు తెలియజేశారు. తమ స్వచ్ఛంద సేవకులు చేసిన సేవలకు ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ సుగుణా రెడ్డి, ప్రిన్సిపాల్స్ సిహెచ్.ఫణి కుమార్ తదితరులు స్వచ్ఛంద సేవకులకు,ఎన్.ఎస్.ఎస్ కమిటీ అధికారులు తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

**ఆరోగ్య గణపతి ఆలయంలో**

# విజయదశమి ప్రత్యేక పూజలు..

**అమ్మవారిని గ్రామంలో ఊరేగించిన మహిళలు, కమిటీ సభ్యులు**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యి పంచాయతీ బుచ్చియ్య నగర్ నందు సంకటహర ఆరోగ్య గణపతి ఆలయంలో విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అమ్మవారిని గ్రామంలో ఉన్న మహిళలు పదకొండు రోజులు కుంకుమ పూజలు, అష్టలక్ష్మీ పూజలు, సరస్వతీ దేవి పూజ,శమీ పూజ నిర్వహించిన అమ్మవారిని మహిళలు తలపై పెట్టుకుని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న ఆడవారు, మగవారు, కమిటీ సభ్యులు అందరూ సహకారంతో గత రెండు సంవత్సరాలుగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి జక్కంపూడి విజయలక్ష్మి, కడియాలశ్రీనివాస్, కంచిపాటి ఫణికుమార్, రాళ్లపూడి పెద్ద,నాసింశెట్టి శ్రీను,పత్రే సతీష్,వంకల వీర్రాజు,బాసెట్టి సోమేష్, బాసెట్టి నాగరాజు,రెడ్డి హరిబాబు,బండి కాశీ విశ్వనాథ్,ఉల్లి ధనలక్ష్మి, బత్తుల శివకుమార్,రెడ్డి దుర్గ,బండి దేవీ,శ్రీదేవి,పత్రే చంద్రిక తదితరులు పాల్గొన్నారు.



# ఆజాద్‌చౌక్‌లో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రచారం..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పేద మధ్య తరగతి వర్గాలకు ఎన్డీయే ప్రభుత్వం సూపర్ గిఫ్ట్ ఇచ్చిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. జిఎస్టీ 2.ఓ ను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో సూపర్ జిఎస్టీ - సూపర్ సేవింగ్స్ నినాదంతో ముద్రించిన కరపత్రాలను స్థానిక ఆజాద్ చౌక్లోని వ్యాపారులు, ప్రజలకు కూటమి నాయకులతో కలిసి అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ జీఎస్టీ 2.ఓ కింద అనేకమైన స్లాబ్స్ ఏవ్కెతే ఉన్నాయో మధ్యతరగతి, దిగు మధ్యతరగతి వారికి చాలా ఉపయుక్తంగా ఉన్నాయన్నారు. కిరాణా సామాగ్రి గతంలో ఉన్న శ్లాబ్‌ను తగ్గించడం జరిగిందని, కొన్నింటిపై జిఎస్టీ తీసివేయడం జరిగిందన్నారు. జిఎస్టీ 2.ఓ ద్వారా ప్రతి కుటుంబానికి కూడా నెలసరి రూ. 15,000 ఆదా కానుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, అలాగే ఫైనాన్స్ మినిస్టర్ నిర్మల సీతారామన్ గారు తీసుకున్న నిర్ణయాన్ని ఈ రోజు భారతదేశంలో ఉన్న ప్రజానీకం అందరు కూడా హర్షిస్తా ఉన్నారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో ఈ రాష్ట్రంలో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ మరియు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యొక్క నాయకత్వంలో ఈ రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. అందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ కార్మికుల పక్షపాతి ప్రభుత్వం : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్డీఏ ప్రభుత్వం కార్మికుల పక్షపాతి ప్రభుత్వమని రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. శనివారం కోరుకొండలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో భాగంగా రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, రాజమహేంద్రవరం రుడా

## సూపర్ సిక్స్, సూపర్ హిట్ : బొడ్డు

చైర్మన్ రాజానగరం నియోజకవర్గ తెదేపా ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో కోరుకొండ దేవుని కోనేరు వద్ద నుండి ఆర్టిసి కాంప్లెక్స్ మీదగా ఎంపీడీవో కార్యాలయానికి భారీ ఆటోర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మూడు మండలాల్లో సుమారు 1,862 మంది ఆటో, మాక్స్ క్యాబ్ డ్రైవర్లకు 2.79 కోట్ల రూపాయలను వారి ఖాతాలో జమ చేయడం జరిగిందని బత్తుల తెలిపారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఆటోవాలాలకు అర్హత ఉన్న, కొద్ది మందికి మాత్రమే 10వేల రూపాయలు మాత్రమే జమ చేసేవారన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా “స్త్రీ శక్తి” పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రవేశపెట్టిన దగ్గర నుండి ఆటో డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని, దాన్ని దృష్టిలో పెట్టుకొని గత ప్రభుత్వాని కంటే మిన్నగా ఏడాదికి 15వేల రూపాయలు ఆటో కార్మికుల ఖాతాలకు జమ చేసిందన్నారు. సాంకేతిక కారణాలతో అర్హులు ఇంకా ఎవరికైనా అందకపోతే మరల అర్జీ పెట్టుకోవచ్చు అన్నారు. అనంతరం బొడ్డు మాట్లాడుతూ రాష్ట్రంలో సూపర్ సిక్స్ కార్యక్రమం సూపర్ హిట్ అయిందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలే కాకుండా రైతులు, కార్మికులు, మహిళల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. జీఎస్టీ ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాల్లో ఎన్నో కాంతులు వెదజల్లుతున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వం రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సుమారు 1400 కోట్ల రూపాయలతో ఎన్డీఏ ప్రభుత్వం రోడ్లను ఆధునికరించిందన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు రవాణాశాఖ అధికారి ఉమామహేశ్వరరావు, డిఆర్ఓ సురేష్ కుమార్, ఎంపీడీవో బత్తిన అశోక్ కుమార్, జేపి ఝాన్సీ, మూర్తి, ఎన్డీఏ నాయకులు తనకాల నాగేశ్వరరావు, దూది కాంతారావు, రొంగల శ్రీనివాస్, అడ్డాల శ్రీను, ముక్క రాంబాబు, ఆటో యూనియన్ నాయకులు బాలాజీ, కృష్ణ, శ్రీధర్, పలుశాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశంలో రాగుల విప్లవం ఆవశ్యం...!

♦ నేడు సీతయ్యమ్మపేటలో జిల్లా స్థాయి రాగి మేళా
♦ రైతులు, ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం
♦ రాగులు, రాగి ముడి, వండిన పదార్థాల ప్రదర్శన



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాగులు (చోళ్ళు) సాగు, వినియోగాన్ని ప్రోత్సాహిస్తూ రైతులు, ప్రజలకు సామూహిక అవగాహన కల్పించేందుకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం సీతయ్యమ్మపేట ప్రభుత్వ సామాజిక భవనంలో జిల్లా స్థాయి రాగి మేళాను శనివారం నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించే ఈ మేళా కార్యక్రమంలో వివిధ రకాల రాగి విత్తనాలను, రాగి ముడి పదార్థాలను, వండిన ఆహార పదార్థాలను ఈ మేళాలో ప్రదర్శనకు ఉంచుతారు. మేళాకు హాజరై రైతులు, ప్రజలు మేళా సందేశాలతో, ఆహార పదార్థాల ప్రదర్శనను ఉచితంగా తిలకించి వారి అవగాహనను మరింత పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయశాఖ ఈ సదవకాశాన్ని కల్పిస్తోంది. కాకినాడ జిల్లాలో రాగి సాగుకు అనుకూలమైన మెట్ట ప్రాంతపు జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని నియోజకవర్గాల్లోనే రాగిని ఎక్కువగా సాగు చేస్తున్నారు. అందువల్లనే ఈ మూడు నియోజకవర్గాలకూ మధ్యస్థంగా అనుకూలంగా ఉన్న ఈ సీతయ్యమ్మపేటలోనే ఈ జిల్లా స్థాయి రాగి మేళాను నిర్వహిస్తున్నట్టు శంఖవరం మండల వ్యవసాయ అధికారి పడాల గాంధీ "విశ్వం వాయిస్" శుక్రవారం సాయంత్రం వివరించారు. ఈ రాగి మేళా సదవగాహనా అవకాశాన్ని జిల్లాలోని ప్రజలు, రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని పడాల గాంధీ మీడియా ద్వారా పిలుపును ఇచ్చారు. ఈ జిల్లా స్థాయి ప్రత్యేక రాగి మేళా నిర్వహణ సందర్భంగా రాగి సాగు, వినియోగం ఆవశ్యకతపై ప్రత్యేక వార్తా కథనం ఇది. తెలుగు రాష్ట్రాలు పూర్వం చిరుధాన్యాలకు పేరొందాయి. వీటిలో రాగులు (చోళ్ళు - ఫింగర్ మిల్లెట్) పోషకాలతో నిండిన ధాన్యం. ఇది ఎముకలను బలపరుస్తుంది, మధుమేహాన్ని నియంత్రిస్తుంది. బరువు తగ్గడంలో సహాయ పడుతుంది. కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. జీర్ణ ప్రక్రియను మెరుగు పరుస్తుంది. శరీరాన్ని చల్లబరుస్తుంది. రాగుల్లో కాల్షియం, ఇనుము, ఫైబర్, విటమిన్లు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉంటాయి. రాగుల పిండిని దోసెలు, రొట్టెలు, ఇడ్లీలు, కుడుములు, జావ, వంటి వంటకాల్లో ఉపయోగించవచ్చు. రాగి పిండితో గంజి, దోసెలు, ఇడ్లీలు, రోటీలు, ఉప్మా వంటి వంటకాలను చేసుకోవచ్చు. మిల్క్‌షేక్‌లు, ఐస్ క్రీముల్లో కూడా రాగిని ఉపయోగించ వచ్చు. మూత్రపిండాల్లో రాళ్ళు ఉన్నవారు, ఆక్సలేట్ స్థాయిలు అధికంగా ఉన్నవారు రాగులను తినడం మానుకోవాలి. ఎందుకంటే రాగుల్లో సహజంగానే ఆక్సలేట్లు ఉంటాయి. రాగుల్లో కాల్షియం అధికంగా ఉండటం వల్ల ఎముకల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుంది. రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను అదుపులో ఉంచడంలో రాగుల్లోని ఫైబర్, పాలీఫెనాల్స్ సహాయ పడతాయి. ఇది మధుమేహం, మోకాళ్ల నొప్పులు, రక్త హీనత వ్యాధి గ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆయుర్వేదం ప్రకారం రాగులు కడుపులోని జీర్ణ వ్యవస్థలో ఉండే అమా (క్షయ్యక పదార్థాలు)ను, శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. రాగి ఫైబర్ జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. రాగులు సహజంగా శరీరాన్ని చల్లబరుస్తాయి. కాబట్టి వేసవిలో ఇవి తీసుకోవడం మంచిదని సూచిస్తారు. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల బరువు తగ్గడానికి సహాయపడుతుంది. శరీర రోజువారీ శక్తి అవసరాలను తీర్చడంలో రాగులు సహాయ పడతాయి. రాగులు సహజ ఇనుముకు మంచి మూలం. ఇవి రక్త హీనతను నివారించడంలో సహాయ పడుతుంది. దేశంలో ప్రధాన పంటలు వేళ్లూనుకున్నాయి. వరి, గోధుమలను మాన్పించడం కష్టం. దేశంలో 80 శాతానికి పైగా ఇవే సాగు అవుతున్నాయి. ప్రస్తుతం చిరు ధాన్యాలను ప్రధాన ఆహారంగా కంటే ప్రత్యామ్నాయ, అనుబంధ ఆహారంగా మార్చే ప్రయత్నాలు జరుగు తున్నాయి. రాయితీపై విత్తనాల పంపిణీకి కేంద్రం యోచిస్తోంది. సైన్యం ఆహారంలో 25% రాగులనే ఉండాలని ఆదేశించింది. ఒక గ్లాసు రాగిజావ పోషకాలపరంగా మూడు గ్లాసుల పాలతో సమానమని, పిల్లలకు రాగిజావ, జొన్నరొట్టె ఇప్పటి నుంచే అలవాటు చేయాలని భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ(ఐఐఎంఆర్) డైరెక్టర్ సి.తారాసత్యవతి సూచించారు. హరిత విప్లవం మాదిరిగా దేశంలో చిరుధాన్యాల విప్లవం రావాలని ఆకాంక్షించారు. ప్రతీ ఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో మూడో వంతు చిరుధాన్యాలు ఉండేలా చూసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో సైన్యానికి ఇచ్చే ఆహారంలోనూ 25% చిరు ధాన్యాలను వినియోగిస్తోందని, ఈ చైతన్యం అంతటా రావాలని చెప్పారు. ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ వీటిని చేర్చాలని సూచించారు. రైతులకు వరి, గోధుమ వంటి ప్రధాన పంటల కంటే చిరుధాన్యాల సాగు లాభమని డాక్టర్ తారా సత్యవతి ఒకానొక సందర్భంలో వివరించారు. రైతుల్లో క్రమేపీ మార్పు వస్తోంది. చిరు ధాన్యాలపై ప్రజల్లో చైతన్యం కనిపిస్తోంది. సాగు పెరుగుతోంది. 2023 అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం తర్వాత వాటి ప్రాధాన్యాన్ని అందరూ గుర్తిస్తున్నారు. వీటితో విభిన్న రకాల ఆహార ఉత్పత్తులు అందుబాటులోకి వస్తున్నాయి. వాటి కొనుగోళ్లకు మార్కెట్లోనూ డిమాండ్ ఉంటోంది. ప్రస్తుతం దేశంలో 18 నుంచి 20 మిలియన్ టన్నుల మేర ఉత్పత్తి జరుగుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ భాగస్వామ్యం చేస్తే దేశ వ్యాప్తంగా వీటి వినియోగం విస్తృత స్థాయిలో పెరుగుతుంది. తెలంగాణ, మహారాష్ట్రల్లో జొన్నలు, రాజస్థాన్లో సజ్జలు, ఏపీలో కొర్రలు, కర్ణాటకలో రాగులు ప్రసిద్ధి. ప్రభుత్వ ప్రజా పంపిణీ వ్యవస్థలోనూ రాగుల పంపిణీని భాగస్వామ్యం చేస్తూ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో రాగులు, రాగి పిండిని ఇవ్వాలి. పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాలు, ఆస్పత్రుల్లోనూ ఈ రాగి ఆహార పంపిణీ చేయాలని, దేశంలో రాగుల విప్లవం ఆవశ్యం అనే ప్రత్యేక డిమాండ్ ఇటీవల కాలంలో తెరపైకి వస్తోంది.





### ఆటో డ్రైవర్ల సేవలో పాల్గొన్న
## ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు




**ముమ్మిడివరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం ముమ్మిడివరం నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ మరియు ముమ్మడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మురమళ్ళ ఆటో స్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ ముమ్మిడివరం నియోజకవర్గంలో ఈ కార్యక్రమంలో సుమారు 1386 మంది ఆటో మరియు క్యాబ్ డ్రైవర్లకు 2 కోట్ల 7 లక్షల 90 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామని ఇది శ్రమజీవులు పట్ల కూటమి ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు ప్రభుత్వ సహాయాన్ని చెక్కు రూపంలో అందించారు. ప్రజలు ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### 7న కలెక్టరేట్ నందు వికాస కార్యాలయంలో
## మినీ ఉద్యోగమెళా : కలెక్టర్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈనెల 7వ తేదీ మంగళ వారం స్థానిక కలెక్టరేట్ నందు గల వికాస కార్యాలయం మినీ ఉద్యోగమేలా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఒక ప్రకటనలో తెలిపారు. ఫాక్సకన్ కంపెనీ బెంగళూరు మరియు పహ ర్ప్వార్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ శ్రీసిటీలకు సంబంధించి ఇంటర్వ్యూలు మంగళవారం ఉదయం 10 గంటల నుండి జరుగును కావున జిల్లాలోని 30 సంవ త్సరాల లోపు వయస్సు కలిగిన స్త్రీ పురుష అభ్య ర్థులు మీయొక్క బయోడేటాతో హాజరు కావాలని వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్ పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలు పూర్తి అయినా వెంటనే ఎంపికైన వారికి అప్పాయింట్మెంట్ లెటర్ కూడా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు.

## పితాని ఏసు కుమార్‌కి ఆర్థిక సహాయం



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం మాచవరం గ్రామ పంచాయితీ సమీపంలో కిడ్నీ వ్యాధి గ్రస్తుడు పితాని ఏసు కుమార్ కి వ్యాధి నయం చేసుకోవడానికి సహాయార్థంగా శనివారం అతని ఇంటివద్ద కు రాజోలుకి చెందిన బోనం రాజు సూరపురెడ్డి సురేష్ క్యాష్ 6500, కిరణా సామాన్లు 3000 విలువ కలిగినవి ఇవ్వడం జరిగింది. కోకో ఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, అన్యం రాంబాబు,అరిగెల రాంబాబు, అరిగెల కృష్ణ ప్రసాద్ కలిసి 25000 ఇరవై అయిదు వేల రూపాయలు బాధితుడు ఏసుకుమార్ కి శనివారం అందజేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న నల్ల పెద్ద కాపు నల్ల మౌళి ఈశ్వరరావు మాట్లాడుతూ దాతలు స్పందించి ఆదుకోవడం మంచి పని, ఇంకా దాతలు స్పందించి ఆదుకోవాలని కోరారు.

## మానసిక ఆరోగ్యం బాగుంటేనే దేశం అభివృద్ధి..

### లయన్స్ క్లబ్ 320ఎ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.మహేంద్ర కుమార్ రెడ్డి
### అక్టోబర్ 4 నుంచి 12 వరకు మానసిక ఆరోగ్య నవోత్సవాలు




**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్టోబర్ 4 నుంచి 12 వరకు మానసిక ఆరోగ్యం అవగాహన నవోత్సవాలను లయన్స్ క్లబ్320ఎ, ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్ 320ఎ డిస్ట్రిక్ట్ గవర్నర్ డా.జి.మహేంద్ర కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం సుందరయ్య పార్క్ లో డా.జి.మహేంద్ర కుమార్ రెడ్డి, డిస్ట్రిక్ట్ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ పి.రమేష్ చంద్రబాబు,లియో చైర్మన్ జి.కృష్ణ వేణి, సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ నిరంజన్ రెడ్డి, లయన్ జి.లక్ష్మీ, జయశ్రీ,శైలజ, ఉష్శ్రీ, డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్, వుమెన్ అండ్ చైల్డ్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ సుపర్ వైజర్ కర్నాటక డాక్టర్ స్పందన, పోస్టర్‌ను ఆవిష్కరించారు. డాక్టర్ జి.మహేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 100 కోట్లకుపైగా ప్రజలు మానసిక సమస్యలతో బాధపడుతున్నారని, ప్రతి ఏడుగురిలో ఒకరికి ఈ సమస్య ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్వో) వెల్లడించిందని తెలిపారు. యువతలో ఆత్మహత్యలు ప్రధాన మరణ కారణమని పేర్కొన్నారు. నేడు మానసిక ఆరోగ్యం పై అవగాహన పెరగడానికి కారణం డాక్టర్ హిప్నో కమలాకర్ అని అన్నారు. మానసిక ఆరోగ్యం బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎవరో మనల్ని గుర్తించి గజమాల వేయాలని, పక్క వారితో పోల్చుకోవడంతో మానసిక అనారోగ్యం పాలవుతున్నారన్నారు. మనసు మంచిదన్నారు. కానీ మాయ మాటలు, కఠినమైన ప్రవర్తనలతో మనసును కలతపరుస్తున్నామని తెలిపారు. గాయపడిన మనసుకు ఓదార్పు అవసరమని అందుకే మానసిక ఆరోగ్యంపై అవగాహన ముఖ్యమన్నారు.

**మెంటల్ హెల్త్ అవేర్నెస్ కోఆర్డినేటర్**

జిల్లా 320ఎ డా.హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ ఈ సందర్భంగా మహిళలు చిట్ చాట్.., మగవారు మనసు సున్నితం, విద్యార్థులు - ఆత్మహత్యలు పై అవగాహన, చదువు - ఒత్తిడి పై అవగాహన, ఆటలు - మానసిక ఆరోగ్యం, తల్లిదండ్రులు జన్మ భూమిపై -పిల్లలు విదేశాల్లో, ఒంటరి వృద్ధులు - మానసిక ఆరోగ్యం, చెత్తతో మానసిక సమస్యలు, విద్యార్థులు - హాస్టల్, ఇంటి పని - ఆఫీస్ పని బ్యాలెన్స్, సౌండ్ పొల్యూషన్‌తో మానసిక సమస్యలు, మూఢనమ్మకాలు, గర్భిణీ స్త్రీలు మానసిక ఆరోగ్యం ప్రభావం వంటి 12 అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా సమాజంలో మానసిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడం, సమస్యలను గుర్తించడం, పరిష్కార మార్గాలను సూచించడం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. లయన్స్ క్లబ్ 320ఎ ఆధ్వర్యంలో 5వ తేదీన సినియర్ సిటిజన్స్ డే సందర్భంగా ఎవి కాలేజీ, హైదరాబాద్ లో ఉదయం 8గంటల నుంచి 5 గంటల వరకు ఆటలు, పాటలు, డ్యాన్స్‌లు కార్యక్రమాలు, కొత్త వారిని కలవడం ఉన్నాయి..సినియర్స్ అందరూ పాల్గొవాలని తెలిపారు.

## బట్నవెల్లిలో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే ఆనందరావు

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆటో, టాక్సీ, మెక్సి క్యాబ్, మోటర్ క్యాబ్ డ్రైవర్లకు జిల్లాలో 7,709 మంది లబ్ధిని పొందారని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్లడిం చారు శనివారం భట్నవిల్లి నందు ఆటో డ్రైవర్ల సేవలో ఆటో రిక్షా మ్యాక్స్ క్యాబ్ మోటార్ క్యాబ్ డ్రైవర్లకు ఒక్కొక్కరికి పదిహేను వేల చొప్పున ఆర్థిక సాయం. నేరుగా ప్రత్యక్ష నగదు బదిలీ ద్వారా జమ చేశారు కలెక్టర్ ప్రసంగిస్తూ జిల్లాలో భాగంగా స్థానిక ఆమలా పురం డివిజన్లోనే 1306 మందికి ఆటో ఇతర క్యాబ్ డ్రైవర్ల కు ఈ లబ్ది చేకూరిందన్నారు. జిల్లా మొత్తంగా సుమారు 7709 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 15000 చొప్పున వారి ఎకౌంట్లకు జమ చేయడం జరిగిందన్నారు. స్థానిక శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు మాట్లాడుతూ సంక్షేమాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లడం లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవిశ్రాంతంగా కృషి చేస్తు న్నారన్నారు ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు కొని వారికి సహాయాన్ని అందించేందుకు కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు నిర్ణయం తీసుకుందని అన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ సహకారంతో ఒకపక్క సంక్షేమాన్ని కొనసాగిస్తూ మరోపక్క జిల్లాలోరెండు బ్రిడ్జిలు నిర్మించగలిగామని భవిష్యత్తులో కూడా మరిన్ని బ్రిడ్జిలు ఏర్పాటు చేసి అమలాపురంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్ర మంలో ఆటో యూనియన్ నాయకుల విజ్ఞప్తిల మేరకు ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు మరియు ఆటో కార్మికుల విజ్ఞప్తిలను దృష్టిలో ఉంచుకొని వారికి సహకరిస్తామని తెలియజేశారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి మరియు కూటమి నేతలు ఎంతో శ్రమిస్తున్నారని ఆ దిశగా జిల్లా వివిధ స్థాయిలలో అభివృద్ధిని సాధిస్తుందన్నారు. ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు తమ తమ అభిప్రాయాలను సభాముఖంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కొత్త మాధవి, జిల్లా రవాణా శాఖ అధికారి డి.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు మెట్ల రమణబాబు మోటార్ వెహికల్ ఇన్స్పె క్టర్లు ఆటో డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## 'ఆటో డ్రైవర్ల సేవలో' శ్రమజీవులకు గౌరవం

### కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలలో భాగంగా అమలుచేస్తున్న మరో హామీ 'ఆటో డ్రైవర్ల సేవలో' కార్యక్రమంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో గోడారిగుంట నుండి శుభం కాపు కల్యాణ మండపం వరకూ కూటమి నాయకులు, కార్యకర్తలు, ఆటో సోదరులతో కలిసి భారీ ఆటో ర్యాలీ నిర్వహించిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు చిక్కాల రామచంద్రరావు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కూడుపూడి సత్తిబాబు, కాకినాడ రూరల్ టీడీపీ కో-ఆర్డినేటర్ కటకం శెట్టి బాబీ, పెంకే శ్రీనివాస్ బాబా, నూరుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర డైరెక్టర్లు శిరంగు శ్రీనివాస్, కొల్లాబత్తుల అప్పారావు, ప్రకాష్ గౌడ్,రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయి నాయకులు, ఆటో డ్రైవర్స్ సంఘ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మానవత్వం మరిచిన మానవతా తీరు..




- కిలోమీటర్ల మేర మండుటెండలో విద్యార్థులతో సైకిల్ యాత్ర చేయించిన వైనం
- ఆట బొమ్మల్లా మారిన హైస్కూల్ విద్యార్థుల పరిస్థితి
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో తమ సంస్థ ప్రచార కార్యక్రమాలు
- స్పృహ తప్పి పడిపోయిన బాలిక, విపరీతమైన జ్వరంతో సతమతం
- పట్టించుకున్న పాపాన పోని మానవతా సంస్థ నిర్వాహకులు
- ప్రమాదకర రహదారులలో విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం
- మండలంలో అధ్వానంగా మారిన విద్యాశాఖ
- విద్యాశాఖాధికారి ని పట్టించుకోని పాఠశాలలు





పాఠశాలలో ఏమి జరిగిందో మాకు తెలియదు. మా పాప కళ్ళు తిరిగి పడిపోయిందని ఇంటికి తీసుకుని వచ్చారు అప్పటికే ఒళ్లంతా వేడిగా కాలిపోతుంది. ఏం జరిగిందని అడగగా సైకిల్ ర్యాలీ కి తీసుకువెళ్లారని, మహేంద్రవాడ పాలమూరు, తిరిగాక రామవరంలో కళ్ళు తిరిగి పడిపోయిందని చెప్పారు. మా మనవరాలకి ఏమైందో అని మాకు చాలా భయం వేసింది. పాఠశాలలో చదువుకోవాల్సిన పిల్లలను ప్రమాదకరమైన దారులలో సైకిల్‌పై తిప్పించడం బాధ కలిగించింది.

**విద్యార్థిని**

**సి.హెచ్ కావ్య, అమ్మమ్మ, రాయవరం**

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** తమ సంస్థ ఉనికి చాటుకోవడానికి తమ సొంత పాఠశాల విద్యార్థులను ప్రక్కన పెట్టి, ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థుల ప్రాణాలను పణంగా పెడుతున్న పరిస్థితి మండల కేంద్రమైన రాయవరంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలను పరిశీలిస్తే రాయవరం మండలం లొల్ల గ్రామానికి చెందిన విశ్వ మానవతా సంస్థ. తమ సంస్థ ద్వారా పలు కార్యక్రమాలు, అవగాహన చర్యలు చేపడుతున్నామని పలువురికి చూపించుకునే ప్రయత్నంలో ర్యాలీ లు నిర్వహించగా , ఈ ర్యాలీల కు తమ సంస్థ ద్వారా నడుపుతున్న, సొంత ప్రైవేటు పాఠశాలలోని విద్యార్థులను కాకుండా, మండల కేంద్రమైన రాయవరంలో గల శ్రీ రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులను విపరీతమైన వేడి వాతావరణంలో తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, మహేంద్ర వాడ, పొలమూరు, రామవరం, కుతుకులూరు వంటి పలు గ్రామాలకు ప్రధాన రహదారులు, ఇరుకు రహదారులలో సైతం మండుటెండ లోనే సైకిల్ యాత్ర చేయించి, సంస్థ అవసరాలు తీర్చుకుని, ఎవరి దారిన వారిని విడిచిపెట్టిన ఘటన చూస్తే ప్రభుత్వ పాఠశాల పిల్లలంటే, ప్రైవేటు యాజమాన్య మైన మానవతా సంస్థకు ఎంత చిన్న చూపో అర్థమవుతుంది. కనీస మానవత్వం గా విద్యార్థులకు దాహాన్ని సైతం తీర్చకుండా వ్యవహరించడంతో తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి మండలం, రామవరం గ్రామం చేరే సరికి సిహెచ్. కావ్య అనే విద్యార్థిని కళ్ళు తిరిగి పడిపోగా,తనకు విపరీతమైన జ్వరం వచ్చిందని తాము చాలా భయపడిపోయామని, తోటి విద్యార్థినిలు తెలపగా, ఇంత జరిగినా ఏమి పట్టనట్లు వ్యవహరించి మానవతా సంస్థ కు చెందినవారు అక్కడి నుండి వెళ్లిపోయారని ఒక విద్యార్థిని ఆవేదన వ్యక్తం చేయడం కూడు బాధాకరం. వారి పని పూర్తవగానే విద్యార్థులను పట్టించుకోకపోవడం, విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటం ఆడడం చూస్తే, మానవతా సంస్థ నిర్వహకులది, ఎంత దయలేని జాలి మనసో తేటతెల్లమవుతుంది.

**పర్మిషన్ ఎవరిచ్చారు..**

మండలంలో జరిగిన అమానుష పరిస్థితి పై మండల విద్యాశాఖ అధికారి వై సూర్యనారాయణ ను వివరణ కోరగా ఈ విషయంలో తనకు ఎలాంటి సమాచారం లేదని, ఏం జరిగిందో తనకు తెలియదని చెప్పడం గమనార్హం. కాగా ఈ చర్యలపై స్థానిక విలేఖరులు ఆయనను ప్రశ్నించగా, హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శాంతి సునీత శెలవులో ఉన్నారని, ఇన్చార్జి హెచ్.ఎమ్ సాయన్న కు ఎంఈఓ ఫోన్ చేయగా, అతను చెప్పిన వివరాల ప్రకారం మానవతా సంస్థ నిర్వాహకులు హెచ్.ఎం సునీత వద్ద అనుమతి పొందారని, అందుకే పంపామని విద్యాశాఖాధికారి తో చెప్పడం కొసమెరుపు. కాగా ఈ కార్యక్రమానికి కనీసం పాఠశాల ఉపాధ్యాయుల పర్యవేక్షణ కూడా లేకుండా నిత్యం ప్రమాదాల మయమైన రహదారులలో పిల్లలతో కిలో మీటర్ల మేర సైకిల్ యాత్ర చేయడమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తూ, అనారోగ్యం పాలైన విద్యార్థినిని పట్టించుకోకుండా వ్యవహరించిన మానవతా తీరు పై మండిపడుతున్నారు. సొంత అభిప్రాయాలతో విద్యార్థుల రక్షణ గాలికి వదిలేయడం మంచి పద్దతి కాదని, విద్యార్థులకు ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు సమాధానం చెబుతారని ఆవేదన వ్యక్తం చేస్తూ,రాయవరం హైస్కూల్ ఉపాధ్యాయుల తీరుపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**ఆత్మరక్షణలో అబద్దాలు**

స్థానిక విలేఖరులకు విషయం తెలిసిందని పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం అందగా, ముందు జాగ్రత్త చర్యలుగా విద్యార్థులతో ఉపాధ్యాయులు చేయించిన పని తీవ్ర చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల తల్లిదండ్రులకు నేటి సైకిల్ ర్యాలీ కార్యక్రమం గూర్చి ముందు రోజు చెప్పినట్లు, దానికి విద్యార్థుల తల్లిదండ్రులు సమ్మతించి, అనుమతించినట్లు, విద్యార్థులతోనే పర్మిషన్ లెటర్ రాయించి, వారి తల్లిదండ్రుల సంతకాలు సైతం వారిచేత పెట్టించినట్లు విశ్వసనీయ సమాచారం. విద్యార్థులకు ఉత్తమ బుద్ధులు నేర్పించాల్సిన పాఠశాలలో ఫోర్జరీ చేయడం నేర్పించడమేంటని విషయం తెలిసినవారు ముక్కున వేలేసుకుంటున్నారు. ఒక తప్పును తప్పిపుచ్చుడానికి అబద్ధం సృష్టించడం కంటే,ఆ తప్పుని ఒప్పుకుని విడిచిపెట్టడం మేలని పలువురు సూచిస్తున్నారు.



తల్లిదండ్రుల తర్వాత విద్యార్థులను సంరక్షించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే. కానీ ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేకుండా బయట వ్యక్తుల ప్రమేయంతో విద్యార్థిని విద్యా ర్థులను వికారపు ఎండలో సైకిల్‌పై తీసుకువెళ్లడం మంచి పద్ధతి కాదు. అంతా క్షేమంగా ఉన్నారు కాబట్టి సంతోషం. విద్యార్థులలో ఎవరి కైనా ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. మరొకసారి ఇలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్త పడటం మంచిది.

**లంక చందు, రాయవరం**

**పాఠశాలలో చదువుతున్న మరొక విద్యార్థిని తండ్రి**

## ఆటో డ్రైవర్లకు చేయూతగా

# నిలవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం...

### ఆటో డ్రైవర్ల సేవలో పాల్గొన్న లీలాకృష్ణ, ఎమ్మెల్యే వేగుళ్ళ...





**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట శ్రీ వేగుళ్ళ సూర్యారావు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఆటో డ్రైవర్‌ల సేవలో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వేగుళ్ల లీలా కృష్ణ పాల్గొన్నారు. ఈ సభ కు రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అధ్యక్షత వహించారు. తొలుత సమావేశంలో మున్సిపల్ కమీషనర్ టీవీ రంగారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని ఆకాశానికి ఎత్తేశారు. కూటమి ప్రభుత్వ గొప్పదనాన్ని కొనియాడటంతో పాటు గత ప్రభుత్వ వైఫల్యాలను నిశితంగా విమర్శించారు. దీంతో సభకు హాజరైన వారంతా ఒకింత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆయన ప్రసంగం అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ రెండేళ్ల అనంతరం రిటైర్మెంట్ తర్వాత కూటమి కొలువులో ఏదో ఒక పదవి గ్యారంటీ అంటూ చమత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ సభను ఉద్దేశించి మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం ఆటో డ్రైవర్ లకు కాస్త ఇబ్బంది కలిగించే విషయమే అయినప్పటికీ వారు పెద్ద మనస్సుతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందన్నారు. అయితే ఆటో డ్రైవర్ లు ఒక్కరూ బాధ పడకూడదు అనే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని అమలు చేసి 15000 రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. లక్షల కోట్లు అప్పుల్లో ఉన్నా రాష్ట్రాన్ని కూటమి కి అప్పగించినా దానిని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తున్న ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కే దక్కుతుందన్నారు. ఆనాడు దివం గత ఎన్టీఆర్ 35 రూపాయలతో దేశంలో మొట్టమొదటి సారిగా పింఛను పథకం ప్రవేశపెడితే నేడు దానిని 4 వేలకు తీసుకువెళ్ళి అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుదన్నారు. దివ్యాంగులకు 6 వేలు, తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారికి 10 నుండి 15 వేలు ఇచ్చి దివ్యాంగుల హృదయాల్లో చంద్రబాబు నిలిచి పోయాడన్నారు. మండపేట నియోజక వర్గంలో ఏడాదికి 192 కోట్లు పింఛన్లు నిమిత్తం ఖర్చుపెట్టడం జరుగుతుందన్నారు. అదే విధంగా అమరావతిని తిరిగి పటాలకు ఎక్కించిన ఘనత చంద్ర బాబుదేనన్నారు. చంద్రబాబు పై నమ్మకంతో దేశ విదేశాలనుండి ఎన్నో కంపెనీలు ముందుకు వచ్చి పెట్టుబడులు పెడుతున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రెట్టింపు నిధులు మంజూరు చేసి మన రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తున్నారని కొనియాడారు. కొన్ని మంచి పనులు చేసేటప్పుడు కొన్ని ఇబ్బందులు ఉంటాయని, వాటిని మంచి మనస్సుతో అర్థం చేసుకోవాలని ఆటో సోదరులకు విజ్ఞప్తి చేశారు. మండపేట వాణిజ్య పన్నుల అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం జీఎస్టీలను గణనీయంగా తగ్గించిందని, వాటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎవరైనా తగ్గించిన రేట్ల ప్రకారం అమ్మకాలు సాగించకపోతే 1915 టోల్ ఫ్రీ నెంబర్ కి ఫోన్ చేసి సంబంధిత వ్యాపారి పై పిర్యాదు చేయాలన్నారు. ఆటో డ్రైవర్ వేమగిరి మోషే మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం కోసం తమకు ముందుగానే తెలిసినప్పటికీ తమ పిల్లల భవిష్యత్ బాగుంటుందనే ఆశతో చంద్రబాబును గెలిపించుకోవడం జరిగిందన్నారు. తమ నమ్మకం వమ్ము కాకుండా నేడు డ్రైవర్ లు అందరికీ 15 వేలు అందించడం అభినందనీయమని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యంగా ఒక వ్యక్తి కి రెండు మూడు ఆటోలు ఉన్నప్పటికీ ఒక్కరికే ప్రభుత్వ ప్రయోజనం అందించడం జరుగుతుందని, అది సమంజసమేనని, అయితే సొంత ఆటోలు లేక డ్రైవర్ లుగా కొనసాగుతున్న వారికి సైతం ప్రభుత్వ ప్రయోజనాలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని, ఇందుకు ఎమ్మెల్యే సహకరించి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లాలని కోరారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ శ్రీదేవి మాట్లాడుతూ ఆటో డ్రైవర్ ల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర వ్యాప్తం గా ఆటో సోదరులకు 438 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రతి ఒక్కరూ రికార్డులను కలిగి ఉండటంతో పాటు బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలనీ సూచించారు. ప్రయాణీకుల ఆటోలను గూడ్స్ ఆటోలుగా మార్చవద్దని సూచించారు. దానివల్ల ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయడం వంటి పనులు. చేయవద్దన్నారు. బాధ్యతగా వ్యవహరిస్తూ రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సహకరించాలని కోరారు. ముఖ్య అతిథి లీలాకృష్ణ మాట్లాడుతూ గత 15 నెలలుగా రాష్ట్రంలో నష్టపోయిన వ్యవస్థలను కూటమి ప్రభుత్వం తిరిగి గాడిన పెడుతుందన్నారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటి నెరవేర్చుకుంటూ వస్తుందన్నారు. గత ప్రభుత్వం కార్పొరేషన్ లు పెట్టీ నిధులు పక్కదారి పట్టిస్తే ఇప్పుడు సక్రమ దారిలో అమలు అవుతున్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం అమరావతిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో అక్కడ అభివృద్ధి దూసుకుపోతుందన్నారు. ఆనాడు రోడ్లు దుర్భరంగా ఉంటే ప్రస్తుతం వాటిని పునర్నిర్మిస్తున్నారన్నారు. రాష్ట్రం లో జనసేన, టీడీపీ, బీజేపీ ఐక్యత తిరుగులేని శక్తిగా దూసుకుపోతుందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని మంచి పథకాలను కూటమి అమలు చేస్తుందని లీలా ధీమా వ్యక్తం చేశారు.

అనంతరం కోటి 48 లక్షల 65 వేల రూపాయలు విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ళ ఆటో డ్రైవర్లకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే వేగుళ్ళ, నీటి పారుదల సంస్థ చైర్మన్ లీలాకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ లను ఆటో డ్రైవర్‌లు దుస్సలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సాధారణ విద్యార్థులను అసాధారణంగా తీర్చిదిద్దడమే ధ్యేయం

### పెద్దాపురంలో శ్రీ అగస్త్య సిఓ స్కూల్ - బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే తనయుడు రంగనాగ్, రాజా సూరిబాబురాజు



**కాకినాడ రూరల్ / పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల, కళాశాలలను స్థాపించిన అనతికాలంలోనే ఉభయగోదావరి జిల్లాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీ అగస్త్య విద్యాసంస్థలు ద్వారా పెద్దాపురం, సామర్లకోట పట్టణాలలోని విద్యార్థులకు కాన్సెప్ట్ ఓరియంటేషన్ (సిఓ)ను మరింత దగ్గర చేసేందుకు గాను పెద్దాపురంలో తన ఐదవ బ్రాంచ్ ను ప్రారంభిస్తుంది. విజయ దశమిని పురస్కరించుకుని పెద్దాపురం అయోధ్యనగర్‌లో ప్రారంభించనున్న శ్రీ అగస్త్య పాఠశాల బ్రాంచికు సంబంధించిన బ్రోచర్ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, పెద్దాపురం మాజీ మున్సిపల్ ఛైర్మన్ ,టిడిపి పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజా సూరిబాబు రాజులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రంగనాగ్ మాట్లాడుతూ కాకినాడలో నాలుగు బ్రాంచిలతో మూడు సంవత్సరాలలోనే ఐఐటి, ఎన్ఐటి, ఈఏపీసెట్‌లతో పాటు నీట్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన శ్రీ అగస్త్య పెద్దాపురంలో ప్రారంభం కానుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. శ్రీ అగస్త్య పెద్దాపురం బ్రాంచి విజయవంతంగా ముందుకు సాగి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. మరో ముఖ్యఅతిథి రాజా సూరిబాబురాజు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులు సైతం ఐఐటి, నీట్‌లలో విజయం సాధించేలా కాన్సెప్ట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను అవలంభించడం ద్వారా ఈ ఉత్తమ ఫలితాల సాధనకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఆత్మవిశ్వాసం పెంచే మెంటారింగ్ సిస్టమ్‌తో పాటు ఆడియో విజువల్ ద్వారా ఇంటరాక్టివ్ బోర్డుపై బోధన నూతన బోధనా విధానానికి నాందిగా నిలుస్తుందన్నారు. శ్రీ అగస్త్య విద్యాసంస్థల ఛైర్మన్ , కరస్పాండెంట్ దొడ్డిపట్ల నాగేశ్వరరావు (డిఎన్ఆర్) మాట్లాడుతూ ఈ బ్రాంచ్‌లో 2026-2027 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల రామకృష్ణ, పెద్దాపురం మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మొయిళ్ల కృష్ణమూర్తి, శ్రీ అగస్త్య విద్యాసంస్థల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అరకు పర్యాటకులకు కారివాన్...

**విశాఖపట్టణం**

విశాఖపట్నం పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణగా 'కారవాన్' వాహనం వచ్చింది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు విజయవాడలో ప్రారంభించగా.. విశాఖపట్నానికి వాహనం చేరింది. విశాఖపట్నానికి చెందిన శివాజీ అనే వ్యాపారవేత్త రూ. 1.4 కోట్లతో ఈ వాహనాన్ని సమకూర్చారు. ఏపీటీడీసీతో ఒప్పందం చేసుకున్న తర్వాత దీనిని నడుపుతారు. త్వరలో టూర్ ప్యాకేజీ వివరాలు ప్రకటిస్తారు. ఏపీటీడీసీ ఒప్పందంతో ఇది అరకులోయ, పాడేరు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను తీసుకెళుతుంది. ఆంధ్రప్రదేశ్ టూరిజం ఈ కారవాన్ టూరిజంతో ఒక కొత్త మైలురాయిని చేరుకుంది. పీపీపీ పద్ధతిలో క్యారివ్యాన్ టూరిజంను ప్రారంభించింది. విలాసవంతమైన పర్యాటకాన్ని సామాన్యులకు అందుబాటులోకి తేవడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. విశాఖపట్నం నుండి పర్యాటక ప్రాంతాలకు వెళ్ళడానికి ఒక ప్రత్యేక కారవాన్ సిద్ధం చేశారు. ఈ కారవాన్ సౌకర్యంపై ప్రకృతి ప్రేమికులు చాలా సంతోషంగా ఉన్నారు. ఈ కారవాన్‌లో స్టార్ హోటల్ రేంజ్ సౌకర్యాలతో వివిధ ప్రదేశాలను చూసేందుకు వీలుగా ఉంటుంది. రాష్ట్ర పర్యాటక రంగానికి ఒక మంచి ప్రోత్సాహకమని చెబుతున్నారు. అయితే ఇప్పటికే వీకెండ్‌లో చిన్న, చిన్న కారవాన్లలో వెళ్లడానికి ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. అరకు, పాడేరు, లంబసింగి, వంజంగి, అనంతగిరి, ఒడిశాలోని కొన్ని ప్రాంతాలకు వెళ్తున్నారు. శనివారం ఉదయం బయల్దేరి, ఆదివారం రాత్రికి తిరిగి వస్తున్నారు. ఐదు నుంచి పది మందికి సరిపడేలా, ఏడు సీట్ల కార్లు, 12 సీట్ల వ్యాన్లను కారవాన్లుగా మార్చుతున్నారు. వీటిలో నిద్రపోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి సోఫాలు, కుర్చీలు ఉంటాయి. కొన్ని చోట్ల మనమే డ్రైవింగ్ చేసుకునే అవకాశం కూడా ఉంది. కుటుంబంతో కలిసి వెళ్లడానికి చాలా మంది ఇష్టపడుతున్నారు.

## మారనున్న ఆ 26 రోడ్లు

**విశాఖపట్టణం**

విశాఖపట్నంలో రోడ్ల సదుపాయాలను మెరుగుపరిచే దిశగా వీఎంఆర్డీఏ కీలక నిర్ణయం తీసుకుంది. రూ. 174 కోట్లతో ఏడు రహదారులను నిర్మించనుంది. ఈ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలపగా.. వీఎంఆర్డీఏ టెండర్లను కూడా ఖరారు చేసింది. తాజాగా పనులు ప్రారంభించేందుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ రహదారులను భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానించే జాతీయ రహదారి మీద ఒత్తిడిని తగ్గించేందుకు నిర్మించనున్నారు. విశాఖపట్నంలో రహదారి మౌలిక సదుపాయాలకు సంబంధించి కీలకమైన అడుగు పడింది. రూ. 174 కోట్లతో ఏడు మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి సంబంధించి విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ టెండర్లను ఖరారు చేయటంతో పాటుగా నిర్మాణ పనులను ప్రారంభించింది. 27 కిలోమీటర్ల మేరకు ఈ రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని అనుసంధానించే జాతీయ రహదారిపై ప్రయాణీకుల రద్దీని సులభతరం చేసేందుకు ఈ రోడ్లను నిర్మించనున్నారు. భోగాపురం చుట్టుపక్కల ప్రాంతాలైన భీమిలి, ఆనందపురం, గంభీరం, అడవివరం-సోంత్యం వంటి ప్రాంతాలలో ఈ రోడ్లు నిర్మిస్తున్నారు. వీఎంఆర్డీఏ , జీవీఎంసీ, రోడ్లు, భవనాల విభాగం సంయుక్తంగా ప్రతిపాదించిన 15 రోడ్లలో.. ఈ మేరకు ఏడు రోడ్లకు ప్రభుత్వం నుండి ఆమోదం లభించింది. వీటి పనులకు వీఎంఆర్డీఏ టెండర్లను ఖరారు చేసింది. 2024లో విశాఖపట్నంలో జరిగిన సమీక్షా సమావేశంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. కనెక్టింగ్ మాస్టర్ ప్లాన్ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం మెట్రోపాలిటన్ ప్రాంత అభివృద్ధికి అనుగుణంగా కనెక్టివిటీని మెరుగుపరచాలని సూచించారు.

## లద్దాఖ్‌కు చైనా ముప్పు!?

న్యూఢిల్లీ

లద్దాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇస్తే సరిహద్దుల్లో ఉన్న చైనా, పాకిస్థాన్ నుంచి సమస్యలు వస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోందా!? లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేరిస్తే.. మిగిలిన ప్రాంతాల నుంచీ ఇటువంటి డిమాండ్లే వస్తాయని అనుమానిస్తోందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఈ కారణంగానే చర్చల పేరిట కేంద్ర హోం శాఖ కాలయాపన చేస్తోందని ఆరోపిస్తున్నారు. నిజానికి, 2019 వరకూ లద్దాఖ్‌కు పరిమితి స్వయం ప్రతిపత్తి మాత్రమే ఉంది. స్వయం ప్రతిపత్తి కలిగిన రెండు మండళ్ల ద్వారా ఇక్కడ పాలన సాగేది. అయితే, 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసి జమ్ము కశ్మీరును కేంద్ర పాలిత ప్రాంతంగా.. లద్దాఖ్‌ను శాసనసభ లేని కేంద్ర పాలిత ప్రాంతంగా చేయడంతో ఈ మండళ్లు బలహీనమయ్యాయి. ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. అప్పుడు సామాజిక, రాజకీయ, మతపరమైన వ్యక్తులతో లే అపెక్స్ బాడీ (ఎల్ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్ (కేడీఏ) ఏర్పడ్డాయి. లద్దాఖ్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వాలని, ఈ ప్రాంతాన్ని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని ఉద్యమం ప్రారంభించాయి. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర హోం శాఖ 2023 జనవరిలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కానీ, దాని పనితీరు నత్తను మరిపిస్తోంది. కమిటీ సమావేశం ఈనెల ఆరో తేదీన అంటే, సోమవారం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే, లద్దాఖ్‌ను ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న శాంతియుత ర్యాలీ కాస్తా హింసాత్మకంగా మారింది. ప్రస్తుత పరిస్థితుల్లో సోమవారంనాటి జరుగుతుందా లేదా అనేదీ అనుమానమే. దీనికితోడు, లద్దాఖ్‌లో పూర్తిస్థాయి శాంతి నెలకొనే వరకూ చర్చలకు దూరంగా ఉంటామని ఎల్ఏబీ, కేడీఏ ప్రకటించాయి. ఈ నేపథ్యంలో.. ఇటు చైనా, అటు పాకిస్థాన్ సరిహద్దుల్లో వ్యూహాత్మక ప్రాంతంలో లద్దాఖ్ ఉండడంతో దానికి పూర్తిస్థాయి రాష్ట్ర హోదా ఇవ్వడం లేదా ఆరో షెడ్యూల్‌లో చేర్చడంపై మోదీ ప్రభుత్వం తర్జనభర్జనలు పడుతోందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

## నక్సల్స్‌తో చర్చల్లేవ్.. లొంగిపోండి

బస్తర్

నక్సల్స్‌తో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి స్పష్టం చేశారు. లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ లోని జగదల్పూర్‌లో శనివారం నాడు జరిగిన ర్యాలీ లో కేంద్ర మంత్రి మాట్లాడు తూ.. నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని, కేంద్రం ప్రక టించిన పునరావాస పాలసీని అందిపుచ్చుకోవాలని సూచించారు. మావోయిస్టులను మార్చి 31, 2026 నాటికి నిర్మూలిస్తామని.. వారితో చర్చల ప్రసక్తే లేదంటూ బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తేల్చి చెప్పారు. మావోయిస్టులతో ఇక చర్చల ప్రసక్తే లేదన్న అమిత్ షా.. లొంగిపోవాల్సిందేనన్నారు. ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామని.. లొంగిపోయిన వారందరికీ పునరావాసం కల్పిస్తామంటూ అమిత్ షా పేర్కొన్నారు. శనివారం ఆయన 'బస్తర్ దసరా లోకోత్సవ్' కార్యక్రమంలో మాట్లాడుతూ.. మావోయిస్టులతో చర్చలు జరిపే అవసరం లేదని స్పష్టం చేశారు. మావోయిజాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నాయి. బస్తర్ అభివృద్ధికి ప్రధాన అడ్డంకి నక్సలిజమే. బస్తర్ శాంతికి భంగం కలిగిస్తే భద్రతా బలగాలు తగిన రీతిలో సమాధానం చెబుతాయంటూ అమిత్ షా హెచ్చరించారు. ప్రధాని మోదీ ప్రభుత్వం గత 10 సంవత్సరాల్లో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి రూ. 4 లక్షల కోట్లకు పైగా నిధులు ఇచ్చింది. మావోయిజం వల్ల తప్పుదారి పట్టినవారు హింసను వదిలి జనజీవన స్రవంతిలో కలవాలంటూ అమిత్ షా పిలుపునిచ్చారు. బస్తర్ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకైనా మావోయిస్టులు పాల్పడితే భద్రతా బలగాలు గట్టి జవాబిస్తాయని ఆయన హెచ్చరించారు. 'కొందరు వ్యక్తులు వాళ్లతో (నక్సల్స్) చర్చలు జరపాలంటూ మాట్లాడుతున్నారు. మళ్లీ చాలా స్పష్టంగా చెబుతున్నా. ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ, అటు కేంద్రంలోనూ అధికారంలో ఉన్న మా రెండు ప్రభుత్వాలు బస్తర్‌తోపాటు నక్సల్ ప్రభావిత ప్రాంతం మొత్తాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని అమిత్‌షా అన్నారు. తాము ఎంతో ఆకర్షణీయమైన లొంగుబాటు పాలసీని తెచ్చామని, నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని కోరారు. అలా కాకుండా బస్తర్ ప్రాంతంలో శాంతికి భగం కలిగిస్తే సాయుధ బలగాలు, సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు తీవ్రంగా ప్రతిఘటిస్తాయని హెచ్చరించారు. బస్తర్ ప్రాంత అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అమిత్‌షా ప్రశంసించారు. గత పదేళ్లలో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి రూ.4 లక్షల కోట్లకు పైగా కేంద్రం కేటాయించిందని, రాష్ట్రంలోని గిరిజనుల కోసం పలు పథకాలను బీజేపీ ప్రారంభించిందని చెప్పారు.

స్వదేశీకి పట్టం కడితే..

దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు 'స్వదేశీ'కి కట్టుబడితే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా నిలుస్తుందని, దీనిని ఎవరూ అడ్డుకోలేరని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇటీవల జీఎస్‌టీ రేట్లు తగ్గించడం ద్వారా ఎంతో ఉపశమనం కలిగించారని, స్వదేశీ సంస్కృతికి మనమంతా కట్టుబడితే దేశ ఆర్థిక వ్యవస్థ అత్యున్నత శిఖరాలకు చేరుకుంటుందని తెలిపారు.

## అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణం కోసం పాక్ ప్రయత్నాలు!



అమెరికా– పాకిస్థాన్‌ల మధ్య సంబంధాలు ఇటీవల బలపడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అరేబియా సముద్రంలో పోర్టు నిర్మాణంపై పాక్ అమెరికా అధికారులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఆ దేశ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ ఇటీవల అగ్రరాజ్యం లో పర్యటించి సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే ఈ ప్రతిపాదనలు చేసినట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం.. అరేబియా సముద్రంలో ఓడ రేవు నిర్మించే అంశం గురించి మునీర్ యూఎస్ అధికారుల ముందు ఉంచారు. దీంతో తమ దేశంలోని పాస్నీలో లభించే కీలక ఖనిజాల రవాణాకు దీన్ని ఉపయోగించవచ్చునేది పాక్ ఆలోచన. అఫ్గానిస్తాన్– ఇరాన్ సరిహద్దులో ఉన్న బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఈ పాస్నీ ఒక ఓడరేవు పట్టణం. మునీర్ వైట్‌హౌస్ పర్యటనకు ముందే ఆయన అడ్వైజర్లు యూఎస్ అధికారులతో ఈ విషయంపై చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయితే, అమెరికా సైనిక స్థావరాల కోసం మాత్రం ఈ ఓడరేవును ఉపయోగించుకోవడాన్ని పాక్ వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. దీనికి బదులుగా పశ్చిమ పాకిస్థాన్‌లోని ఖనిజాలు లభించే ప్రావిన్స్‌లకు టెర్మినల్‌ను అనుసంధానించే రైలు కారిడార్ అభివృద్ధికి నిధులు కోరినట్లు సమాచారం. ఈ టెర్మినల్ ప్రాజెక్టు గురించి అటు అమెరికా అధికారులు కానీ.. ఇటు పాక్ అధికారులు కానీ ఎవరు స్పందించలేదు.

# లైవ్‌లో అమ్మేస్తున్నారు!

వ్యాపారం చేయాలంటే ఓ భారీ స్థాయి మాల్ కాకపోయినా.. చిన్న దుకాణం అయినా పెట్టుకోవాలి. లేదా రోడ్డుపై తోపుడు బండి అయినా నిర్వహించాలి. అదీ కాదంటే వాహనం ఆసరాగా చేసుకుని విక్రయాలు సాగించాలి. ఇదంతా సంప్రదాయ పోకడ. ఆన్ లైన్ రాకతో ప్రపంచవ్యాప్తంగా బిజినెస్ మోడల్ పూర్తిగా మారిపోయింది. సోషల్ మీడియా కాస్తా 'సోషల్ కామర్స్' అయిపోయింది. అంటే ప్రత్యక్షంగా దుకాణాలు పెట్టాల్సిన అవసరం లేకుండానే సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకుని వ్యాపారాలు పుట్టుకొస్తున్నాయి. ఒకటి కాదు రెండు కాదు.. కోట్ల మందికి ఇప్పుడీ ప్లాట్‌ఫామ్స్ బిజినెస్ అడ్డాలుగా అవతరించాయి. ఆన్ లైన్ లో ఉత్పత్తుల తాలూకు వీడియోలు, ఫొటోలు షేర్ చేయడం.. ఓ ఫోన్ నంబర్ ద్వారా వ్యాపారం చేయడం సాధారణం. ఈ%–%కామర్స్‌లో ఇప్పుడు లైవ్ స్ట్రీమింగ్ కొత్త ట్రెండ్. విక్రేతలు యూట్యూబ్ లైవ్, ఫేస్‌బుక్ లైవ్, ఇన్‌స్టాగ్రామ్ లైవ్ ద్వారా రియల్ టైమ్‌లో ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నారు. వీక్షకులు తమ కామెంట్స్ ద్వారా హోస్ట్‌తో సంభాషించవచ్చు. లైవ్ పోల్స్ నిర్వహించేందుకు హోస్ట్‌కు వీలవుతుంది. తెలివైన విక్రేతలు తాము తదుపరి వారం/తేదీన పరిచయం చేయబోయే ఉత్పత్తి గురించి ముందుగానే కొన్ని వివరాలను టీజర్ రూపంలో వెల్లడించి వీక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. అంతేగాక 24 గంటల కౌంట్‌డౌన్ నిర్వహించి తమ ఫాలోవర్లలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. తద్వారా ఎక్కువ మంది వీక్షకులను చేరుకుంటున్నారు. సోషల్ కామర్స్ భారత్‌లో 2025లో సుమారు రూ.1,80,000 కోట్ల వ్యాపారం చేస్తుందని అంచనాలు ఉన్నాయి. దేశంలో 90 కోట్లకుపైగా ఇంటర్నెట్ యూజర్లు ఉన్నారు. వీరిలో 25 శాతానికిపైగా ఆన్ లైన్ షాపింగ్ చేస్తున్నారు.

**స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. వర్ధిల్లు వ్యాపారాలు**




తాము సొంతంగా తయారు చేసిన ఉత్పత్తులు, పిండి వంటలు, కళాఖండాలు, అల్లికలు, పెయింటింగ్స్.. ఒకటేమిటి, వ్యాపారానికి ఏదీ అనర్హం కాదు. వ్యాపారం చేయాలంటే ఈ రోజుల్లో ఓ స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. ఔత్సాహికులు తక్కువ పెట్టుబడితో తమ కాళ్లమీద తాము నిలబడవచ్చు. చేతిలోని సెల్‌ఫోన్ తో వీడియోలు, ఫొటోలే కాదు.. లైవ్ స్ట్రీమింగ్ నిర్వహించి తాము విక్రయించే ఉత్పాదనను ప్రపంచానికి పరిచయం చేయవచ్చు. లైవ్ వీడియో చేయాలంటే పెద్దగా సాంకేతికంగా అవగాహన కూడా అవసరం లేదు. ఎడిటింగ్ భారం అసలే లేదు.

**దశాబ్దాల నుంచి..**

వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేయడానికి, ప్రజల్లో అవగాహన కల్పించడానికి వీడియోలు ఉపయోగిస్తున్నాయి. ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో వీడియోలు, షార్ట్స్ చూడటం పెరిగింది. ముఖ్యంగా ఉత్పత్తులు, సేవల గురించి తెలుసుకోవడానికి వీడియోలను చూసే ధోరణి ఊపందుకుంది. ఈ నేపథ్యంలో లైవ్ స్ట్రీమింగ్ ప్రాధాన్యత సంతరించుకుంది. లైవ్ స్ట్రీమింగ్‌తో షాపింగ్ ఎక్స్‌పీరియెన్స్ మారుతుందని ఈ%–%కామర్స్ దిగ్గజం అలీ ఎక్స్‌ప్రెస్ చెబుతోంది.

**వాయిదాలకు ఫుల్‌స్టాప్**

ఈ–కామర్స్ వెబ్‌సైట్లలో చాలామంది కస్టమర్లు తాము చూసిన ఉత్పాదనను తరువాత కొనొచ్చులే అని కార్ట్‌లో నిక్షిప్తం చేస్తారు. చాలా సందర్భాల్లో అవి కార్ట్‌కే పరిమితం అవుతాయి. అదే లైవ్‌లో అయితే.. నచ్చగానే ఆర్డర్ పెట్టేయొచ్చు. హోస్ట్ మీద, ఉత్పత్తి మీద నమ్మకం ఏర్పడితే.. వెంటనే ఆర్డర్ చేసేలా మనస్సు కూడా వీక్షకులను ప్రేరేపిస్తుంది అంటున్నారు మార్కెట్ విశ్లేషకులు. తరచూ వాయిదాలు వేసే కస్టమర్ల విషయంలో విక్రేతలకు లైవ్ స్ట్రీమింగ్ కలిసి వస్తుందని వారు చెబుతున్నారు.

**ప్రత్యక్షంగా వీక్షించి..**

ఆన్ లైన్ వ్యాపారంలో భాగంగా విక్రేతలు ఉత్పత్తుల తాలూకు వీడియోలు, ఫొటోలు పోస్ట్ చేయడం సర్వసాధారణం. అయితే ప్రత్యక్ష ప్రసారాన్ని నిర్వహించే వ్యక్తి (హోస్ట్) లైవ్ వీడియోలో ఉత్పత్తి గురించి పూర్తి వివరాలు వెల్లడించేందుకు వీలవుతుంది. లైవ్‌లో వచ్చే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం ద్వారా లక్షలాది మంది ఫాలోవర్లకు ప్రత్యక్షంగా అవి చేరతాయి. సందేహాలు ఉంటే నివృత్తి అవుతాయి. హోస్ట్ ఇచ్చే ప్రెజెంటేషన్ ఇక్కడ కీలకం. ప్రసంగం ఆకట్టుకునేలా ఉంటే ఉత్పత్తి పట్ల కస్టమర్లలో సానుకూల దృక్పథం ఏర్పడుతుంది. ఉత్పత్తి ఎలా పనిచేస్తుంది, ప్రత్యేకతలు, వారంటీ, గ్యారంటీ, ధర, మార్కెట్లో లభించే ఇతర ఉత్పత్తులతో పోలిస్తే తాము విక్రయించే ప్రొడక్ట్ విశేషాలను కస్టమర్లతో నేరుగా పంచుకోవచ్చు.

## నాటి ఆర్జేడీ ఆటవిక పాలన వల్లే

# నేటికీ బీహారీల వలసలు

ఇంటర్నెట్ డెస్క్: బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలైన ఆర్జేడీ, జేడీయూ కాంగ్రెస్ బీజేపీ నేతలు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇవాళ ప్రధాని నరేంద్రమోదీ బీహార్ రాజధాని పట్నాలో స్కిల్స్, ఎడ్యుకేషన్‌కు సంబంధించి రూ.62 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జేడీపైన, కాంగ్రెస్ పార్టీపైన ప్రధాని విమర్శలు గుప్పించారు. ఆర్జేడీ ఆటవిక పాలన కారణంగా బీహారీ యువత వలసలు వెళ్లాల్సి వస్తోందని ప్రధాని విమర్శించారు. ఆర్జేడీ హయాంలో విద్యావ్యవస్థ నిరాధరణకు గురైందన్నారు. పిల్లలకు సరైన విద్యావశాలు దొరకలేదని ఆరోపించారు. అభివృద్ధి లేకపోవడంతో పేదరికంలో ఉన్న పేరెంట్స్ పిల్లలను బడులకు బదులుగా పనులకు పంపారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ బీహార్ కోసం చేసిందేమీ లేదని ప్రధాని విమర్శించారు. ఓ కాంగ్రెస్ నాయకుడు ఎన్నికలు ఎక్కడ ఉంటే అక్కడ వాలిపోయి అసత్యాలు ప్రచారం చేస్తుంటాడని రాహుల్‌గాంధీని ఉద్దేశించి అన్నారు. నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కారు బీహార్‌ను ఎంతో అభివృద్ధి చేసిందని ప్రశంసించారు. ఇప్పుడు ఆ కాంగ్రెస్ నాయకుడి అబద్ధపు ప్రచారాలను బీహారీలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి



కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలనతో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బడ్జెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను ఆమోదించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 'స్టూడెంట్ క్రెడిట్ కార్డ్' ద్వారా పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి మద్దతిస్తోందన్నారు. 20 ఏళ్ల క్రితం బిహార్‌లో విద్యావ్యవస్థపై జరిగిన విధ్వంసం వల్ల యువత ఇతర రాష్ట్రాలకు తరలిపోవాల్సి వచ్చిందని ప్రధాని అన్నారు. అప్పటి ప్రభుత్వం చేసిన తప్పు వల్ల బిహార్‌కు వలసలు ప్రధాన సమస్యగా మారాయన్నారు. వాటిని అరికట్టాలంటే రాష్ట్రంలోనే ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని.. అందుకు అనుగుణంగా నీతీశ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తమ ప్రభుత్వం గత దశాబ్దంలో దేశంలో 5,000 ఐటీఐల ను ప్రారంభించిందని.. అవి పారిశ్రామిక విద్యకు ముఖ్యమైన కేంద్రంగా మాత్రమే కాకుండా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి వర్క్‌షాప్‌లుగా కూడా పనిచేస్తున్నాయన్నారు.

దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉందని.. బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నో ఏళ్లు యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. దాంతో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని మోదీ మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం భారత్ మూడో ఆర్థికశక్తిగా రూపుదిద్దుకునేందుకు సిద్ధమవుతోందన్నారు. బిహార్‌లో విద్యార్థుల కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం–సేతు పథకాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్యా, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

## విజయ్‌కు చేరువయ్యేందుకు బీజేపీ పావులు..

# సమీకరణలు మారనున్నాయా?

న్యూఢిల్లీ

తమిళనాడులోని కరూర్‌లో టీవీకే చీఫ్ విజయ్ నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట అనంతర నేపథ్యంలో రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నట్టు కనిపిస్తోంది. విజయ్ పార్టీ టీవీకే కు చేరువయ్యేంతకు బీజేపీ పావులు కదుపుతోందని విశ్వసనీయ వర్గాల సమాచారం. విజయ్‌కు ఉన్న విస్తృతమైన అభిమానుల ఫాలోయింగ్‌ను 2026 అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించుకునే ఆలోచనలో బీజేపీ ఉందని అంటున్నారు. ఇందులో భాగంగా విజయ్‌ను డీఎంకే అన్యాయంగా టార్గెట్ చేసినప్పటికీ అతను ఒంటరి అయినట్టు కాదని బీజేపీ సీనియర్ నేత ఒకరు టీవీకే నాయకత్వానికి సంకేతాలు పంపారని తెలుస్తోంది. డీఎంకేను అన్నిరకాలుగా కార్నర్ చేయాలని తాము కూడా కోరుకుంటున్నందున విజయ్‌ను సహనంతో ఉండాలని బీజేపీ సూచించినట్టు చెబుతున్నారు. కరూర్ తొక్కిసలాట సంక్షోభం అనంతరం విజయ్ భవిష్యత్ పొలిటికల్ ర్యాలీలపై అనిశ్చితి ఏర్పడింది. ఇది తన జీవితంలో ఎన్నడూ చూడని విషాదకర ఘటన అని, ఇది తనను ఎంతో బాధించిదనీ, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తనకు బాసటగా నిలిచిన రాజకీయ పార్టీలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని ఇటీవల విజయ్ ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు.

**సోలోగానే..**

టీవీకే ఒంటరిగా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తుందని విజయ్ ఇటీవల ప్రకటించారు. అయితే ఇటీవల జరిగిన పరిణామాలతో ఆయన తన రాజకీయ వ్యూహాలలో మార్పులు చేసుకునే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇక.. అధికార డీఎంకే ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని బీజేపీ బలంగా నమ్ముతోంది. ఈ నేపథ్యంలో టీవీకేను కూడా తమతో కలుపుకొని వెళ్లిన పక్షంలో వ్యతిరేక ఓట్లు చీలకుండా గంపగుత్తుగా ఎన్డీయే కూటమికే పడే అవకాశాలు ఉంటాయని విశ్వసిస్తోంది. సెప్టెంబర్ 27 తొక్కిసలాట ఘటన అనంతరం బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే బృందం కరూర్‌లో పర్యటించింది. 41 మంది మరణానికి దారితీసిన తొక్కిసలాటకు కేవలం టీవీకేనే తప్పుపట్టడం సరికాదని, ప్రభుత్వ నిర్వహణా లోపాలే ప్రధాన కారణమని బీజేపీ చెబుతోంది.

## దేశ పౌరుల రక్షణ కోసం హద్దులన్నీ మీరుతాం



పాకిస్థాన్‌ను ఉద్దేశించి భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. దేశ పౌరుల రక్షణ కోసం భారత్ ఏ హద్దులనైనా మీరుతుందని ఆయన గట్టిగా చెప్పారు. దేశ పౌరుల భద్రతకు, దేశ సమగ్రతకు ముప్పు పొంచి ఉంటే ఎలాంటి నిర్ణయాత్మక చర్యలకు దిగుతామో ఇప్పటికే నిరూపించామని అన్నారు. 2016 సర్జికల్ స్ట్రైక్, 2019 బాలాకోట్ ఎయిర్‌స్ట్రైక్, ఇటీవల చేపట్టిన ఆపరేషన్ సింధూర్ అందుకు నిదర్శనమని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ నిర్వహించిన జీటూ ఆశీఅలవచ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాకిస్థాన్ భూభాగంలో భారత్ సర్జికల్ స్ట్రైక్స్ చేసినప్పుడు తాము మతం చూడలేదని, కానీ పహల్గాంలో పౌరులను మతం అడిగి చంపారని రాజ్‌నాథ్ మండిపడ్డారు. తమ ప్రభుత్వం పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను మాత్రమే లక్ష్యంగా చేసుకుందని, సైన్యం జోలికిగానీ, సాధారణ పౌరుల జోలికిగానీ వెళ్లలేదని రాజ్‌నాథ్ చెప్పారు. మేం ఆ పని చేయాలనుకుంటే ఎప్పుడో చేసేవాళ్లమని, కానీ తాము అలా చేయలేదని అన్నారు.

# బిజినెస్

## తగ్గినట్లే తగ్గి మళ్లీ చురకలు అంటిస్తున్న బంగారం ధరలు



ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు. అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు భారీ షాక్ తగిలింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ. 1,08, 650 ఉండగా.. నేడు రూ. 800 పెరిగి రూ. 1, 09, 450గా ఉంది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ. 1,18, 530 గా ఉంది. నేడు రూ. 870 పెరిగి రూ. 1, 19, 400 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

## వాట్సాప్‌ను మించిన ఫీచర్స్‌తో స్వదేశీ యాప్ అరట్టై




వాట్సాప్ ప్రతిఒక్కరి ఫోన్లలో ఖచ్చితంగా ఉండే యాప్. మెసేజింగ్ యాప్స్ లో ప్రస్తుతం నంబర్ వన్ స్థానంలో ఉంది. దీనికి పోటీగా చాలా యాప్స్ వచ్చాయి కానీ నిలబడలేక పోయాయి. కాగా ఇప్పుడు వాట్సాప్‌ను బీట్ చేసేందుకు దేశీయ కంపెనీ జోహోకు చెందిన అరట్టై మెసేజింగ్ యాప్ వచ్చింది. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్ లాంటి వ్యక్తి స్వయంగా ప్రమోట్ చేయడంతో అరట్టై పేరు వార్తల్లో నిలుస్తోంది. ఇప్పటికే దీనిని ప్లే స్టోర్ లో 50 లక్షలకు పైగా మంది డౌన్ లోడ్ చేసుకున్నారు. ఫీచర్స్ లోనూ వాట్సాప్ కు మించి ఇందులో ఉండటంతో చాలా మందిని అరట్టై ఆకర్షిస్తోంది. అరట్టైలో మీటింగ్స్ పెట్టుకోవచ్చు. ఈ ఆప్షన్ వాట్సాప్ లోనూ ఉంది. కానీ అరట్టైలో పూర్తైన మీటింగ్స్ సమాచారం కూడా సేవ్ అవుతుంది. అదే విధంగా ఇందులో మీడింగ్స్ ముందే షెడ్యూల్ చేసుకోవచ్చు. వాట్సాప్ గ్రూపుల్లో ట్యాగ్ చేస్తే ఆ గ్రూప్ ఓపెన్ చేసి చూడాలి. కానీ అరట్టై లో మిమ్మల్ని ట్యాగ్ చేస్తూ చేసిన సందేశాలన్నీ ఒకేదగ్గర ఉంటాయి. కాబట్టి ప్రతి గ్రూప్ ఓపెన్ చేయాల్సిన అవసరం ఉండదు. వాట్సాప్ లో సేఫ్టీ ఉన్నప్పటికీ యూజర్ల డేటాను టార్గెట్ అడ్వర్టైజింగ్ కు వినియోగించుకుంటుంది. కానీ అరట్టై అలా డేటాను వినియోగించుకోదు. వాట్సాప్ లో మెటా ఏఐ సేవలు అందుబాటులో ఉన్నాయి. దాని వల్ల ఏఐ ఇంటరాక్షన్ కారణంగా ఇబ్బంది కలుగుతుంది. కానీ అరట్టై లో ఏఐ లేకపోవడం వల్ల యాప్ సింపుల్ గా, యూజర్ ఫ్రెండ్లీగా ఉండే అవకాశం ఉంది.

# మ్యూచువల్ ఫండ్స్‌లో మరో 12 కొత్త పథకాలు



ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో మరో 12 కొత్త ఫండ్స్ అందుబాటులోకి వస్తున్నాయి. వాటితో పాటుగా 3 స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఎస్ఎఫ్ఐ)లు సైతం ఉన్నాయి. ఇప్పటికే పలు స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ మొదలైంది. తమ కంపెనీ పోర్ట్‌ఫోలియోలో ఉన్న గ్యాప్స్ పూరించేందుకు కొత్త స్కీమ్స్ లాంచ్ చేస్తున్నట్లు మ్యూచువల్ ఫండ్ కంపెనీలు ప్రకటించాయి. న్యూ ఫండ్ ఆఫర్ ద్వారా మార్కెట్లకు కొత్త తరం ఫండ్స్ తీసుకొస్తున్నట్లు పేర్కొన్నాయి. మరి ఏ స్కీమ్ ఎప్పుడు వస్తుంది? క్యూసిఫ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే మొదలైంది. అక్టోబర్ 9వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. ఇక అల్టివా హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్, మ్యాగ్నమ్ హైబ్రిడ్ లాంగ్ షార్ట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 15వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది. కోటక్ నిఫ్టీ 200 మూమెంటమ్ 30 ఈటీఎఫ్, డీఎస్‌పీ నిఫ్టీ 500 ఫ్లెక్సీ క్యాప్ క్వాలిటీ 30 ఈటీఎఫ్ స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 6వ తేదీతో ముగుస్తోంది. జిరోధా నిఫ్టీ 50 ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ 10వ తేదీతో ముగుస్తుంది. వాటితో పాటుగా జియో బ్లాక్ రాక్ ఫ్లెక్సీ క్యాప్ ఫండ్, ద వెల్త్ కంపెనీ ఫ్లెక్సీ క్యాప్ పండ్ సబ్‌స్క్రిప్షన్స్ వరుసగా అక్టోబర్ 7వ తేదీ, అక్టోబర్ 8వ తేదీల్లో ముగుస్తున్నాయి. సెక్టోరల్ ఫండ్ కేటగిరీలో మోతీలాల్ ఓస్వాల్ కన్సంప్షన్ ఫండ్, ఇన్వెస్కో ఇండియా కన్సంప్షన్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 15, 17వ తేదీల్లో ముగుస్తున్నాయి. ద వెల్త్ కంపెనీ ఎథికల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రూ కాంగ్లమరేట్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 9, 17 తేదీల్లో ముగుస్తున్నాయి. ద వెల్త్ కంపెనీ ఆర్బిట్రేజ్ ఫండ్, ద వెల్త్ కంపెనీ లిక్విడ్ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 8వ తేదీన ముగుస్తుంది. జిరోధా నిఫ్టీ 50 ఇండెక్స్ పండ్ సబ్‌స్క్రిప్షన్ అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుంది. ఈ ఫండ్ హౌస్ అందిస్తోన్న ఏకైక డైరెక్ట్ ప్లాన్ ఇదే. మ్యూచువల్ ఫండ్స్‌లోనూ హైరిస్క్ ఉంటుంది. ఈ కథనం కేవలం సమాచారం అందించేందుకే. కానీ, ఎలాంటి పెట్టుబడులను ప్రోత్సహించడం లేదు. అలాగే కొత్తగా మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలనుకునే వారు న్యూ ఫండ్ ఆఫర్‌కి దూరంగా ఉండాలని మార్కెట్ నిపుణులు సూచిస్తుంటారు. సరైన అవగాహన లేకుండా పెట్టుబడులు పెడితే నష్టపోవచ్చు. గతంలో వచ్చిన రాబడులు భవిష్యత్తులో వస్తాయని గ్యారెంటీ ఉండదు.

# అదిరిపోయే ఫీచర్లతో 2025 థార్



ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా సంస్థ ఎస్‌యూవీ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'థార్ 2025' కొత్త మోడల్‌ను శుక్రవారం మార్కెట్లోకి విడుదల చేసింది. ఆకర్షణీయమైన డిజైన్, అత్యాధునిక ఫీచర్లతో వచ్చిన ఈ కొత్త థార్ ప్రారంభ ధరను రూ.9.99 లక్షలుగా (ఎక్స్-షోరూమ్) నిర్ణయించింది. పట్టణ ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా మార్చడంతో పాటు, వారాంతపు ఆఫ్-రోడ్ అడ్వెంచర్లను ఇష్టపడే వారిని లక్ష్యంగా చేసుకుని ఈ ఎస్‌యూవీని తీర్చిదిద్దినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది.ఈ కొత్త మోడల్‌లో టెక్నాలజీ, కంఫర్ట్‌కు పెద్దపీట వేశారు. ఇందులో 26.03 సెంటీమీటర్ల హెచ్‌డీ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌ను అమర్చారు. ఇది ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేలకు సపోర్ట్ చేస్తుంది. స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ కోసం టైప్-సి యూఎస్‌బీ పోర్టులను కూడా అందించారు. ప్రయాణంలో టైర్ల దిశను తెలియజేసే టైర్ డైరెక్షన్ మానిటరింగ్ సిస్టమ్, అడ్వెంచర్ ప్రియుల కోసం రేసింగ్ ట్యాబ్, ఆల్టిమీటర్, ట్రిప్ మీటర్ వంటి వివరాలను అందించే 'అడ్వెంచర్ స్టాట్స్ జెన్ ××' ఫీచర్‌ను కూడా పొందుపరిచారు.ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈసారి అనేక మార్పులు చేశారు. ముఖ్యంగా వెనుక వరుసలో కూర్చునే వారి కోసం రియర్ ఏసీ వెంట్లను ఏర్పాటు చేశారు. డ్రైవర్ సౌకర్యం కోసం స్లైడింగ్ ఆర్మ్‌రెస్ట్, ఆటోమేటిక్ వేరియంట్లలో డెడ్ పెడల్ వంటివి ఇచ్చారు. డోర్-మౌంటెడ్ పవర్ విండోస్, రియర్-వ్యూ కెమెరా డ్రైవింగ్‌ను మరింత సులభతరం చేస్తాయి.ఈ సందర్భంగా మహీంద్రా అండ్ మహీంద్రా ఆటోమోటివ్ డివిజన్ సీఈఓ నళినీకాంత్ గొల్లగుంట మాట్లాడుతూ, "థార్ కేవలం ఒక ఎస్‌యూవీ మాత్రమే కాదు, ఇది స్వేచ్ఛకు, సాహసానికి ఒక ప్రతీక. వినియోగదారుల అభిప్రాయాలకు మేము ఎల్లప్పుడూ విలువ ఇస్తాం. వారి అవసరాలకు అనుగుణంగానే ఈ కొత్త థార్‌ను రూపొందించాం" అని తెలిపారు. కొత్త డిజైన్, స్మార్ట్ టెక్నాలజీ, మెరుగైన సౌకర్యాలతో ఈ మోడల్ పట్టణ, ఆఫ్-రోడ్ సెట్టింగ్‌లలో అద్భుతమైన డ్రైవింగ్ అనుభూతిని అందిస్తుందని ఆయన వివరించారు.

## ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా గిల్, టీ20లకు సూర్య సారథ్యం..

# వన్డేల్లోకి రోహిత్, కోహ్లీ

**ముంబై :** ఆస్ట్రేలియాతో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు చెందిన భారతీయ జట్టును ప్రకటించారు. టీమిండియా వన్డే జట్టుకు శుభమన్ గిల్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఇక టీ20 సిరీస్ మ్యాచ్‌లకు సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలను నిర్వర్తిస్తాడు. ఆస్ట్రేలియా, ఇండియా మధ్య మూడు వన్డేలు, అయిదు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి. అక్టోబర్-నవంబర్ నెలల్లో ఆ మ్యాచ్‌లు ఉంటాయి. సీనియర్స్ మెన్స్ సెలక్షన్ కమిటీ భారత బృందాన్ని ఎంపిక చేసింది. అయితే వన్డేల్లో సీనియర్ క్రికెటర్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీకి ఛాన్స్ దక్కింది. ఆ ఇద్దర్నీ ఆసీస్‌తో సిరీస్‌కు ఎంపిక చేశారు. ఇక వైస్ కెప్టెన్సీ బాధ్యతలను శ్రేయాస్ అయ్యర్‌కు అప్పగించారు. వన్డేలకు వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్ ఎంపికయ్యాడు. వన్డే టీమ్‌లో నితీశ్, సుందర్, కుల్దీప్, హర్షిత్ రాణా, సిరాజ్, అర్షదీప్, ప్రసిద్ధ కృష్ణ, ధ్రువ్ జురెల్ , జైస్వాల్ కూడా ఉన్నారు. ఆసీస్‌తో జరిగే టీ20 సిరీస్‌కు సూర్యకుమార్ యాదవ్ సారథ్య బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆ జట్టులో అభిషేక్ శర్మ, గిల్, తిలక్ వర్మ, నితీశ్, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, వరుణ్ చక్రవర్తి, బుమ్రా, అర్షదీప్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ సాంసన్, రింకూ సింగ్, సుందర్ ఉన్నారు. అయితే వన్డే జట్టుకు స్పీడ్ బౌలర్ బుమ్రాను ఎంపిక చేయలేదు. తొలుత వన్డేలు జరుగుతాయి. అక్టోబర్



19వ తేదీన పెర్త్‌లో ఫస్ట్ వన్డే, అడిలైడ్‌లో 23న రెండో వన్డే, 25న సిడ్నీలో మూడో వన్డే ఆడనున్నారు. తొలి టీ20 అక్టోబర్ 29వ తేదీన కెనబెరాలో జరగనున్నది. మెల్‌బోర్న్‌లో రెండో టీ20 అక్టోబర్ 31వ తేదీన, మూడవ మ్యాచ్ నవంబర్ 2న హొబర్ట్‌లో, నాలుగో టీ20 గోల్డ్ కోస్టులో నవంబర్ 6న, 5వ టీ20 బ్రిస్బేన్‌లో నవంబర్ 8వ తేదీన ఆడుతారు.
కెప్టెన్సీ మార్పు గురించి రోహిత్ శర్మకు తెలియజేసినట్లు చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపారు.

## ఫస్ట్ టెస్టులో విండీస్ విలవిల.. ఇన్నింగ్స్ 140 రన్స్ తేడాతో ఇండియా విక్టరీ




**అహ్మదాబాద్:** వెస్టిండీస్‌తో జరిగిన ఫస్ట్ టెస్టులో ఇండియా భారీ విజయాన్ని నమోదు చేసింది. అహ్మదాబాద్ టెస్టులో ఇన్నింగ్స్ 140 రన్స్ తేడాతో గిల్ సేన గెలుపొందింది. ఇవాళ రెండో ఇన్నింగ్స్‌లో విండీస్ కుప్పకూలింది. కేవలం 146 పరుగులకే ఆలౌటైంది. మూడో రోజు ఉదయం ఆట ప్రారంభానికి ముందే ఇండియా తన ఫస్ట్ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయడంతో.. వెస్టిండీస్ బ్యాటింగ్ ప్రారంభించింది. ఫస్ట్ సెషన్‌లోనే భోజన విరామ సమయానికి ముందు విండీస్ అయిదు వికెట్లను కోల్పోయింది. భారత స్పిన్నర్లు విండీస్ బ్యాటర్లకు దడపుట్టింది. స్పిన్‌కు అనుకూలిస్తున్న అహ్మదాబాద్ పిచ్‌పై రెండో ఇన్నింగ్స్‌లో చెలరేగిపోయారు. విండీస్ బ్యాటర్లు చాలా ఈజీగా తమ వికెట్లను సమర్పించుకున్నారు. భారత బౌలర్లలో జడేజా 4, సిరాజ్ 3, కుల్దీప్ రెండు వికెట్లు తీసుకున్నారు. విండీస్ బ్యాటర్లలో అథనేజ్ 38, గ్రీవ్స్ 25 రన్స్ చేశారు.

# స్పోర్ట్స్

## పాపం అభిషేక్ శర్మ.. ఊహించని షాకిచ్చిన బీసీసీఐ!?




భారత వన్డే జట్టులోకి ఎంట్రీ ఇవ్వాలనుకున్న యువ సంచలనం అభిషేక్ శర్మకు నిరాశే ఎదురైంది. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో అభిషేక్‌కు చోటు దక్కలేదు. రెగ్యూలర్ ఓపెనర్లగా శుబ్‌మన్ గిల్, రోహిత్ శర్మ ఉండగా.. బ్యాకప్ ఓపెనర్‌గా యశస్వి జైశ్వాల్‌ను సెలక్టర్లు ఎంపిక చేశారు. జైశ్వాల్ చివరగా ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత తరపున వన్డేల్లో ఆడాడు. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ-2025కి అతడిని పక్కన పెట్టారు. మళ్లీ ఇప్పుడు ఆసీస్‌తో సిరీస్‌కు ఈ ముంబై ఆటగాడికి సెలక్టర్లు తిరిగి పిలుపునిచ్చారు.

అభిషేక్ వెయిట్ చేయాల్సిందే..

అయితే అభిషేక్ శర్మ ప్రస్తుతం వైట్ బాల్ క్రికెట్‌లో దుమ్ములేపుతున్నాడు. ఇటీవల ముగిసిన ఆసియాకప్‌లో అభిషేక్ ప్లేయర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా నిలిచాడు. ఈ టోర్నీలో పంజాబ్ ఆటగాడు 200 స్ట్రైక్ రేట్‌తో 314 పరుగులు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. టీ20ల్లో ప్రపంచ నంబర్ వన్ బ్యాటర్‌గా అభిషేక్ కొనసాగుతున్నాడు. దీంతో ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు అభిషేక్‌ను సెలక్టర్లు ఎంపిక చేస్తారని అంతా భావించారు. కానీ అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతడిని పరిగణలోకి తీసుకోలేదు. రోహిత్ శర్మ, గిల్, జైశ్వాల్ రూపంలో ఓపెనర్లు అందుబాటులో ఉండడంతో అభిషేక్ వైపు సెలక్టర్లు మొగ్గు చూపున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా 50 ఓవర్ల ఫార్మాట్‌లో శర్మ తన స్కిల్స్‌ను మరింత మెరుగుపరుచుకోవాలని సెలక్టర్లు సూచించినట్లు సమాచారం. అభిషేక్ శక్రవారం ఆసీస్-ఎతో జరిగిన అనాధికారిక వన్డేలో గోల్డెన్ డక్‌గా వెనుదిరిగాడు. ఇది కూడా అతడి ఎంపికపై ప్రభావం చూపించింది. అభిషేక్ శర్మ తన కెరీర్‌లో ఇప్పటివరకు 61 లిస్ట్-ఎ మ్యాచ్‌లు ఆడి 35.33 సగటుతో 2,014 పరుగులు చేశాడు. అతడి అత్యధిక వ్యక్తిగత స్కోర్ 170గా ఉంది. అదేవిధంగా బౌలింగ్‌లో కూడా 38 వికెట్లు పడగొట్టాడు. అయితే అభిషేక్ ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే అత్యంత త్వరలోనే వన్డే జట్టులోకి కూడా వచ్చే అవకాశముంది. కాగా భారత వన్డే కెప్టెన్‌గా రోహిత్ శర్మను బీసీసీఐ తప్పించింది. అతడి స్థానంలో శుబ్‌మన్ గిల్‌కు వన్డే జట్టు పగ్గాలను అప్పగించారు.

## ఓటీటీలోకి రాబోతున్న 'మిరాయ్'

టాలీవుడ్ యంగ్ హీరో తేజ సజ్జా నటించిన 'మిరాయ్' బాక్సాఫీసు వద్ద సంచనాలు సృష్టిస్తోంది. సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు వచ్చి రికార్డులు క్రియేట్ చేస్తూ దూసుకుపోతుంది.అన్ని ప్రాంతాల్లో భారీ కలెక్షన్లు రాబడుతూ సినీ సెలబ్రిటీల ప్రశంసలు పొందుతోంది. ఇప్పటివరకు ఈ సినిమా ఏకంగా రూ. 150 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. కేవలం రూ. 60 కోట్ల బడ్జెట్‌తో విజువల్ వండర్‌గా వచ్చి ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటోంది. దీంతో సినీ ప్రియులంతా ఈ చిత్రం ఎప్పుడెప్పుడు ఓటీటీలోకి వస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈక్రమంలో.. తాజాగా, 'మిరాయ్' డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైనట్లు అధికారిక ప్రకటన విడుదలైంది. కేవలం నెలరోజులకే ఈ సినిమా ఓటీటీలోకి రాబోతుండటం విశేషం. ఈ చిత్రం హక్కులను ప్రముఖ సంస్థ జియో హాట్‌స్టార్ సొంతం చేసుకోగా.. అక్టోబర్ 10 నుంచి తెలుగు, తమిళ, మలయాళ కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రకటించారు. "తొమ్మిది గ్రంథాలు. అనంతమైన శక్తి. బ్రహ్మాండాన్ని రక్షించడానికి ఒక సూపర్ యోధుడు. భారతదేశం సొంత సూపర్ హీరో మిరాయ్, అక్టోబర్ 10 నుండి మీ ఇంటి రాబోతున్నారు" అనే క్యాప్షన్ జత చేశారు. దీంతో ఈ విషయం తెలుసుకున్న ప్రేక్షకులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. కాగా.. తేజ సజ్జా, కార్తీక్ ఘట్టమనేని కాంబోలో వచ్చిన ఈ సినిమాను పీపుల్ మీడియా బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. ఇక ఇందులో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇందులో మంచు మనోజ్ విలన్‌గా నటించగా.. జగపతిబాబు, శ్రియా శరణ్, జయరామ్ కీలక పాత్రలో కనిపించి నటనతో మెప్పించారు.



## ప్రభాస్‌లా నేను కూడా.. అందుకే అలా పిలుస్తారు

'కేజీఎఫ్' సినిమాతో హీరోయిన్‌గా పాన్ ఇండియా లెవల్లో గుర్తింపు తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి.. తర్వాత అడపాదడపా దక్షిణాదిలో మూవీస్ చేస్తోంది. ఈ ఏడాది నాని 'హిట్ 3'తో వచ్చింది. సక్సెస్ అందుకుంది. ఇప్పుడు 'తెలుసు కదా' అనే తెలుగు చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. అక్టోబరు 17న థియేటర్లలో రానున్న ఈ మూవీ ప్రమోషన్లలో మాట్లాడుతూ తనని ఫ్రెండ్స్ అందరూ లేడీ ప్రభాస్ అని పిలుస్తారని చెప్పింది. అందుకు గల కారణాన్ని కూడా బయటపెట్టింది. 'నేను ప్రభాస్‌లా సోషల్ మీడియాలో ఎక్కువ ఉపయోగించను. అందుకే నా స్నేహితులందరూ నన్ను లేడీ ప్రభాస్ అని పిలుస్తుంటారు' అని శ్రీనిధి శెట్టి చెప్పుకొచ్చింది. అయితే ఈ విషయమై ప్రభాస్ అభిమానులు భిన్నంగా స్పందిస్తుంటారు. తమ ఫేవరెట్ హీరోకి లేడీ వెర్షన్ అంటే అనుష్కనే అవుతుందని మాట్లాడుకుంటున్నారు. అయితే శ్రీనిధి శెట్టి కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శ్రీనిధి కెరీర్ విషయానికొస్తే.. 2018 నుంచి ఇప్పటివరకు ఐదు సినిమాలు మాత్రమే చేసింది. కేజీఎఫ్ రెండు పార్ట్స్ హిట్ అయ్యాయి. తమిళంలో విక్రమ్ సరసన 'కోబ్రా' చేసింది. ఇది ఫ్లాప్ అయింది. తెలుగులో నానితో చేసిన 'హిట్ 3' ఆకట్టుకుంది.






## మళ్లీ 'సీరియస్' గా శ్రీ విష్ణు



యువ కథానాయకుడు శ్రీ విష్ణు కెరీర్ ఆరంభంలో ఎక్కువగా సీరియస్ సినిమాలే చేసేవాడు. కొంచెం ముభావంగా, సీరియస్‌గా కనిపించే అతడికి ఆ తరహా పాత్రలే సూటవుతాయి అనిపించేది. అప్పట్లో ఒకడుండేవాడు, నీదీ నాది ఒకే కథ లాంటి చిత్రాల్లో సీరియస్ పాత్రలు చేసి మెప్పించాడు శ్రీ విష్ణు. ఐతే తర్వాత తన ఇమేజ్ మారిపోయింది. బ్రోచేవారెవరురా, సామజవరగమన, శ్వాగ్, సింగిల్ లాంటి కామెడీ చిత్రాలతో అతను ప్రేక్షకులను ఇంప్రెస్ చేశాడు. వీటి కంటే ముందు అతను చేసిన సీరియస్ సినిమాలన్నీ తేడా కొట్టాయి. అర్జున ఫల్గుణ, అల్లూరి లంటి సినిమాల తర్వాత ఇక సీరియస్ సినిమాలు చేస్తే వర్కవుట్ కావేమో అన్నట్లుగా వరుసగా ఎంటర్టైనర్లే చేశాడు శ్రీ విష్ణు. ఐతే ఇప్పుడు ఈ యంగ్ హీరో మళ్లీ 'సీరియస్' బాట పడుతున్నాడు. 'కామ్రేడ్ కళ్యాణ్' పేరుతో శ్రీ విష్ణు కొత్త సినిమాను అనౌన్స్ చేశాడు. జానకిరామ్ అనే కొత్త దర్శకుడు ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాడు. నిర్మాణ సంస్థ కూడా కొత్తదే. కోన వెంకట్ సమర్పణలో వెంకటకృష్ణ, సీత అనే డెబ్యూ ప్రొడ్యూసర్లు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో శ్రీ విష్ణు నక్సలైట్ పాత్ర చేస్తున్నాడు. 1992లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని మాడుగుల అనే ప్రాంతంలో జరిగే కథ ఇది. ఇందులో శ్రీ విష్ణు ద్విపాత్రాభినయం కూడా చేస్తున్నాడట. ఐతే నక్సలైట్ కథలకు ఈ మధ్య గిరాకి బాగా తగ్గిపోయింది. వాటిని ఎంత బాగా తీసినా.. ఇప్పటి ప్రేక్షకులకు పెద్దగా ఎక్కట్లేదు. 'విరాటపర్వం' లాంటి మంచి సినిమాకు ఎలాంటి ఫలితం దక్కిందో తెలిసిందే.

## ధనుష్ అదిరిపోయే ప్లాన్.. అప్పుడే మరో సినిమా రిలీజ్..!

యాక్టర్ కమ్ డైరెక్టర్‌గా ఇండస్ట్రీలో ఫుల్ బిజీగా ఉన్న సెలబ్రిటీల్లో ఒకరు ధనుష్. ఇటీవలే ఇడ్లీ కడై సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. ఫ్యామిలీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీ తమిళనాడులో మంచి టాక్‌తో స్ట్రీనింగ్ అవుతోంది. కాగా ధనుష్ నటిస్తోన్న హిందీ ప్రాజెక్ట్ తేరే ఇష్క్ మే నవంబర్‌లో విడుదల కానుంది. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబోలో మూడోసారి వస్తోన్న ఈ చిత్రంలో కృతిసనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. కాగా ఈ సినిమా విడుదల కాకముందే మరో చిత్రానికి సంబంధించిన ఆసక్తికర వార్త నెట్టింట వైరల్ అవుతోంది. %ూశీతీ ు్ట్రశీఓ్ట్రఱశ్రీ% ఫేం విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్న చిత్రం ధనుష్ 54. వేల్స్ ఫిల్మ్ ఇంటర్‌నేషనల్ బ్యానర్‌పై ఇషారి గణేష్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వీ ప్రకాశ్ సంగీతం అందిస్తున్నాడు. ఈ సినిమా షూటింగ్ కూడా ఇప్పటికే పూర్తి చేశాడట ధనుష్. అంతేకాదు ఈ మూవీని 2026 ఫిబ్రవరిలో అభిమానుల ముందుకు తీసుకొచ్చేలా ప్లాన్ చేస్తున్నాడన్న వార్త ఇప్పుడు ఇండస్ట్రీ సర్కిల్‌లో హల్ చల్ చేస్తోంది. ఇదే నిజమైతే ధనుష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో అభిమానులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించనుండటం పక్కా అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. సినిమాలు చేసే విషయంలో ధనుష్ స్పీడును చూసిన అభిమానులు షాకవుతున్నారు.






## జాన్వీ కపూర్ ఇక జాగ్రత్త పడాల్సిందే

ఒకపక్క టాలీవుడ్ లో జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి అగ్ర హీరోల సరసన ఆఫర్లు పడుతున్న బాలీవుడ్ హీరోయిన్ జాన్వీ కపూర్ అటు హిందీలో టయర్ 2 స్టార్లతో జట్టు కడుతూ వరస ఫ్లాపులు మూటగట్టుకుంటోంది. పెర్ఫార్మన్స్ పరంగా తన వంతు లోపం ఏమీ లేకపోయినా సబ్జెక్టు సెలక్షన్ లో చేస్తున్న తప్పుల వల్ల గుర్తుండిపోయే సినిమాలు రావడం లేదు. ఆ మధ్య పరం సుందరి ఏం చేసిందో చూశాం. తాజాగా సన్నీ సంస్కారికి తులసి కుమారితో నిన్న థియేటర్లలో అడుగు పెట్టింది. రెండు పాటలు, కాసింత కామెడీ తప్ప మిగిలినదంతా రొట్ట రొటీన్ వ్యవహారమంటూ క్రిటిక్స్ ఈ మూవీ గురించి గట్టిగా తలంటేశారు.వరుణ్ ధావన్ హీరోగా నటించిన సన్నీ సంస్కారికి తులసి కుమారిలో ఎంటర్ టైన్మెంట్ ని ప్రధానంగా టార్గెట్ చేసుకున్నారు కానీ అది ఎంత రెగ్యులర్ గా వెళ్తోందో దర్శకుడు శశాంక్ కేతన్ గుర్తించకలేకపోయాడు. కథగా చూసుకుంటే సన్నీ (వరుణ్ ధావన్) అనే కుర్రాడికి ప్రాణంగా ప్రేమించిన గర్ల్ ఫ్రెండ్ (సన్యా మల్హోత్రా) హ్యాండ్ ఇచ్చి బాగా డబ్బున్న వాడిని పెళ్లి చేసుకోవడానికి నిర్ణయించుకుంటుంది. దీంతో ఒళ్ళు మండిన సన్నీ ఆ పెళ్లి కొడుకు ఇష్టపడిన తులసి (జాన్వీ కపూర్) అనే అమ్మాయితో చేతులు కలుపుతాడు. కొత్త జంటకు బుద్ధి చెప్పాలని డిసైడై ఒక ప్లాన్ వేసుకుంటారు. దాన్ని తెరమీదే చూసి తరించాలి. అవుట్ డేటెడ్ ట్రీట్ మెంట్ తో సన్నీ సంస్కారికి తులసి కుమారి అధిక శాతం విసుగు తెప్పిస్తుంది. ప్రతి సన్నివేశం ఈజీగా ముందే ఊహించేలా స్క్రీన్ ప్లే సాగడం ప్రధానమైన మైనస్. జాన్వీ, సాన్య పోటీపడి నటించినప్పటికీ పాత చింతకాయ పచ్చడి స్టోరీలో అవి కొట్టుకుపోయాయి.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com